VISALAANDHRA, VIJAYAWADA Phone 376
ఉదయం
* * Regd No. H. 203
విశాలాంధ్ర
[illegible]
సంపుటి 16, సంచిక 50 ] విజయవాడ 14—5—1966 శనివారం [ 6 పేజీలు 10 పై.

ంధ్ర 3

విశాలాంధ్ర
చందా వివరాలు

| | ఏజెంటుద్వారా | పోస్టుద్వారా |
|---|---|---|
| సంవత్సరం | రు. 38 00 | రు 45 00 |
| ఆరు మాసాలు | 19 00 | 22 50 |
| మూడు మాసాలు | 9 75 | 11 25 |
| ఒక మాసం | 3 25 | 3 75 |

అశోకా శాండల్
ఫేస్ - టాల్కం - ఆల్ పర్పస్ పౌడర్లు
ఉత్తమమైన మైసూరు చందనముతో తయారు చేయబడినవి. వీటిని ఉపయోగించిన. దినమంతా దేహమును చల్లగా నుంచి, తాపం తెలియనివ్వదు. ముఖ్యము. మొటిమలు. చెమట గుల్లలు వగైరా చర్మ వ్యాధులను ఉపశమింపచేయును
విజయా కెమికల్స్,
మద్రాస్ - 7

# ప్రపంచ బ్యాంకు పరిశీలనకు త్వరలో నాల్గవప్రణాళిక నివేదన

## లోక్ సభలో తన అమెరికాయాత్రపై ప్రకటనచేస్తూప్లానింగ్ మంత్రి శ్రీ అశోక్ మెహతావెల్లడి

### మనం తయారుచేసే ప్రణాళికనుబట్టే విదేశీ సహాయం ఆధారపడివుంటుందట

న్యూఢిల్లీ, మే 13

మనం తయారుచేసే నాల్గవ ప్రణాళికనుబట్టి అమెరికా ఆర్థిక సహాయం ఆధార పడి వుంటుందని కేంద్ర ప్రణాళికా శాఖామంత్రి శ్రీ అశోక్‌మెహతా నేడు లోక్‌సభలో ప్రకటించారు.

నాల్గవ ప్రణాళికను రూపొందించిన పిమ్మట దానిని ప్రపంచ బ్యాంకి పరిశీలనకు నివేదిస్తామని కూడా శ్రీ అశోక్ మెహతా లోక్‌సభలో తన అమెరికా యాత్రపై ప్రకటనచేస్తూ పేర్కొన్నారు.

న్యూఢిల్లీ, మే 13

ప్రపంచ బ్యాంక్‌నుండి. అమెరికా, కెనడా దేశాలనుండి సహాయంకోసం మనం గావించిన అభ్యర్థనలపట్ల చాలా 'సుముఖత' వ్యక్తమైంది. దాని ఆధారంమీద మనం ఆత్మవిశ్వాసంతో మరింత వేగంగా స్వయం సమృద్ధి సాధన దిశగా పురోగమించగలం.

మన ప్రాజెక్టేతర అవసరాలకు తమ పార్లమెంటు ఆమోదించిన మేరకు ప్రపంచ బ్యాంకు సిఫారసులను అనుసరించి తమ వంతు సహాయం అందజేయగలమని అమెరికా ప్రభుత్వ అధికారులు సూచించారు.

గత సెప్టెంబర్‌లో సహాయం నిలిపివేసిన ప్రాజెక్టులలో కొన్నిటికి తాము సూచించిన

(మిగతా 2 వ పేజీలో)

### విజయవాడలో తాత్కాలిక రూట్లలో బస్సుల ప్రారంభం

(విశాలాంధ్ర విలేకరి)

విజయవాడ, మే 13

విజయవాడలో తాత్కాలిక బస్సురూట్లలో ప్రయాణీకుల బస్సులు యీరోజు ఉదయం 5½ గంటలనుండి నడవడం ప్రారంభమయ్యింది.

ఇవి రాత్రి 10½ గంటలవరకూ నడుస్తాయి. పాతరూట్లలో ఒక్కొక్క రూటులో రెండు చొప్పున యీ బస్సులు నడుస్తాయి. ఇందుకు ఆర్. టి. వో. పర్మిట్లు గ్రాంటు చేశారు.

### డి. ఏ. సమస్యపై ఆర్థిక మంత్రితో సంప్రతింపులు

న్యూఢిల్లీ, మే 13

అల్పవేతనాలుపొందే ఉద్యోగులకు, ధరలు పెరిగినప్పుడల్లా కరువుభత్యం పెంచటంగాక, నిత్యావసర సరుకుల్ని సరసమయిన ధరలకు అందించే పథకంగురించి. కేంద్ర ఆర్థిక మంత్రి సచీన్ చౌదరితో, కేంద్ర ప్రభుత్వోద్యోగుల సంఘాలతో సంబంధం వున్న పార్లమెంటుసభ్యులు ఈరోజు చర్చలు జరిపారు.

ఈ రోజు జరిగిన చర్చలు కేవలం ప్రాథమికమైనవేనని. తిరిగి 18వ తేదీన చర్చలు జరుగుతాయని తెలుస్తోంది.

ఆరోజు సమావేశానికి కేంద్ర ఉద్యోగుల సంఘాల ప్రతినిధుల్ని కూడా ఆర్థికమంత్రి ఆహ్వానించాడు.

### విజయవాడలో పేదల అగచాట్లు

### కాందిశీక శిబిరంగా మారిన విజయవాడ

విజయవాడ, మే 13

విజయవాడ నగరం నేడొక కాందిశీక నగరం వలె గోచరిస్తున్నది.

ఖాళీప్రదేశాలలో, మైదానాలలో వందలాది కుటుంబాలు తాత్కాలిక వసతి ఏర్పాటు చేసుకొని, అనుక్షణం ఆందోళనతో, కంటిమీద కునుకు లేకుండా కాలక్షేపం చేస్తున్నారు.

నేడు ఎండ తీవ్రత చాలా హెచ్చుగా వున్నది. అయినా పేద కుటుంబాలు అరుబయట మండుటెండలలో చాపలను ఆచ్ఛాదనం చేసుకొని జీవిస్తున్న దృశ్యాలే ప్రతిచోటా ఎదురౌతున్నాయి.

అగ్ని ప్రమాదాల మూలంగా నిరాశ్రయులైన 6 వేల కుటుంబాలు భయాందోళనకొద్దీ తమ పూరి కొంపలను వదిలి అరుబయట జీవిస్తున్న మరికొన్నివేల కుటుంబాలు పడుతున్న అవస్థలు యిన్నీ అన్నీకావు.

అసలే మండుటెండలు - పైగా మంచినీటి కొరత - ఎండిపోయిన బావులు వీటన్నిటికీ తోడు పెద్దఎత్తున సంభవిస్తున్న అగ్ని ప్రమాదాలు. విపరీతమైన-భయాందోళనలు వీటన్నిటితో విజయవాడ నగరం నేడు అట్టుడికి పోతున్నదంటే అతిశయోక్తికాదు.

పేద కుటుంబాలు ఆరుబయటనే వంటలు అక్కడే భోజనాలు. అక్కడనే పడక. పిల్లలు. వృద్ధులు సైతం ఎండలోనే. వడదెబ్బతోనే. వడదెబ్బ తగిలే ప్రమాదం గురించిన భయాందోళనలు అధికమవుతున్నాయి.

### శ్రీ షేక్ అబ్దుల్లాపై నిర్బంధాలు తొలగవు

### ఆయన అభిప్రాయాలలో మార్పేమీ కనబడదని రాజ్యసభలో శ్రీ నందా

న్యూ ఢిల్లీ, మే 13

షేక్ అబ్దుల్లాయెడ అమలు జరుగుతున్న నిషేధాలూ, నిర్బంధాలూ, రద్దుచేయడానికి వీలుగా ఆయన ధోరణిలో మార్పేమీ కనబడలేదని నేడు హోంమంత్రి శ్రీ నందా రాజ్యసభలో చెప్పేరు.

ప్రొఫెసర్ ఎస్. సిద్ధాంతాలంకార్ ప్రశ్నకు సమాధానం ఇస్తూ శ్రీ నందా ఇల్లా అన్నారు:

ప్రభుత్వానికి తెలిసినంతవరకు షేక్ అబ్దుల్లా ధోరణిలో ఏమాత్రం మార్పు వచ్చిందనే హామీ ఏమీ లేదు. ఈ దేశంలో తన స్థానంగురించి ఆయన ఏమనుకొంటున్నాడో మనకునిర్ధారణ కావాలి. ఇంతవరకు ఆయనతో సంబంధం వున్నవారు చెప్తున్న దానినిబట్టి ఆయనలో మంచికి మార్పువచ్చినట్లు కనబడదు. ఇప్పటివరకు మనకు తెలిసిందది. ఏ క్షణంలో అయినా మార్పురావచ్చు. అలావచ్చినప్పుడు ప్రభుత్వం సందేహించడం జరగదు. కాని ఆ మార్పు కేవలం ఊహలమీద ఆధారపడిందిగాకన్ప స్పష్టమయినదిగా వుండాలి" అన్నారు.

షేక్ అబ్దుల్లానూ, ఆయన సహచరులను విడుదల చేయవలసిందిగా కోరుతూ శ్రీ జయప్రకాశ్ నారాయణ్ చేసిన ప్రకటనను పత్రికలలో చదివానని శ్రీ నందా అంతకుపూర్వం శ్రీమతి లలితా రాజగోపాలన్ ప్రశ్నకు సమాధానం ఇచ్చారు. "అయన మీద విధించిన నిషేధాలనూ నిర్బంధాలనూ తొలగించడానికై ప్రభుత్వం నిర్ణయం చేయలేదు"- అన్నారు.

ఉప ప్రశ్నలకు సమాధానం ఇస్తూ సర్వోదయ కార్యకర్తల ప్రతినిధు లిద్దరు షేక్ అబ్దుల్లాను కలుసుకొన్నారన్నారు.

### కేరళ తిరుగుబాటు కాంగ్రెసులో చీలికలు

విలీనీకరణ సమస్యపై

తిరువనంతపురం, మే 13

కేరళ ప్రదేశ్ కాంగ్రెస్‌లో విలీనమయ్యే సమస్యపై కేరళ తిరుగుబాటు కాంగ్రెస్‌లో రెండు చీలికలు ఏర్పడే ప్రమాదం వున్నట్లు తెలుస్తున్నది.

కేరళ తిరుగుబాటు కాంగ్రెస్‌లో వున్న భేదాభిప్రాయాలు పరిష్కరించ బడకపోతే చీలిక అనివార్యమని, ఫలితంగా కేరళ ప్రదేశ్ కాంగ్రెస్‌కు లాభించే అవకాశం వున్నట్లు తెలుస్తున్నది.

ఏప్రిల్ 30 న కొట్టాయంలో కేరళ తిరుగుబాటు కాంగ్రెస్ కార్యవర్గం సమావేశమయింది. కాంగ్రెస్‌తో విలీనమయ్యే సమస్యపైన చర్చజరిగింది. చర్చలు తీవ్రంగా సాగాయి.

కొంతమంది సభ్యుల తెలివితేటల ఫలితంగా సమావేశం ఒక కొలిక్కి వచ్చింది. అయినా నిర్ణయాలు చేయలేకపోయారు.

డబ్బు,కార్లు లేని కారణంగా తమ ఎన్నికల ప్రచారాన్ని చెయ్యలేమని చెప్పారు. కొంతమంది సభ్యులు తమకున్న ఆస్తిపాస్తులను ఎన్నికలలో ఉపయోగిస్తామని చెప్పారు.

కేరళ తిరుగుబాటు కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షుడు శ్రీ కె. యం. జార్జికి ఎన్నికల ప్రచారానికై సమావేశంలో ఒకసభ్యుడు మోటారు యిస్తానని వాగ్దానం చేశారు ఈయన మోటారు డీలరు కూడా.

కాంగ్రెస్‌లో విలీనం కావాలన్న సభ్యులకు మన్నాత్ పద్మనాభన్ ఆశీర్వాదాలు వున్నట్లుకూడా తెలుస్తున్నది.

### వెయ్యిమంది సాయుధనాగాల ఉక్రల్ ప్రవేశం

న్యూఢిల్లీ, మే 11

నాగా ఫెడరల్ సైన్యానికి చెందిన వారని చెప్పబడే వెయ్యిమంది సాయుధులైన నాగాలు ఇటీవల మణిపూర్ సబ్‌డివిజన్ అయిన ఉక్రల్‌లోకి ప్రవేశించినట్లు వార్తలందాయని సహాయమంత్రి శ్రీ జె. ఎల్. హాథీ నేడు లోక్‌సభలో తెలియజేశారు.

శ్రీ హాథీ ఒక సభ్యుని ప్రశ్నకు సమాధానం చెప్తూ పై విషయం వెల్లడించారు. ఈ సాయుధులైన నాగులు నాగభూమినుంచి ఈ ప్రాంతంలో ప్రవేశించి అడవులలోను, వివిధ ప్రదేశాలలోను స్థావరాలు ఏర్పరచుకొన్నారని ఆయన తెలిపారు.

సాయుధులైన కొందరు మిజోలు, పైటీస్, హైటీస్ తెగలకు చెందిన కొందరితో కలిసి మిజోజిల్లా, మణిపూర్ సబ్‌డివిజన్ అయిన చురచాంద్‌పూర్ సరిహద్దున సమీకరించబడుతున్నారన్న వార్తలు అందాయని ఆయన శ్రీపన్నాలాల్‌కుసమాధానంగాచెప్పారు

### అమెరికాలో అశోక మెహతా అవమానకర ప్రకటనలకు నిరసనగా లోక్ సభలో వాకౌట్

న్యూఢిల్లీ, మే 13

కేంద్ర ప్లానింగు మంత్రి శ్రీ అశోక్ మెహతా నేడు లోక్ సభలో తన వాషింగ్టన్ యాత్రపై ప్రకటన చేయడానికి లేవగానే, కమ్యూనిస్టు సభ్యులంతా సభనుంచి వాకౌట్ చేశారు.

శ్రీ అశోక్‌మెహతా అమెరికాలో చేసిన కొన్ని ప్రకటనలు భారతజాతికి అవమానం కల్పించేవిగా వున్నవని కమ్యూనిస్టు నాయకులు శ్రీ హిరేన్‌ముఖర్జీ సభనుంచి నిష్క్రమించటానికి ముందు ఆక్షేపణ తెలిపారు.

"విదేశ పెట్టుబడికి భారతదేశ గర్భకోశం తెరచుకొని వున్నద"ని శ్రీ అశోక్ మెహతా అన్న మాటలు చాలా అసభ్యకరంగా వున్నవని హిరేన్‌ముఖర్జీ విమర్శించారు.

బయటా, లోపలా కూడా యీ సభపట్ల అపూర్వ అపచారం జరిగింది అని శ్రీ హిరేన్‌ముఖర్జీ వ్యాఖ్యానించారు.

తాను నిన్న వచ్చిన సభాహక్కుల తీర్మానంమీద యిచ్చిన రూలింగు దృష్ట్యా. శ్రీ ముఖర్జీ వ్యాఖ్య అభ్యంతరకరమని స్పీకర్ అన్నారు.

తన ప్రకటనకు ఒక విదేశం అనుమతి పొందవలసి వున్నట్లు శ్రీ మెహతా స్వయంగా చెప్పారని ఆయన అన్నారు.

ఒక విదేశం ఆమోదించినమీదట చేయబడుతున్న యీ ప్రకటనను తాము వినవలసిన అవసరం యేమీలేదని భావిస్తున్నామని చెప్పి ఆయన వాకౌట్ చేశారు.

సభనుండి నిష్క్రమిస్తూ కమ్యూనిస్టు సభ్యులు ప్రధాన మంత్రి గురించి, ప్రణాళికా మంత్రి గురించి యేవో కొన్ని వ్యాఖ్యలు చేశారు.

ఆ వ్యాఖ్యలనుసభ రికార్డులో నమోదు చేయరాదని స్పీకర్ ఉత్తర్వు చేశారు. ముఖర్జీ తనను పదే పదే దూషిస్తున్నారని శ్రీ మెహతా స్పీకర్‌కు ఫిర్యాదు చేశారు.

సభా కార్యక్రమానికి అడ్డుతగులుతున్నారంటూ, స్పీకర్ శ్రీ యస్. యం. బెనర్జీని హఠాత్సభనుండి బయటకు వెళ్ళమని ఆదేశించారు.

మెహతాను ముందు సభనుండి బైటకు పంపండి. అతను దేశాన్ని అమ్మి వేస్తున్నాడు.

### చుట్టుగుంటవద్ద 5 ఇండ్లు దగ్ధం

(విశాలాంధ్ర విలేకరి)

విజయవాడ, మే 13

నేడిక్కడ చుట్టుగుంటవద్ద బావ సత్యం ఇంటిలో ఉదయం 8 గంటలకు అగ్ని ప్రమాదం సంభవించింది. 5 ఇండ్లు దగ్ధమైపోయాయి.

ఇక్కడే మొన్న మరో 5 ఇండ్లు తగులబడినాయి.

బావ సత్యం తన ఇంటిని అద్దెకిచ్చి పట్టణంలో కలప అడితీవద్ద వుంటున్నాడు. ఇతని ఇంటిలో అద్దెకుంటున్నవారు. గత రెండు-మూడు రోజులుగా పట్టణంలో జరుగుతున్న అగ్నిప్రమాదాలకు భయపడి సామానులన్నింటినీ తీసికొని, దగ్గిరలో మండుటెండలో కాలం గడుపుతున్నారు.

అంతకుముందు ఒక గంటక్రితం మారుతీనగర్ సమీపంలో ఒక యింటికి నిప్పంటుకుంది. ఆ రెండు సంఘటనల్లోనూ అగ్నిమాపక దళాలు హుటాహుటినివచ్చి మంటలను అదుపులోకి తీసుకొనివచ్చాయి.

### లబ్బీపేటలో ఒకే యింటిలో మూడవసారి అగ్నిప్రమాదం

లబ్బీపేటలో నిన్నామొన్నా ఒకే యింటినుండి అగ్ని బయలుదేరింది. ఇదే ఇంటిలో

(మిగతా 6 వ పేజీలో)

### నందివెలుగులో మళ్లీ అగ్నిప్రమాదం

### 100 వాములు, 100 ఇళ్లు దగ్ధం

(విశాలాంధ్ర విలేకరి)

గుంటూరు, మే 12

గుంటూరు జిల్లా తెనాలి తాలూకా నందివెలుగులో నిన్న సాయంకాలం జరిగిన అగ్ని ప్రమాదంలో 100 గడ్డివాములు, 100 నివాసగృహాలు పరశురామప్రీతి అయ్యాయని గుంటూరు అగ్నిమాపకదళ కార్యాలయానికిచేరిన సమాచారంవలన తెలియవచ్చింది.

దాదాపు లక్ష రూపాయల ఆస్తి నష్టమయినట్లుగా తెలియవస్తున్నది.

#### వెల్లటూరులో

రేపల్లెతాలూకా వెల్లటూరులో నిన్న సంభవించిన అగ్నిప్రమాదానికి 15 ఇండ్లు, 8 గడ్డివాములు బూడిద అయ్యాయని నేడిక్కడకు అందిన సమాచారం తెలియజేస్తున్నది.

తెనాలినుండి అగ్నిమాపకదళాలు మంటలను అదుపులోకి తేవటానికై వెల్లటూరు వెళ్ళాయని తెలుస్తున్నది.

రు 25 వేల ఆస్తి నష్టమయినట్లు తెలుస్తున్నది.

---

బ్రిటిష్ ప్రధాని విల్సన్ చైనా అణ్వాస్త్ర పరీక్షను నిరసించారు.

### స్థానిక సంస్థలనుండి శాసనమండలికి జూన్ 15 పోలింగ్

న్యూఢిల్లీ, మే 12

ఆంధ్రప్రదేశ్ స్థానిక సంస్థలనుండి రాష్ట్ర శాసనమండలికి జరిగే ఎన్నికల కార్యక్రమాన్ని ఎలక్షన్ కమిషన్ ప్రకటించింది. మే 21 లోపల నామినేషన్లు వేయాలి. మే22న నామినేషన్ పరిశీలన జరుగుతుంది. మే 26 లోపల ఉపసంహరణ చేసుకోవచ్చు. పోలింగ్ జూన్ 15న జరుగుతుంది.

### పి. టి. ఐ. వార్తాసంస్థపై కామత్ హక్కుల తీర్మానం

### అశోక్ మెహతా పార్లమెంటు ప్రకటనకు అమెరికా అనుమతి కోరారనే వార్త విషయంలో

న్యూఢిల్లీ, మే 13

అమెరికా, ప్రపంచ బ్యాంక్‌ల నుండి భారత దేశానికి లభించే సాయం విషయమై వాషింగ్‌టన్‌లో జరిపిన సంభాషణల గురించి భారత పార్లమెంటులో చేయబోయే ప్రకటనకు అనుమతిని పొందటం కోసం ప్రణాళికామంత్రి అశోక్ మెహతా న్యూయార్కునుండి స్వదేశానికి బయలుదేరేముందు ప్రపంచ బ్యాంకు అధ్యక్షుని కలుసుకొన్నారని వార్త పంపినందుకు పి టి ఐ. వార్తాసంస్థపై హక్కుల తీర్మానానికి లోక్‌సభలో శ్రీ హెచ్. వి. కామత్ ఈరోజు నోటీస్ ఇచ్చారు

పార్లమెంటులో చేయబోయే ప్రకటనకు అమెరికా, ప్రపంచబ్యాంక్ వద్ద ముందు అనుమతిని పొందటానికి అశోక్‌మెహతా యత్నించటం సభాహక్కులకు భంగకరమని మొన్న కమ్యూనిస్టు సభ్యురాలు శ్రీమతిరేణూ చక్రవర్తి హక్కుల తీర్మానానికి నోటీస్ యిచ్చారు.

తనలా అమెరికా అనుమతికోసం ప్రయత్నించలేదని, ఆ విషయమై కొన్ని వార్తా సంస్థలు పంపిన వార్తలు యదార్థంకాదని అశోక్‌మెహతా ఖండించిన మీదట లోక్ సభ స్పీకర్ శ్రీమతి రేణూచక్రవర్తి తీర్మానాన్ని నిరాకరించారు.

తన తీర్మానంపై ఈరోజు కామత్ మాట్లాడుతూ పార్లమెంటులో ప్రకటనకు అమెరికా అనుమతిని తాను కోరలేదని ప్రణాళికామంత్రి నిన్న సభలో చెప్పారని, కాని ఆయన ఆ విషయమై పి. టి. ఐ. విలేకరి పంపిన వార్తను ఖండించలేదని అన్నారు.

ముందు ఏవో మాట్లాడి. తీరా చిక్కున పడేసరికి. తాను చెప్పిన విషయాలను పత్రికలవారు సరిగా ప్రకటించలేదని చెప్పటం ప్రభుత్వ నాయకులకు అలవాటుగా వుందని. మంత్రి అయిన కొద్ది కాలంలోనే మెహతాకుకూడా అటువంటి అలవాటు అబ్బిందని కామత్ విమర్శించారు.

గత ఏడాది హోంమంత్రి పబ్లిక్ అక్కౌంట్స్ కమిటీపై పత్రికలవారితో మాట్లాడుతూ కొన్ని వ్యాఖ్యానాలుచేసి. తర్వాత తనలా అనలేదని చెప్పినప్పుడు మంత్రిచెప్పింది ఎంత వరకు పత్రికలు వాస్తవంగాప్రకటించాయో? పరిశీలించటం జరిగిందని అన్నారు.

అందువల్ల ఇప్పుడు పి. టి. ఐ. విలేకరి తప్పుగా తన రిపోర్టు వ్రాశారో, లేకమంత్రిగారే అబద్ధం చెప్పారో స్పీకర్ పరిశీలించాలని కామత్ కోరారు. పి. టి. ఐ. విలేకరి తప్పు చేస్తే ఆ వార్తాసంస్థపై చర్యతీసుకోవచ్చునని, లేక మంత్రిగారే అబద్ధం ఆడినట్లు తేలితే తిరిగి ఆయనవద్ద సంజాయిషీ అడగవచ్చునని కామత్ చెప్పారు.

న్యాయశాఖ మంత్రి అభిప్రాయాన్ని స్పీకర్ కోరగా, తీర్మానాన్ని ఆమోదించటం, ఆమోదించక పోవటం సభాధ్యక్షుని యిష్టాయిష్టమని ఆయన అన్నారు.

పి. టి. ఐ. వార్తాసంస్థకు వ్రాసి. అసలు సంగతి ఏమిటో పరిశీలిస్తానని స్పీకర్ అన్నారు.

### ఉష్ణోగ్రత

విజయవాడ, మే 12

ఈ రోజు మధ్యాహ్నం 3-00 గంటలకు విజయవాడలో ఉష్ణోగ్రత 116 ఫారన్ హీట్ డిగ్రీలు ఉంది

### ఆంధ్రలో అదనపు రైల్వే సౌకర్యాలు

పార్లమెంటరీ సలహా సంఘం సిఫారసు

న్యూఢిల్లీ, మే 13

హైదరాబాద్. కాజీపేట. బెజవాడలమధ్య రైళ్ళన్నింటికీ డీసెల్ ఇంజన్లేర్పాటుచేయాలని రైల్వే మంత్రిత్వశాఖ పార్లమెంటరీసలహా సంఘం ప్రభుత్వానికి సిఫారస్ చేసింది.

విజయవాడ- బొంబాయిలమధ్య. వాల్తేరు నుంచి కాట్నీ. అలహాబాద్‌ల మీదుగా ఢిల్లీకి నూతనంగా పాసింజర్ రైళ్ళను వేయాలని. లక్నో - మద్రాసులమధ్య, లక్నో - బొంబాయిలమధ్య సరాసరి రైళ్ళు ప్రవేశపెట్టాలని సలహాసంఘం సూచించింది.

లక్నోనుంచి ఈరెండు స్టేషన్లకు వేస్తున్న ప్రత్యేక బోగీలు అవసరాలకు చాలటం లేదని సభ్యులు అన్నారు.

హైదరాబాద్. నాసిక్‌లలో, రిటైరింగ్ రూమ్ సౌకర్యాలు కల్పించాలని సూచించారు.

తీవ్రమైన నీటి కరువుకు గురవుతున్న కొన్ని ఆంధ్ర ప్రాంతాలలో నీటి సరఫరాకు రైళ్ళను వినియోగించాలని కొందరు సూచించారు.

### బ్లాక్ లిస్టు కంపెనీలకు ముడిసరుకుల సప్లయి

### ప్రభుత్వ విధానంపై లోక్‌సభలో అన్నిపక్షాల సభ్యుల తీవ్రవిమర్శ

న్యూఢిల్లీ. మే 13

'బ్లాక్‌లిస్ట్'లో వున్న కంపెనీలకు అతి ముఖ్యమయిన ముడి పదార్థాలను ఇస్తూవుండే పద్ధతి ననుసరిస్తూ వుంటున్నందుకు నేడు లోక్‌సభలో ప్రభుత్వాన్ని కాంగ్రెసు సభ్యులూ, ప్రతిపక్ష సభ్యులూ కూడ చాల తీవ్రంగా విమర్శించారు.

మెటీరియల్స్ ప్లానింగ్ మంత్రి శ్రీ కె. రఘురామయ్య చేసిన ప్రకటనమీద ఈ విమర్శలు వచ్చాయి. బ్లాక్‌లిస్టులో చేర్చినా, ప్రభుత్వానికి సరఫరాలు చేయటం మానివంచినా వెనువెంటనే ముడిపదార్థాల కోటాలు నిలుపటం జరగదని ఆయన తమ ప్రకటనలో తెలిపారు.

మెస్సర్స్ అమీన్‌చంద్ ప్యారేలాల్, ఖేమ్‌చంద్ రాజ్‌కుమార్, రామకృష్ణకుల్వంత రాయ్. జి. కోహిన్ అండ్ కంపెనీలను బహు తీవ్రమైన తప్పు పనులు చేసినందుకు బ్లాక్ లిస్టులలో చేర్చడమో. వారితో వ్యాపారం మానుకోవటమో జరిగిందాయని శ్రీ రాజేశ్వరపటేల్ ప్రశ్నించారు. "అయినా వారి ఫ్యాక్టరీలకు మామూలుగానే ముడి సరుకుల కోటాలు ఇస్తూనే వున్నారా"యని ఆయన ప్రశ్నించారు.

1954 మే నుండి 1957 జనవరి వరకూ ఒక్క అమీన్‌చంద్ ప్యారేలాల్ మాత్రమే బ్లాక్‌లిస్టులో వున్నారని మంత్రి చెప్పారు. మిగిలిన కంపెనీలను సప్లయిలశాఖ డైరెక్టర్ జనరలు బ్లాక్‌లిస్టులో చేర్చనూలేదు. వారితో లావాదేవీలు విరమించనూలేదు - అన్నారు.

బ్లాక్‌లిస్టులోవున్న కంపెనీలకు ఏ పాటి విలువగల ముడిపదార్థాలు ఇచ్చారో సమాచారం తమవద్దలేదు అన్నారు.

అమీన్‌చంద్ ప్యారేలాల్ కంపెనీ వ్యవహారాలనుగురించీ. ఆ కంపెనీకి ఇటీవలి కాలంలో అందచేసిన ముడిసరుకులను గురించీ సభ్యులు ఎన్నో ప్రశ్నలు వేశారు.

బ్లాక్‌లిస్టులో చేర్చబడిన అమీన్‌చంద్ కొత్త పేర్లతో కొత్త కంపెనీలను ప్రారంభించి. ముడిపదార్థాలు సంపాదిస్తున్నారాయని శ్రీ ప్రకాష్ వీర్‌శాస్త్రి ప్రశ్నించారు.

పార్లమెంట్ పబ్లిక్ అక్కౌంట్స్ కమిటీ ఆ కంపెనీని గురించి వ్యతిరేకంగా వ్యాఖ్యానించిందా? కంపెనీలతో వ్యవహారాల సందర్భంగా ఒక మంత్రినీ. కార్యదర్శినీ పేర్కొనటం జరిగిందా? యని ఆయనే అడిగారు.

ఇనుము, ఉక్కు శాఖ మంత్రి శ్రీ టి. ఎన్. సింగ్ మధ్యలో కలిగించుకుని - ఆ కమిటీ నివేదికవచ్చి ఇంకా వారంకూడా కాలేదనీ. సభ్యుని ప్రశ్నలను తన డిపార్టుమెంటు గమనికలో వుంచుతుంటుందనీ అన్నారు.

"ఆ వ్యవహారాలలో ఒక మంత్రికి ప్రమేయంవుందా? వుంటే ఆ మంత్రి పేరేమిటో చెప్పాలి అని శ్రీ మహావీర్ త్యాగి, భాగవత్ ఝా ఆజాద్‌గార్లు గట్టిగా నిలదీశారు.

పబ్లిక్ అక్కౌంట్స్ కమిటీయే మంత్రి మీదా ఎటువంటి ఆరోపణలూ చేయలేదని. ఆనాటి కార్యదర్శి గురించి మాత్రం వ్యాఖ్యానించిందనీ శ్రీ సింగ్ అన్నారు,

### స్వదేశీయ సాంకేతిక పరిజ్ఞానంపట్ల చిన్నచూపు

### అప్పుడప్పుడు ఫిర్యాదులువస్తున్నాయని రాజ్యసభలో విద్యామంత్రి చాగ్లా ప్రకటన

న్యూఢిల్లీ. మే 13

దేశీయ సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకునే విషయంలో తగు శ్రద్ధ చూపటంలేదని అప్పుడప్పుడు ఫిర్యాదులు వస్తున్నవని కేంద్ర విద్యామంత్రి చాగ్లా ఈ రోజు రాజ్యసభలో చెప్పారు.

విదేశీ దిగుమతుల్ని తగ్గించుకొని. వాటి స్థానే స్వదేశీ వస్తువుల్ని వాడుకోవాలనే లక్ష్యానికి తిలోదకాలు యిచ్చి, రానురాను అమెరికా సాయంపై ఎక్కువ ఆధారపడే స్థితికి దిగజారుతున్నామని అప్తిన్ అరోరా చేసిన ఫిర్యాదు యదార్థమైనదికాదని విద్యామంత్రి చెప్పారు.

విదేశీ వస్తువులకుబదులు స్వదేశీ వస్తువుల వినియోగించుకోవాలనే విధానాన్ని విస్మరించటం జరగదని, స్వదేశీ సరుకుల్ని వినియోగించుకోవటం క్రమంగా ఎక్కువకాగలదని మంత్రి ఆశాభావాన్ని వ్యక్తంచేశారు.

శ్రీశైలం

ముసక

# ప్రత్యేకాగ్ని బాధితులకు ము సహాయ కార్యక్రమాలు

విజయవాడలో జరిగిన అగ్ని ప్రమాదాలు,ప్రమాదవశాత్తు జరిగినవేననీ, ఈ ప్రమాద స్థలాలను సందర్శించిన అనంతరం రాష్ట్ర రెవిన్యూమంత్రి శ్రీ నూకల రామచంద్రారెడ్డి ప్రకటించారు. గురువారం సాయంత్రం విజయవాడ పత్రికా విలేకరులతో ఆయన మాట్లాడుతూ, రాజకీయ స్పర్థల ఫలితంగా ఈ ప్రమాదాలు సంభవించాయనే పుకార్లను ఖండించారు.

గృహదహనాల ద్వారా రాజకీయ ప్రయోజనాలను కాని, కక్షలను కాని సాధించుకొన జూచేవారు ఎవరైనాఉండి వుంటే వారుకేవలం మూర్ఖులు; ప్రజలకు పరమవిరోధులు మాత్రమే అవుతారు. అందుచేత ఇంగితజ్ఞానం వున్న ఏ రాజకీయ పక్షము కావాలని ఇట్టి ప్రజావిరోధాన్ని కొనితెచ్చుకోదు. ఆ విధంగా తెచ్చుకోవడం ఆ పక్షం యొక్క అంతానికే దారి తీస్తుంది. అందుచే రాష్ట్ర రెవిన్యూ మంత్రి ప్రకటించినట్లు ఈ అగ్ని ప్రమాదాల వెనుక ఏవో రాజకీయస్పర్థలు పనిచేస్తున్నవనే ప్రచారానికి తావులేదు. అది నమ్మదగింది ఎంతమాత్రం కాదు.

అయితే ఎక్కడా లేనివిధంగా విజయవాడలో ఇంత తరచుగా, ఇంత విస్తృతంగా అగ్ని ప్రమాదాలు ఎందుకు జరుగుతున్నాయనే ప్రశ్న ప్రతివారిని కలవరపరుస్తూంది. ఇందుకు విజయవాడ పట్టణంలో కొన్ని నివాసప్రాంతాలు విస్తరించుతున్న అస్తవ్యస్త పద్ధతిలోనే మూలకారణం వున్నట్లు ఈ అగ్నిప్రమాదాల తీరునుబట్టి స్పష్టమవుతూంది.

విజయవాడ పాత టౌనుకు సర్వసాధారణంగా లేని ఈ అగ్ని ప్రమాదాల బెడద కొత్త టౌను ప్రాంతానికే ఎందుకు పరిమితం అవుతున్నది? ప్రభుత్వం, ప్రజలు కూడా ఇది ముఖ్యంగా గమనించదగ్గ విషయం. కొత్తగా అభివృద్ధి చెందుతున్న యీ కొత్త పట్టణ ప్రాంతంలోనే తాటాకు, పూరి ఇళ్లు ఎక్కువగా వున్న పేట లున్నాయి. క్రిక్కిరిసిపోయిన పేదల నివాస ప్రాంతాల్లో వీధులు, సందులుకూడా లేకుండా ఇంటిమీద ఇల్లుఅన్నట్లుగా నిర్మించుకొనడం జరుగుతూంది. ప్రభుత్వ పోరంబోకల్లోనే కాక, క్రొత్త పట్టణ మంతటా ఎక్కడ ప్రయివేటు స్థలాలుంటే అక్కడ అద్దెలకు జాగాలు తీసుకొని వేసిన ఇటువంటి క్రిక్కిరిసిన పేదల నివాస ప్రాంతా లనేకం ఉన్నాయి. దీనికితోడు డాబాలపై పూరిపాకలు, గడ్డివాములు కూడా హెచ్చుగా వున్నాయి.

ఏమరుపాటువలనగాని, ఏ చిన్న పొరపాటువలన గాని నిప్పు అంటుకుంటే, అది ఆ ఇంటికే ఎన్నడూ పరిమితం కాక, అగ్ని మాపక యంత్రాలు వచ్చేలోపుగానే కనీసం రెండుమూడిళ్ళకు పాకడం, అగ్ని మాపక యంత్రాలు వచ్చిన తరువాతకూడా నీరు వెంటనే లభ్యం కాక మంటలు అదుపులోనికి తీసుకురావడం అసాధ్య మవుతూంది. దీనితో ప్రక్కనున్న పేటలకుకూడ మంటలు వ్యాప్తి చెందడం సర్వసాధారణంగా జరుగుతోంది.

అసలు మంటలు ఆర్పడానికి విజయవాడలో నీరే లభ్యం కాకపోవడం అన్నిటికంటే శోచనీయమైన విషయం. పట్టణంలో అగ్ని మాపక యంత్రాలు నీరు తీసుకొనడానికనువైన హైడ్రాంట్స్ తగినన్ని లేవని తెలుస్తూంది. వేసవి గనుక కాలువలలో నీరు లేదు. నూతుల్లో అంతంతమాత్రంగా నీరు ఉండటం. మున్సిపల్ కుళాయిల్లో కూడా ఈ అగ్ని ప్రమాదాలు జరిగిన సమయాల్లో తగు నీటిసరఫరా లేకపోవడం సంభవించింది.

పది సంవత్సరాల క్రితం జనాభానుబట్టి అగ్నిమాపకదళా లున్నవి తప్పితే, ఈలోగా పెరిగిన రెట్టింపు జనాభాకు, విస్తరించిన నివాస ప్రాంతాలకు అనుగుణ్యంగా విజయవాడలో అగ్నిమాపక యంత్రాలులేవు. కాగా ఉన్నవాటికి నీరు లభింపచేసే ఏర్పాటు లేదు. అనేక ఇబ్బందులవలన ఎ.ఆర్.పి. టాంకులన్నీ యించుమించు తొలగించడం జరిగింది.

ఇటువంటి పరిస్థితుల్లో విజయవాడ పట్టణంలో అగ్నిప్రమాదాల నివారణ ఎలా సాధ్యం?

అందుచేత రాష్ట్ర ప్రభుత్వం, పట్టణ మున్సిపాలిటీ, క్రిక్కిరిసిపోయిన పేదల నివాసప్రాంతాల పరిస్థితిని మెరుగుపరచనిదే, తగు సహాయపథకాలద్వారా వీటిని పునర్నిర్మించనిదేవిజయవాడలో అగ్ని ప్రమాదాలకు గల ప్రధాన హేతువు తొలగదు. సిమెంటు,యాజ్‌బెస్టాస్ రేకులు ఉపయోగించి అగ్ని ప్రమాదాలకు అతీతంగా వుండే చౌక యిళ్ళను నిర్మించి వాయిదాల పద్ధతిపై తీర్చుకునే పథకాలను అమలుజరపాలి. క్రిక్కిరిసినప్రాంతాల్లోనివారికి ప్రత్యామ్నాయస్థలాలు, అక్కడ తగు వసతులు చూపాలి.

అటువంటి పథకాలను అమలు జరిపేలోగా ప్రస్తుతం యిళ్ళు కోల్పోయినవారికితమ యిళ్ళనుపునర్నిర్మించుకోదలచిన వారికి కంట్రోలు రేటకు సిమెంటు,యాజ్‌బెస్టాస్, జింక్‌రేకులను ప్రభుత్వం అందజేయాలి. ఈ విధంగా నిప్పు అంటని సామగ్రి యివ్వాలంటేఇది దీర్ఘకాల పథకంక్రింద తప్పితే వెనువెంటనేసాధ్యమయేవిషయంకాదని, అందుకు ఎక్కువ ధనం కావాలి గనుకఆచరణీయమైనదికాదనిభావించటం అంటే ఏటేటా వేసవిలో విజయవాడ పట్టణానికి ఈ అగ్ని ప్రమాదాల బెడద కొనసాగనీయడమే అవుతుంది.

ఈలోగా అగ్ని బాధితులకు సత్వర సహాయం అందించడానికి ప్రభుత్వం, మున్సిపాలిటీ తమ యంత్రాంగాలను కదిలించాలి. కేవలం గృహయజమానులకే గాక అద్దెలకు నివసించి, సర్వస్వం కోల్పోయిన వారికికూడా అవశ్యం ఆర్థిక తదితర సహాయాలను అందజేయడం అవసరం. అగ్నిబాధితుల అఖిలపక్ష సహాయ కమిటీకి అందరూ అన్ని విధాలా తోడ్పడవలసిందిగా కోరుతున్నాం.

విజయవాడలోనేగాక, రాష్ట్రంలోని అనేకచోట్ల అగ్ని ప్రమాదాలకు గురైనవారికికూడా ప్రభుత్వం సత్వర సహాయం అందించాలనీ, వివిధ రాజకీయ పక్షాలు, ప్రజా సంస్థలు విరివిగా ధనరూపంలోను, వస్తురూపంలోను అగ్నిబాధితులను ఆదుకోవాలని కోరుతున్నాం.

---

# ఎ. ఐ. టి. యు. సి. మహాసభకు నెల్లూరు ప్రతినిధులు

కావలి, మే 12

కావలి తాలూకా మునిసిపల్, పంచాయతీ కార్మికుల సంఘాధ్యక్షుడు శ్రీ వి. వి. నరసింహాచార్యులు అడ్వొకేట్‌గారిని బొంబాయిలో ఈ నెల 16 న జరుగనున్న అఖిల భారత ట్రేడ్ యూనియన్ కాంగ్రెసుకు ప్రతినిధిగా ఎన్నుకొన్నారు.

శ్రీ పి. రామకోటయ్య, వి. అనంతరామయ్య, ఎస్. వి. శర్మ మరి అయిదుగురు నెల్లూరునుంచి ఆ సభకు ప్రతినిధులుగా వెళుతున్నారు. (వి. వి.)

---

# మద్రాసు ఎరువుల ఫ్యాక్టరీపై అమెరికా కంపెనీ యాజమాన్యం

## భారత ప్రభుత్వ సమ్మతి

న్యూఢిల్లీ, మే 12

మద్రాసులో నిర్మింప తలపెట్టిన ఎరువుల కంపెనీ మేనేజిమెంటును ఆదిలో కొంత కాలంపాటు ఆ పరిశ్రమ నిర్మాణంలో భాగస్వాములగు విదేశీ ప్రైవేటు కంపెనీలకే కట్టబెట్టడానికిభారత ప్రభుత్వం అంగీకరించింది,

అమెరికన్ యింటర్నేషనల్ ఆయిల్ కంపెనీ, నేషనల్ ఇరానియన్ ఆయిల్ కంపెనీ అనే రెండు సంస్థలు భారత ప్రభుత్వంతో కలిసి నిర్మించే యీ ఫ్యాక్టరీలో భారత ప్రభుత్వానికి మెజారిటీ వాటాలు వుంటవి.

ఫ్యాక్టరీ మేనేజిమెంటును తమకే దఖలు పరచాలని ఆరెండు కంపెనీలు పట్టుబట్టాయి. ఈ పేచీగురించి మంత్రివర్గ ఉపసంఘం సుదీర్ఘమైన చర్చలు జరిపింది. ప్రభుత్వానికి ఒక నివేదిక సమర్పించింది. చివరకు కొద్దికాలంవరకు ఫ్యాక్టరీ మేనేజిమెంటు అధికారాన్ని అమెరికన్ ఇంటర్నేషనల్ ఆయిల్‌కంపెనీకి అప్పగించడానికి ప్రభుత్వం అంగీకరించింది, ఆ తరువాత కంపెనీ మేనేజిమెంటు భారత ప్రభుత్వానికి దఖలు పరచబడుతుందట

---

# జయంతి షిప్పింగ్ కంపెనీ నౌకల అమ్మకం

## రాజ్యసభలో ప్రస్తావన

న్యూఢిల్లీ, మే 12

జయంతి షిప్పింగ్ కంపెనీ యివ్వవలసిన ప్రస్తుత అప్పులను తీర్చేందుకుగాను, ప్రభుత్వ ఋణంతో కొన్న ఒక నౌకను అప్పులతో నిమిత్తంలేకుండా కొన్న రెండు నౌకలను అమ్మివేయడానికి అనుమతి యివ్వవలసిందిగా, డా॥ ధర్మతేజ చేసిన విజ్ఞప్తి రెండురోజులక్రిందట ప్రభుత్వానికి చేరిందని ఈ ప్రతిపాదనను యింకా ఆలోచిస్తున్నామని యీ దశలో యింతకంటే వివరాలు ఇవ్వడం సాధ్యంకాదని రాజ్యసభలో రవాణా శాఖ స్టేట్ మంత్రులు శ్రీ పూనాచా అన్నారు.

జయంతి షిప్పింగ్ కంపెనీకి యిచ్చిన 6.25 కోట్ల రూపాయలకు పూర్తి భద్రత వున్నదని అన్నారు.

రోజువారి ఖర్చులకు యివ్వవలసిన డబ్బు చాలక యీ కంపెనీ కష్టాలు పడుతున్నదని ఆయన అన్నారు. విచారణ కమిషన్‌ను యేర్పాటు చేయవలసిన అవసరం యింకా రాలేదన్ని ఆయన అన్నారు.

శ్రీ దయాభాయ్ పటేల్, కాల్ ఎటెన్షన్ నోటీసుకు, యింకా యితరులకు అడిగిన ప్రశ్నలకు సమాధానం చెబుతూ ఆయన యీ కంపెనీ వ్యవహారాలపై తగిన చర్య తీసుకొనబోయే ముందు సుక్తాంకర్ కమిటీ నివేదికను పరిశీలించవలసి వుందనీ, ఈ నివేదిక యింకా అందలేదనీ అన్నారు.

కంపెనీకి యిచ్చిన ఋణాలకు భద్రత వున్నదని రవాణాశాఖ మాజీ మంత్రి శ్రీ రావుబహదూర్ యిచ్చిన వాగ్దానానికి భంగం కలగలేదా? అని శ్రీ పాటిల్ అడిగారు:

జయంతి షిప్పింగ్ కంపెనీని తీసుకోవాలని ప్రభుత్వం ఆలోచిస్తుందా అని కమ్యూనిస్టుసభ్యుడు శ్రీ పి. కె. కుమారన్ ప్రశ్నించగా దీనిపై వేసిన కమిటీ నివేదిక అందిన తర్వాత పరిస్థితిని పరిశీలిస్తామని పూనాచా అన్నారు.

ఈ కంపెనీకి చెందిన నౌకలన్నీ మార్టిగేజ్ జరుగకుండా వుండగలవని ప్రభుత్వం సభకు హామీ యిస్తుందా అని శ్రీ భార్గవ ప్రశ్నించారు. అనేకచోట్ల యీ మార్టిగేజు చేయడం జరుగుతున్నదని యీ కంపెనీ పరిస్థితి మరింత విషమంగా వుందని ఆయన అన్నారు.

జయంతి షిప్పింగ్‌కు చెందిన అనేక నౌకలు బ్యాంకులలోనూ, యితర ఆర్థిక సంస్థలలోనూ మార్టిగేజ్ చేయబడినాయని, యీ కంపెనీకి అప్పులు చాలా యెక్కువగా వున్నాయని పూనాచా అన్నారు.

---

# ఇందిరాగాంధీతో యుగోస్లావియా రాయబారి భేటి

న్యూఢిల్లీ, మే 12

ఢిల్లీలోని యుగోస్లావియా రాయబారి డాక్టర్ రీడివిక్ యువలిక్ ప్రధాని ఇందిరా గాంధీతో ఈ రోజు 30 నిముషాలపాటు సంభాషణలు జరిపారు.

టిటో నాజర్‌లమధ్య ఇటీవల జరిగిన చర్చల వివరాలను యుగోస్లావియా రాయబారి ఇందిరాగాంధీకి వివరించారు.

అలెగ్జాండ్రియా చర్చల దృష్ట్యా యుగోస్లావియా ఈజిప్టు భారత దేశాధిపతుల సమావేశం ఏర్పాటు గురించి ఇందిరాగాంధీతో యుగోస్లావియా రాయబారి చర్చించినట్లు తెలుస్తోంది.

ఈ చర్చలలో విదేశాంగ శాఖ స్టేట్ మంత్రి దినేష్‌సింగ్ కూడా పాల్గొన్నారు.

మూడు దేశాల అధినేతల సమావేశం ఎప్పుడు, ఎక్కడ జరుగుతుందో ఇంకా చర్చల తర్వాత గాని తేలదని అనుకుంటున్నారు.

---

# తాష్కెంట్‌లో ఇంకా భూప్రకంపనం

మాస్కో, మే 12

ఇటీవలి భూకంపాలలో 17,700 కుటుంబాలు తాష్కెంట్‌లో నిరాశ్రయులు అయ్యాయని సోవియట్ కమ్యూనిస్టుపార్టీ పత్రిక ప్రావ్దా నేడు వ్రాసింది.

మొత్తం నిర్వాసితుల సంఖ్య 70 వేలుంటుందనీ, వారిలో అధిక భాగం ఏప్రిల్ 26 నాటి మొదటి ప్రకంపనంలో నే గృహాలు కోల్పోయారనీ. ఆ భూకంపంలో 7 గురు మరణించారనీ, రెండు రోజులక్రితం వచ్చిన కంపనాలలో చాలా ఇళ్ళు కూలిపోయాయనీ, ప్రావ్దా వ్రాసింది.

ప్రస్తుతం 2200 కుటుంబాలు కొత్త ఇళ్ళలోకి మారినాయనీ. 13 వేల కుటుంబాలు తాత్కాలికంగా నిర్మించిన గుడారాలలో వుంటున్నారనీ, 1100 కుటుంబాలు ప్రభుత్వ భవనాలలోనూ, 1400 కుటుంబాలు విశాలమైన ఇళ్ళున్నవారి యిళ్ళలోనూ చేరారనీ ఆ పత్రిక వ్రాసింది.

నిన్నటిరోజున వరుసగా అనేకమార్లు భూమి కంపించి ఎన్నోస్కూళ్లు, హాస్పిటళ్లు, ఇళ్ళు కూలిపోయినాక తాష్కెంట్ నగరవాసులు 10 లక్షల మందిలో అధికభాగం తోటలు, దొడ్లలో ఆరుబయటనే నివసిస్తున్నారు.

నిన్న ఒక్కరోజున మొత్తం 33 సార్లు భూమి కంపించింది. ఏప్రిల్ 26 న వచ్చిన మొదటి భూకంపంలో 4 వేల కుటుంబాలకు నివాసంలేకుండా పోయింది. ఇప్పుడింకా చాలా భవంతులు పోయాయి, 17700 కుటుంబాలు నేడు నిరాశ్రయు లయ్యారు. కూలిపోయిన, సగం కూలిన భవనాలను, శిధిలాలను తీసివేయడానికి సైనిక టాంకులు, బుల్‌డోజర్లు, క్రేన్లు నిర్విరామంగా 24 గంటలూ పని చేస్తున్నాయి.

---

# సిమెంటు ధరలు పెరగలేదట!

## కంట్రోళ్ళు ఎత్తివేసిన దరిమిలా స్థితిపై రాజ్యసభలో మంత్రి ప్రకటన

న్యూఢిల్లీ, మే 12

ప్రభుత్వం దేశంలో సిమెంటు సరఫరా పరిస్థితిని పర్యాలోచించింది. కంట్రోళ్ళ పునసంహరణ దరిమిలా ధరలు పెరిగినట్లు ప్రభుత్వం దృష్టికి రాలేదు అని పరిశ్రమల శాఖ సహాయమంత్రి శ్రీ విభుధేంద్ర మిశ్రా నేడు రాజ్యసభ సభలో చెప్పారు.

కంట్రోళ్ళు పునసంహరించినందువల్ల వచ్చిన లాభాలను తిరిగి పరిశ్రమాభివృద్ధికి వినియోగిస్తామన్న సిమెంటు పరిశ్రమదారుల హామీకి తిరుగులేదు. వచ్చే సంవత్సరం డివిడెండ్ల మొత్తాల్ని పెంచబోమని, కూడా వారు హామీ యిచ్చారని మంత్రిచెప్పారు.

1966 - 67 సంవత్సరంలో సిమెంటు పరిశ్రమ విస్తరణకు అవసరమైన రూపాయి నిధులను, విదేశ మారక ద్రవ్యాన్ని సమకూర్చడం జరిగింది. 4 వ ప్రణాళికలో ఉత్పత్తిలక్ష్యం 2 కోట్ల 50 లక్షల టన్నులు. ఇప్పుడున్న పరిశ్రమ ఉత్పత్తి స్తోమతు ఒక కోటి 20 లక్షల టన్నులు. ఒక కోటి టన్నులకుపైగా యిప్పుడు ఉత్పత్తి జరుగుచున్నది. ఒకకోటి 30 లక్షల టన్నుల ఉత్పత్తి మేరకు లైసెన్సులివ్వడం జరిగింది. పరిశ్రమ సాధించుతున్న ప్రగతిని ఎప్పటికప్పుడు సమీక్షించడం జరుగుతూవుంది అని మంత్రిచెప్పారు.

---

# రాష్ట్ర ప్రణాళికల అవసరాల పరిశీలన

## జరుగుతుందని లోక్‌సభలో మెహతా ప్రకటన

న్యూఢిల్లీ, మే 12

ఈసంవత్సరాంతం లోగా వివిధ రాష్ట్రాల ప్రణాళికలను కేంద్రం పునఃసమీక్ష చేస్తుంది. అనేక రాష్ట్రాల అవసరాలు పూర్తిగా నెరవేరడం జరగలేదు. ఆ దృష్ట్యానే రాష్ట్రాలకు యీ హామీ యివ్వడం జరిగింది. అని ప్రణాళికామంత్రి శ్రీ అశోక్ మెహతా యీరోజు లోక్‌సభలో చెప్పారు.

"దేశాన్ని సుసంపన్నం చేసేటందుకు" మీరు అమెరికా యాత్ర జరిపి వచ్చారుకదా? వారు యేమాత్రం సహాయం వాగ్దానం చేశారు? అని శ్రీభగవత్‌ఝా అజాద్ ప్రశ్నించారు. ఈ విషయం తాను రేపు సభలో ఒక ప్రకటన చేయగలనని మంత్రి సమాధాన మిచ్చారు.

---

# నిముషానికో కారు ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘన

హైదరాబాద్, మే 12

నిముషానికి ఒక్కటిచొప్పున, 30 నిముషాల సమయంలో 30 కార్లు ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘించినట్లు ఇక్కడ పోలీసు అసిస్టెంటు కమిషనర్ నిర్వహించిన కార్యక్రమంలో వెల్లడైంది. కింగ్‌కోటగోడ్డు జంక్షన్‌వద్ద ట్రాఫిక్ పరిశీలన జరిగింది.

అది ఇక్కడ ప్రమాదం రెండవ పర్యాయం.

---

# కీన్యాపార్లమెంటుకు కెన్యాట్టా కుమార్తె పోటీ

నైరోబి, మే 13

కీన్యా అధ్యక్షులు జోమో కెన్యాట్టా కుమార్తె మార్గరెట్ కెన్యాట్టా, నైరోబి పార్లమెంటరీ నియోజకవర్గంనుండి అధికార పార్టీ అయిన కాను పార్టీ అభ్యర్థిగా పోటీ చేయాలనుకుంటున్నది. ఆమె పార్టీ టికెట్ కోసం దరఖాస్తు చేసింది, ఈ నియోజకవర్గం నుండి ప్రత్యర్థి పక్షం నాయకుడు ఓడింగా ముఖ్య అనుచరుడు జాన్ కాలి అనే ఆయన పోటీ చేస్తున్నాడు.

ఈ నియోజకవర్గం నుండి కాను పార్టీ టిక్కెట్ కోసం, మిస్ మార్గరెట్‌తోబాటు మరో 26 మంది దరఖాస్తు చేశారు.

ఈ పార్లమెంటు స్థానానికి ఈమె ఎన్నిక అయితే, కీన్యా పార్లమెంటులో తొలి మహిళ అనే గౌరవం యీమెకి దక్కుతుంది,

ఈమె ప్రస్తుతం నైరోబి నగర కౌన్సిల్ సభ్యురాలుగా వున్నారు. బనాసలో కీన్యా ప్రతినిధివర్గ సభ్యురాలుగా వున్నారు.

కానూ పార్టీ టిక్కెట్‌మీద ఎన్నికైన 32 మంది పార్లమెంటు సభ్యులు యిటీవలనే పార్టీనుండి వేరుపడి పోయారు. వీరు పార్లమెంటులో తమ సభ్యత్వంకూడా వదులుకోవాలని పథిష్టా పార్లమెంటు ఒక శాసనంచేసింది.

అందుకని ఇప్పుడు ఆ ఖాళీ పడిన 32 స్థానాలకు ఉపఎన్నిక జరగాల్సి వుంటుంది,

ప్రత్యర్థులు ఓడింగా నాయకత్వాన పీపుల్స్ పార్టీగా ఏర్పడ్డారు.

---

# అమెరికాచే భారత్‌కు 10కోట్లడాలర్లఅప్పు

న్యూఢిల్లీ, మే 13

పరిశ్రమలకు, వ్యవసాయాభివృద్ధికి అవసరమైన సరకుల ఎగుమతికోసం భారతదేశం అమెరికానుంచి 10 కోట్ల డాలర్లు (రు 47 కోట్ల 60 లక్షలు) అప్పుగా తీసుకొంటున్నది. ఇందుకు సంబంధించిన ఒప్పందంపై కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ కార్యదర్శి శ్రీ ఎస్. భూతలింగం, అమెరికా సహాయసంస్థ అధికారి జాన్ పి. లూయీ లిద్దరు నేడిక్కడ సంతకం చేశారు.

---

# పాక్ అధీన ప్రాంతాలకు వెళ్ళిన భారత ప్రజలు

## తిరిగి రాలేదని నందా వెల్లడి

న్యూఢిల్లీ, మే 13

గత సంవత్సరం సంఘర్షణ కాలంలో పాకిస్తాన్ అధీనంలో వున్న ప్రాంతాలకు పోయినవారు చెప్పుకో తగినంత సంఖ్యలో జమ్ము కాశ్మీరు లోనికి తిరిగి రాలేదని నేడు రాజ్యసభలో శ్రీ వాజ్‌పాయ్ ప్రశ్నకు సమాధానంగా హోం మంత్రి శ్రీ నందా అన్నారు.

సైనికచర్యలు, దాడుల ఫలితంగా కొన్ని ప్రాంతాలకు తరలి వెళ్ళినవారు తిరిగి వస్తున్నారనీ, రాష్ట్ర ప్రభుత్వం వారికి తగు యేర్పాటు చేస్తున్నదని ఆయన అన్నారు.

భారత దేశానికి అవిధేయులుగా వున్న ప్రజలకు సైనిక శిక్షణ ఆయుధాల సరఫరా జరగకుండా ప్రభుత్వం జాగ్రత్త తీసుకుంటుందా అని వాజ్‌పాయ్ అడిగారు.

దేశానికి అవిధేయ శక్తులు ఎక్కడా వున్న అన్ని విధాలా వారిని యెదుర్కొంటామని శ్రీ నందా అన్నారు.

సరిహద్దు ప్రాంతాల ప్రజలకు యిస్తున్న ఆయుధ శిక్షణ విషయం. ప్రజా శ్రేయస్సు దృష్ట్యా వెల్లడి చేయకూడదని అంతకుముందు, శ్రీ అబ్దుల్ ఘనీ ప్రశ్నకు సమాధానం చెబుతూ హోంశాఖ డిప్యూటీ మంత్రి శ్రీ వి. సి. శుక్లా అన్నారు. జమ్మూ-కాశ్మీరు రక్షణను బలోపేతం చేయడానికి యీలాంటి శిక్షణ ఉపకరించదా అని శ్రీఘనీ అడిగారు,

కొన్ని సరిహద్దు ప్రాంతాలలో, మాజీ సైనికోద్యోగులను నియమించాలన్న ప్రతిపాదన, ఆలోచనలో వుందనీ. యీ విషయంపై రాష్ట్ర ప్రభుత్వంతో సమాలోచనలు జరుపుతున్నామని శ్రీ శుక్లా అడిగారు. త్రిపుర, నేఫా ప్రాంతాలలో యీ పథకాం యేర్పాటుకు మంజూరు గూడా అయిందని ఆయన అన్నారు.

పాకిస్తాన్ ఆధీనంలో వున్న ప్రాంతాల నుండి యెవ్వరూ తిరిగి రాలేదని నందా మొదట చెప్పారు. అయితే యీ ప్రాంతాల నుండి తిరిగివస్తున్నవారికి సౌకర్యాలు కల్పించడానికి కొన్ని చోట్ల బదు కేంద్రాలను ఏర్పాటు చేశామని జమ్మూ కాశ్మీరు ముఖ్యమంత్రి శ్రీ సాదిక్ చెప్పారు. దీనికి శ్రీ నందా చెప్పిన దానికి విరుద్ధంగావున్నది. అని వాజ్‌పాయ్ అడిగారు.

పాక్ సంఘర్షణ కాలంలో సుదూర ప్రాంతం వెళ్ళినవారే తిరిగి వస్తున్నారని పాకిస్తాన్ అధీనంలో వున్న ప్రాంతాలకు వెళ్లిన వారు తిరిగి వస్తున్నారనీ, ఏదో కొద్ది మంది తప్ప యెక్కుమంది తిరిగి రావడం లేదని శ్రీ నందా అన్నారు.

---

# అధికార స్వాధీనంకై భంజదేవ్ యత్నం

## బస్తరు దర్యాప్తు సంఘం యెదుట అధికారుల వాదన

జగదల్పూర్, మే 12

మార్చి 25, 26 బస్తరు ఘటనలో మరణించిన ప్రవీణచంద్రభంజదేవ్, భారత యూనియన్‌నుంచి తన గద్దెను లాక్కొనడానికి పథకాన్ని వేశారని, 1965 నవంబరు నుంచి తన రాజభవనం ఆవరణలో సాయుధ ఆదివాసులను సమావేశపరుస్తూ ఉద్యమాన్ని లేవదీశారని నేడు ప్రభుత్వ అధికారుల తరఫున బస్తరు దర్యాప్తుసంఘం పాండే కమిషన్ ముందు దాఖలు చేసిన ప్రకటనలో తెలిపారు.

దీనికి ఆధారంగా ఇంటి జ్యోతిష్య శాస్త్రజ్ఞుని నుంచి పోలీసులు 300 డాక్యుమెంట్లను స్వాధీనం చేసుకున్నారనీ, తన స్థానాన్ని ఈ సంవత్సరం మార్చి 29 న తిరిగి పొందుతానని భంజదేవ్ ఊహించారని ఆ ప్రకటనలో తెలిపారు.

మార్చి 24 న 10 వేలమంది ఆదివాసులు కాంగ్రెసు నాయకులు శ్రీ సూర్యపాల్ తివారి ఇంటిముందు కేంద్రప్రభుత్వం నుంచి డాక్యుమెంట్లను తిరిగి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ప్రదర్శన జరిపారు.

అదే రోజు రాత్రి 2 వేల మంది ఆదివాసులు ఈటెలతో, బల్లాలతో జగదల్పూరు వచ్చి, రాజప్రాసాదంలో ప్రవేశించారు. ఆరోజున వారు ప్రభుత్వ అధికారులు, వ్యాపారస్థులపై దాడిజరిపారు. ఆ సందర్భంగా జిల్లా మెజిస్ట్రేటు 144 వ సెక్షను ఉత్తర్వులు జారీ చేశారని ఆ ప్రకటనలో తెలిపారు.

ఆ తరువాత ఆదివాసులు రాజభవనంనుంచి బయటకు వచ్చి పోలీసు బృందంపై దాడి ప్రారంభించారు. ప్రజానీకం వెళ్ళిపోవలసిందిగా పోలీసులు పలుసార్లు విజ్ఞప్తులు. బాష్పవాయు ప్రయోగాలు విఫలమైన అనంతరం పోలీసులు మరునాటి రోజు ఉదయం ఒకసారి మధ్యాహ్నం రెండుసార్లు కాల్పులు జరిపారని ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

మార్చి 26 న 11 గంటల సమయంలో కమిషనర్ రాజభవనంలో భంజదేవ్ మృతదేహంతోసహా 12 మృతదేహాలను కనుగొన్నారని ఆ ప్రకటనలో వుంది.

ఈప్రకటనలోచివరి భాగం-నాల్గవభాగంలో మార్చి 26 నుంచి ఆ జిల్లాలో శాంతిభద్రతలను పునరుద్ధరించడానికి అధికారులు తీసుకున్న చర్యలనూ వివరించారు.

పాండే కమిషన్ జూన్ 6వరకు క్రమంగా బస్తరు ఘటనల వాదనలను వింటూంది.

నూతన, పాత రాజభవనాలను సీలువేయడానికి కమిషన్ అనుమతి లేకుండా ఏ ఒక్కరూ అభవనంలో ప్రవేశించకూడదని కమిషన్ ఉత్తర్వు లిచ్చింది.

కమిషన్ యెదుట పత్రాలు దాఖలుచేసిన న్యాయవాదులపై సి. ఐ. డి నిఘా అవు చేయాలని కమిషన్ ఉత్తర్వు జారీ చేసిందని తెలియ వచ్చింది.

---

# దేశభాగ్య విధాత రైతు

## శాస్త్రవేత్తలగోష్ఠిలో ప్రధాని ప్రసంగం

న్యూఢిల్లీ, మే 13

వర్తమాన భారతదేశంలో అత్యంత ప్రముఖ వ్యక్తి రైతు. మన జాతీయ అభ్యుదయ కార్యక్రమాల సఫలత యావత్తూ వ్యవసాయరంగంపైనే ఆధారభూతమై వుంది. ఆ రంగంలో విజయం సాధించవలసిన బాధ్యత రైతుమీదవుంది. అని ప్రధాని శ్రీమతి ఇందిరాగాంధి నేడిక్కడ వ్యవసాయ శాస్త్రజ్ఞుల గోష్ఠిని ప్రారంభిస్తూ చెప్పారు.

గోష్ఠికి ఆహారమంత్రి శ్రీ సుబ్రహ్మణ్యం అధ్యక్షతవహించారు. వ్యవసాయరంగంలో అధునాతనమైన అభివృద్ధికర పద్ధతులను ప్రవేశ పెట్టడంద్వారా ప్రణాళికా కర్తల కంటే, రాజకీయ వేత్తలకంటే గూడాహెచ్చు దోహద చూపుతున్నారంటూ ఆయనరైతాంగ ప్రజలను అభినందించారు.

---

# మిజో కొండల ప్రాంత పరిస్థితిపట్ల ఆదుర్దా

## లోక్‌సభలో నందా ప్రకటన

న్యూఢిల్లీ, మే 12

తిరుగుబాటుదారులు కొండ ప్రాంతాల్లోకి విస్తరిస్తున్నారు. ఇక త్వరలో వర్షఋతువు కూడా ఆరంభమౌతుంది. అందుకు మిజో కొండల ప్రాంతం పరిస్థితి ఆందోళనకరంగానే వుంది అని కేంద్ర హోం మంత్రి శ్రీ నందా యీ రోజు లోక్‌సభలో డాక్టర్ సింఘ్వి అడిగిన ఒక ప్రశ్నకు, శ్రీ మధులిమాయే యిచ్చిన ఒక తీర్మానానికి సమాధాన మిచ్చిన సందర్భంలో చెప్పారు. ఒక వెయ్యి మంది నాగులు తూర్పు పాకిస్తాన్‌నుండి మిజో కొండల్లోకి ప్రవేశించినట్లు వార్తలు వచ్చాయని శ్రీ మధులిమాయే చెప్పారు.

పరిస్థితి, ఎదుర్కొనేటందుకు ప్రభుత్వం మిజో ప్రాంతంలో అవసరమైన భద్రతా చర్యలన్నీ తీసుకుంటున్నదని మంత్రి హామీ యిచ్చారు.

---

సోవియట్ యువ కమ్యూనిస్టు సంస్థ పంపిన ఆహ్వానాన్ని చైనా యువ కమ్యూనిస్టులీగ్ తిరస్కరించింది.

---

# మార్క్సిస్టు కమ్యూనిస్టుల ఎన్నికల వ్యూహం

## ఆంధ్ర ప్రదేశ్ కమిటీ ప్రకటన

విజయవాడ, మే 12

దేశంలో కాంగ్రెస్ సత్తాధికారాన్ని బద్దలు చేయడానికి, ఇంకొక ప్రత్యామ్నాయ ప్రభుత్వాన్ని యేర్పాటు చేయడానికి తమ పార్టీ నిలబడుతుందని ఆంధ్ర ప్రదేశ్ మార్క్సిస్టు కమ్యూనిస్టు కమిటీ నేడొక పత్రికా ప్రకటన విడుదలచేసింది.

ఇందుకై అన్ని అభివృద్ధికర పార్టీలతో ఐక్యసంఘటన యేర్పాటు చేయడానికి, కాంగ్రెస్ మినహా అన్ని పార్టీలతో ఎన్నికల సర్దుబాటు చేసే విషయమై పనిచేయడానికి తమపార్టీ నిశ్చయించిందని యీ పత్రికా ప్రకటనలో తెలియచేయబడింది,

విజయవాడలో మే 7 నుండి 11 వరకు జరిగిన రాష్ట్రపార్టీ విస్తృత సమావేశంలో ఈ నిశ్చయం చేశారు. ముఖ్యమైన రాజకీయ సమస్యలపై సిద్ధాంతానికి సంబంధించిన సమస్యలపై, ప్రస్తుత పరిస్థితిపై యీ సమావేశం చర్చించింది.

రానున్న ఎన్నికల ఫలితాలను గురించి గూడా యీ సమావేశం స్థూలంగా పరిశీలించింది. వచ్చే కమిటీసమావేశంలో ఎన్నికలకు సంబంధించిన యితర విషయాలను గురించి చర్చించడానికి నిశ్చయించింది.

రాష్ట్రంలో కరువు ప్రాంతాలలో కరువు పనులను ప్రారంభించాలనీ, ఈ డిమాండ్‌ను ప్రభుత్వం చేత అంగీకరింప చేయడానికి అన్ని ప్రతి పక్షాలు ఆందోళన జరపాలనీ పిలుపు నిచ్చింది.

అత్యవసర పరిస్థితి దేశరక్షణ చట్టాన్ని వెంటనే రద్దుచేయాలని తీర్మానించింది. ద్వైవార పత్రికగా నడుస్తున్న 'జనశక్తి'ని ఆగస్టు 15 నుండి దినపత్రికగా చేయాలని యీ కమిటీ నిర్ణయించింది.

---

# షేక్ అబ్దుల్లా విడుదల ప్రస్తుతం క్షేమంకరంకాదు

## పత్రికాగోష్ఠిలో శ్రీ సాదిక్ వివరణ

శ్రీనగర్, మే 12

డిటెన్యూగా ఉన్న షేక్ అబ్దుల్లాను ప్రస్తుతదశలో విడుదలచేయడం వాంఛనీయం కాదని, ఆయన విడుదల దేనివిధంగాను దేశానికి సహాయకారి కాదని నేడిక్కడ కాశ్మీర్ ముఖ్యమంత్రి శ్రీ సాదిక్ అన్నారు.

ఆయన ఈ విషయాన్ని కాశ్మీర్ పర్యటనకు వచ్చిన పంజాబు, మహారాష్ట్ర, గుజరాత్ పాత్రికేయుల బృందానికి తెలియజేశారు,

భారత రాజకీయ జీవితంలో ప్రవేశించడానికి 1964 లో శ్రీ అబ్దుల్లాను విడుదలచేసి అవకాశాన్ని కల్పించామని, అయితే ఆయన అవలంబించిన వైఖరి మూలంగా మరల ఆయనను డిటెన్షన్‌లో పెట్టడానికి దారి తీసిందని శ్రీ సాదిక్ తెలిపారు,

జమ్మూ-కాశ్మీర్‌లోని భూములను యితర రాష్ట్రాల ప్రజలు కొనుగోలు చేయడానికి వున్న ఆంక్షలను ప్రస్తావిస్తూ, కాశ్మీర్‌ప్రజల ఆర్థిక పరిస్థితి స్థిరమయ్యేంతవరకు ఆంక్షలను తొలగించలేమని ఆయన చెప్పారు.

తాష్కెంటు ఒప్పందాన్ని గురించి పాత్రికేయులు ప్రశ్నించగా, ఉభయదేశాల మధ్య అది సత్సంబంధాలను నెలకొల్పుతుందనే ఆశాభావాన్ని శ్రీ సాదిక్ వ్యక్తం చేశారు,

---

# కాశ్మీర్ మంత్రుల శాఖలలో మార్పు

శ్రీనగర్, మే 12

కాశ్మీర్ ముఖ్యమంత్రి శ్రీ జి.ఎమ్.సాదిక్ తన మంత్రివర్గ సభ్యులమధ్య శాఖలను మార్పుచేస్తూ నేడు ప్రకటనచేశారు.

సాదిక్ ప్రభుత్వం ఏర్పడిన నాటినుంచి శ్రీ డి.పి. ధార్ చేతిలో వున్న హోంశాఖను శ్రీ సాదికే ఈ మారు తీసుకొన్నారు. శ్రీ ధార్‌కు విద్య, ఆరోగ్యశాఖలు ఈయబడినాయి. ఇంతకు పూర్వం శ్రీ అలీ మహమ్మద్ తరీఖ్ నిర్వహించిన సమాచారశాఖ కూడా ఇప్పుడు శ్రీధార్ చేతిలో వుంటుంది.

ఇదివరలో ఆరోగ్యశాఖను చూసిన గియాసుద్దీన్ ఇప్పుడు ఆహారం, వ్యవసాయ శాఖలు చూస్తారు.

ఇదివరకు మాదిరిగానే శ్రీ జి. ఎల్. డోగ్రా ఆర్థిక, పరిశ్రమల శాఖలనూ, మహమ్మదు అయూబ్‌ఖాన్ రివెన్యూశాఖనూనిర్వహిస్తారు

---

# గుజరాత్ ప్రభుత్వ ఉద్యోగులకై వేతన సంఘం నియామకం

అహమ్మదాబాద్, మే 12

లక్ష 80 వేలమంది రాష్ట్ర ఉద్యోగుల వేతనాల నిర్మాణ ప్రాతిపదికను పరిశీలించడానికి గుజరాత్ హైకోర్టు న్యాయమూర్తి శ్రీ అక్బర్‌సరేలాల్‌తోఒకఏకసభ్య వేతనకమిషన్‌ను గుజరాత్ రాష్ట్ర ప్రభుత్వం నేడు నియమించింది. గెజిటెడ్ ఆఫీసర్లు, నాన్ గెజిటెడ్ ఆఫీసర్లు, శాశ్వతపు, తాత్కాలిక పనివారల వేతనాల విషయాలను యీ వేతన సంఘం పరిశీలిస్తుంది. గత సంవత్సరం, రాష్ట్ర అసెంబ్లీలో మాజీ ముఖ్యమంత్రి కీ. శే. బలవంతరాయ్ మెహతా వేతనాల సంఘాన్ని యేర్పాటు చేస్తాననివాగ్దానం యిచ్చియున్నారు.

---

# అశోక మెహతా ప్రకటన

(1 వ పేజీ తరువాయి)

వాటికి ఆర్థిక సహాయం అందింపగలమని కూడా అమెరికన్‌అధికారులు తనకుచెప్పినట్లు శ్రీ మెహతా ప్రకటించారు.

భారతదేశం తాను స్వీకరించిన పంథాలో నిష్టయాత్మకంగా ముందుకు సాగేటందుకు, ఎంత మొత్తం సహాయం అవసరమనే విషయంలో అమెరికా వారికీ మనకూ, యేకాభిప్రాయం కుదిరింది. అని ఆయన చెప్పారు.

విదేశాలనుండి లభించే సహాయం మొత్తం ఎంతో శ్రీ మెహతా ఉపహరించలేదు.

విదేశాలనుండి లభించే సహాయం లేదా వారినుండి లభించగలదని మనం ఆశించవలసిన మొత్తం మనం తయారు చేసుకొనే నాలుగో ప్రణాళికను బట్టి వుంటుంది.

మన ప్రణాళిక సిద్ధమైన తరువాత దానినిబట్టి మన అవసరాల గురించి చర్చించేటందుకు కన్సార్టియందేశాలను సమావేశపరచవలసిందిగా ప్రపంచ బ్యాంక్‌ను కోరటం జరుగుతుంది. ఇది యీ సంవత్సరాంతానికి చాలా ముందే జరుగుతుంది.

గతంలో యిచ్చిన దానికంటే హెచ్చుగాను, గణనీయంగానూ సహాయం యివ్వడం అవసరమని వారు గుర్తించారు. ఈ సంవత్సరం మన ప్రాజెక్టేతర అవసరాల గురించి తాను కన్సార్టియం దేశాల వారితో సంప్రతించి వారి నిర్ణయాన్ని త్వరలో తెలియజేయగలనని ప్రపంచబ్యాంక్ అధ్యక్షుడు చెప్పారు అని ఆయన తెలియజేశారు.

హెచ్చు సహాయం యిప్పించేటందుకు ఆయన వారిని ఒప్పించగలమని చెప్పారు.

ప్రాజెక్టుల అవసరాలతోబాటు ప్రాజెక్టేతర అవసరాలకు కూడా అంతర్జాతీయ అభివృద్ధి సంస్థనుండి తగుసహాయం లభించేలా చూడగలమని బ్యాంక్ అధ్యక్షుడు హామీ ఇచ్చారు అని మెహతా చెప్పారు.

---

# విద్యార్థులచే చికాగో యూనివర్శిటీ ఆక్రమణ

చికాగో, మే 12

అమెరికాలోని చికాగో యూనివర్శిటీ భవనాన్ని విద్యార్థులు ఆక్రమించుకొని పని పాటలేవీ జరగకుండా నిరోధిస్తున్నారు.

400 మంది విద్యార్థులు యూనివర్శిటీ భవనాలలో తిష్టవేశారని అధికారులు తెలుపుతున్నారు.

సైనిక సమీకరణ నుంచి విద్యార్థులను మినహాయించడానికి, పరీక్షలలో విద్యార్థులకు వచ్చిన మార్కులను కూడా పరిగణనలోకి తీసుకోవాలని అమెరికా ప్రభుత్వం చేసిన నిర్ణయానికి వ్యతిరేకంగా విద్యార్థులు ఆందోళన సాగిస్తున్నారు. సైనిక సమీకరణ విషయంలో విద్యార్థులలో భేదాలు పాటించడాన్ని విద్యార్థులు ఖండిస్తున్నారు.

---

# ముఖ్యమంత్రి వర్గంతో స్వరణ్‌సింగ్ భేటి

## పంజాబ్ కాంగ్రెస్ పార్టీ నాయకత్వ సమస్యపై

చండీఘర్, మే 13

పంజాబ్‌లో ముఖ్యమంత్రి రామకృష్ణకు చెందినవర్గం గతరాత్రి విదేశాంగ మంత్రి శ్రీ స్వరణ్‌సింగ్‌ను కలుసుకొని, ఏర్పాటు చేయనున్న నూతన పంజాబ్ రాష్ట్ర కాంగ్రెసు లెజిస్లేచర్‌పార్టీ నాయకత్వంపై తమ అభిప్రాయాలను తెలియచేసింది.

పంజాబ్ హరియానా రాష్ట్రాల సరిహద్దులను నిర్ణయించే సరిహద్దు సంఘం తన నివేదికను కేంద్ర ప్రభుత్వానికి అందజేసిన తర్వాత ఈ ఎన్నిక జరుగవచ్చునని తెలుస్తున్నది,

కొంతమంది సీనియర్ శాసన సభ్యుల విజ్ఞప్తి మీదట, శ్రీ స్వరణ్‌సింగ్ చండీఘర్ పర్యటించారు.

ఈ రోజు ఉదయం 3 గంటల వరకు యీ సమావేశం జరిగింది. ప్రస్తుత పంజాబ్ ప్రాంతంలోవున్న 57 గురు కాంగ్రెస్ శాసన సభ్యులలో 34 మంది ఈ సమావేశానికి హాజరయ్యారని తెలుస్తున్నది. ఇందులో కొంతమంది మంత్రులుగూడా వున్నారు. కాంగ్రెస్ లెజిస్లేచర్‌పార్టీకి పోటీ చేయనున్న రాష్ట్ర హోంమంత్రి దర్బారాసింగ్ మాత్రం యీ సమావేశానికి హాజరుకాలేదు.

నూతనంగాయేర్పాటుచేయబడేపంజాబ్‌పార్టీ నాయకుడుగా ముఖ్యమంత్రి శ్రీరామకిషన్‌ను వుంచాలని యీ సమావేశానికి హాజరయిన వారిలో కొంతమంది తమ అభిప్రాయాలను వెల్లడించారు. శ్రీ స్వరణ్‌సింగ్ యీ రోజు ఉదయం న్యూఢిల్లీ వెళ్ళారు. ఈ సమాచారాన్ని అయన కాంగ్రెస్ అధిష్టాన వర్గానికి తెలుపుతారు.

పార్టీ నాయకుణ్ణి యెన్నుకొనేస్వేచ్ఛ పార్టీకి అధిష్టానవర్గం స్వాతంత్ర్యం యిస్తే తను యీ ఎన్నికలో పోటీచేయగలనని విద్యామంత్రి ప్రబోధ చంద్ర పత్రికలవారితో అన్నారు.

---

# హజారీబాగ్ జిల్లాలో ఆహారకొరత

హజారీబాగ్, మే 12

కొద్దిరోజులుగా హజారీబాగ్‌జిల్లా(బీహార్)లో తిండిగింజలకు ప్రజలు విపరీతంగా కటకట పడుతున్నారు.

గడచిన నాలుగు వారాలుగా జిల్లాలో ఎక్కడా గోధుమలు దొరకడం లేదు. గ్రామీణ ప్రాంతాల్లో పరిస్థితి మరింత విషమంగా వుంది. గ్రామాలనుండి పందల వేల సంఖ్యలో ప్రజలు పనులు వెతుక్కుంటూ బస్తీ ప్రాంతాలకు వలసపోతున్నారు.

# కాలదోషం పట్టిన వ్యవసాయ కార్మిక కనీస వేతన చట్టం

## ప్రస్తుతం రోజుకు రు 2-50 కనీస కూలి: పాలేర్లకేటా రు 450 జీతానికై డిమాండ్

మానుకోట, మే 11

వ్యవసాయ కార్మికులకు రోజుకు రు. 2-50 కూలి, పాలేర్లకు సంవత్సరానికి రు. 450 లు; ధాన్యం అయితే 12 బస్తాల వేతనం నిర్ణయించాలని, కాలదోషం పట్టిన కనీసవేతనాల చట్టాన్ని యెత్తివేయాలని ప్రభుత్వాన్ని కోరుతూ వరంగల్‌జిల్లా, మానుకోట తాలూకా ఆరవ కమ్యూనిస్టు మహాసభ తీర్మానం చేసింది.

మానుకోట తాలూకా కమ్యూనిస్టు ఆరవ మహాసభ ఈనెల 5-6 తేదీలలో పెదముప్పారంలో దొండేటి పుల్లయ్య నగర్ జరిగింది. 114 మంది ప్రతినిధులు హాజరైనారు.

శ్రీయుతులు. చింతపాయల రామయ్య, సింగు నర్సయ్య, యర్రోజు లక్ష్మీనారాయణ గార్లు అధ్యక్షవర్గంగా ఎన్నుకొనబడినారు. మహాసభలో శ్రీయుతులు, సర్వదేవభట్ల రామనాథం, యస్ మోహన్‌రావు (ఎం.ఎల్.ఏ.) తోకల రాజరెడ్డి, కొండపల్లి గోపాలరావు పాల్గొన్నారు. మహాసభ జరిగే ప్రాంతాన్ని అమరజీవి కామ్రేడ్ దొండేటి పుల్లయ్య నగర్ అని నామకరణం చేశారు.

మృతవీరులు. కామ్రేడ్సు గుండాయల్లయ్య, వద్ది తిరుపతయ్య, పిట్టల గోపయ్య, కన్నెకంటి భద్రినారాయణగార్ల పేర్లతో గేట్లు నిర్మించారు. మహాసభ జరిగే ప్రాంతమంతా ఎర్రజెండాలతో, తోరణాలతో అలంకరింపబడింది. మహాసభ ప్రారంభంలో సభా ప్రాంగణం నుండి డప్పుల వాద్యాలతో గ్రామం వెలుపల నిర్మించిన మృతవీరుల స్థూపం వద్దకు పెద్ద ఊరేగింపుగా వెళ్ళి శ్రద్ధాంజలి ఘటించారు. అక్కడ శ్రీ తోకల రాజిరెడ్డిగారు ఎర్రజండా ప్రతిష్ఠించారు. శ్రీ సర్వదేవభట్ల రామనాథంగారు మృతవీరుల సమాధిపై పుష్పాలనుంచారు.

తాలూకా కమ్యూనిస్టు సమితి కార్యదర్శి శ్రీ వెంకటమల్లు సభను ప్రారంభించారు.

తాలూకాలో ఈ మధ్య మృతిజెందిన పార్టీ నాయకులు శ్రీ వద్ది తిరపతయ్య, పోతపల్లి పుల్లయ్య, ముత్యాల వెంకటయ్యగార్ల మృతికి సంతాపం వెలిబుచ్చుతూ తీర్మానాలను ఆమోదించారు. ముత్యాల వెంకటయ్య మహాసభ పనులలో చురుకుగా పాల్గొంటూ మే 3 వ తేదీన ఆకస్మికంగా జబ్బు వచ్చి 4 వ తేదీన మరణించారు. వారికి జోహారులర్పించారు.

తొలుత శ్రీ సర్వదేవభట్ల రామనాథంగారు మాట్లాడుతూ దేశసరిహద్దులను రక్షించుకోవడానికి పార్టీచేసిన తీర్మానం సరి అయినదని ఆచరణలో రుజువయ్యిందని అన్నారు.

తర్వాత, శ్రీయుతులు తోకల రాజారెడ్డి, కొండపల్లి గోపాలరావు, యస్. మోహనరావుగార్లు మాట్లాడారు.

శ్రీ యం. వెంకటమల్లుగారు, గత 18 మాసాల పార్టీ పని పార్టీ తక్షణ కర్తవ్యం గురించి నివేదిక ప్రవేశపెట్టారు. నివేదికపై దీర్ఘ చర్చలు జరిగిన తర్వాత యేకగ్రీవంగా ఆమోదింపబడ్డది.

తర్వాత క్రిందితీర్మానాలను ఆమోదించారు.

"వ్యవసాయ కార్మికుల వేతనాలు తాలూకాలోని వ్యవసాయ కార్మికుల స్థితిగతులు దినదినం దిగజారిపోతున్నవి. జీతాలు ఒకతాలూకాలోనే 5-6 రకాలుగావున్నవి దినవారి కూలి రేట్లు కూడా సక్రమంగా లేవు. ప్రభుత్వం చేసిన వ్యవసాయ కార్మికుల వేతనాల చట్టానికి యిప్పుడు కాలదోషం పట్టిందని, చట్టం చేసినప్పుడే పుట్టిధాన్యం రు. 200 ధర వుండేది. యిప్పుడు రు. 300 అయింది. అప్పటి ధర ప్రకారంగా చూస్తే అప్పుడు నిర్ణయించిన 300 రూపాయలకు సంవత్సరానికి జీతగానికి 12 బస్తాల ధాన్యం వచ్చేది. ధరలు పెరిగినవి. ఆ లెక్కప్రకారం చూచినా రు. 450 జీతం రావాలి.

అందువలన పై విషయాలు దృష్టిలోకి తీసుకొని ప్రభుత్వం వారు సంవత్సర జీతగానికి 450-00 రూపాయలైనా లేక 12 బస్తాల ధాన్యం అయినా వుండేటట్లు చట్టం తేవాలి. దిన కూలీలకు 2-50 పురుషులకు, 2-00 స్త్రీలకు నిర్ణయించాలని మహాసభ ప్రభుత్వాన్ని కోరుతూంది. తాలూకాలోని వ్యవసాయ కార్మికులు పై కోర్కెలను తీర్చుకోవడానికి ముందుకు రావాల్సిందిగా కూలీలను కోరుతున్నది."

పెదముప్పారం వ్యవసాయ కార్మికుల న్యాయమైన హక్కులు ఈడేర్చాలనీ, అరెస్టు చేసినవారిని విడుదల చేయాలనీ, కేసులు వారంట్లు రద్దు చేయాలనీ, 144 వ సెక్షన్ తీసివేయాలనీ మహాసభ యింకొక తీర్మానం చేసింది.

విశాఖలో ఉక్కు ఫ్యాక్టరీ నిర్మించాలని ఇండో అమెరికన్ ఫౌండేషన్ రద్దు కావాలని అత్యవసర పరిస్థితి రద్దు చేయాలని, సాగులాయకైన బంజర్లు పేదలకు పట్టాలివ్వాలని వియత్నాం నుండి అమెరికా సేనలు వైదొలగాలనీ. ఉత్తర వియత్నాంపై అమెరికా దాడిని ఆపుచేయాలనీ, గుర్తూరు ఆనకట్టను పరిశీలించాలనీ, వట్టివాగుపై ఆనకట్టను నిర్మించాలనీ, కేసముద్రం రోడ్డును పక్కారోడ్డుగా నిర్మించాలనీ మరికొన్ని తీర్మానాలను ఆమోదించారు.

62 మందిగల సమితిని ఎన్నుకున్నారు.

తర్వాత తాలూకా సమితి శ్రీ సోమ వీరాస్వామిగారి అధ్యక్షతన సమావేశమయి శ్రీ [illegible] వెంకటమల్లుగారిని కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. 15 మందితో తాలూకా కార్యవర్గం వుండాలని నిర్ణయించి ఈ క్రింది [illegible] ఎన్నుకొని తతిమ్మా స్థానాన్ని భర్తీ చేయుటకు కార్యవర్గానికి అధికారమిచ్చింది. శ్రీయుతులు యం. వెంకటమల్లు (కార్యదర్శి) యర్రోజు రామయ్య, బండ్యాల సోమయ్య, చింతకాయల రామయ్య, దాసరి వెంకటరామయ్య, ఆకుల సత్తెయ్య, వి. రాధాకృష్ణ, యర్రోజు లక్ష్మీనారాయణ, పుల్లి దివాకరాచారి, గుండా రామస్వామి, ప. మల్లారెడ్డి, దుస్సా శివలింగం, తమ్మెర వెంకటరామనరసయ్య, సోల వీరసామి.

### రాజమండ్రి పేపరు మిల్లులో అగ్ని ప్రమాదం

రాజమండ్రి, మే 12

ఆంధ్రప్రదేశ్ పేపరుమిల్స్ ఆలకట్ తోటలోగల నూతన విభాగానికి చెందిన స్టోర్సులో ఈనెల 9వ తేదీ మధ్యాహ్నం సంభవించిన అగ్నిప్రమాదంలో యంత్ర సామగ్రి కాలిపోయింది.

పైస్టోర్సువున్న ప్రాంతాన్ని పని సులువు కోసం యంత్ర సామగ్రిని 14 ప్లాటులుగా విభజించారు. అందులో సుమారు నాల్గు ప్లాటులు కాలిపోయాయి. కర్రపెట్టెలు కాలిన ఫలితంగా లోపల యంత్ర సామగ్రి ఎంత చెడిపోయిందీ ఇప్పుడు అంచనా కట్టడం కష్టమనీ, ఒకవేళ నిజంగా పై యంత్రసామగ్రి పనికి రాకుండా పోతే ఆనష్టం సుమారు పదిహేను లక్షల రూపాయలవరకు వుంటుందని, ఆ సామగ్రి పనికివచ్చేదీ పనికిరానిదీ ఫ్రెంచి నిపుణులు తెలియజేయాలనీ తెలుస్తోంది.

స్టోర్సుకు పక్కనేవున్న ఒక రిటైర్డు లాను సూపరింటెండెంటు ఇంట్లో సంభవించిన అగ్నిప్రమాదం ఇందుకు కారణమని తెలుస్తోంది.

### ఎల్.ఐ.సి. బ్రాంచి ఆఫీసుకు శంకుస్థాపన

రాజమండ్రి, మే 12

రాజమండ్రి జీవితభీమా కార్పొరేషన్ బ్రాంచి ఆఫీసు కార్యాలయ నిర్మాణానికి యీనెల 9న శాసన సభ్యులు శ్రీ పోతుల వీరభద్రరావు అధ్యక్షతను రక్షణశాఖ మాజీ ఉపమంత్రి డా॥ రాజు శంకుస్థాపన చేశారు.

శ్రీ మేడూరు సత్యనారాయణ అతిథులకు స్వాగతం చెప్పారు.

పలువురు బ్రాంచి అధికారులు, పుర ప్రముఖులు ఈ ఉత్సవంలోపాల్గొన్నారు. (వి. వి.

### శ్రీకాకుళం జిల్లా టీచర్సుగిల్డు తీర్మానం

శ్రీకాకుళం, మే 12

శ్రీకాకుళంజిల్లా టీచర్సుగిల్డు ద్వితీయ కార్యవర్గ సమావేశం మేనెల 3, 4 తేదీలలో శ్రీకాకుళం మునిసిపల్ మల్టీపర్పస్ స్కూలులో గిల్డు అధ్యక్షులు శ్రీ కూర్మాచార్యులు ఎం.ఎల్. సి. గారి అధ్యక్షతక్రింద జరిగింది.

జిల్లా గిల్డు కార్యదర్శి శ్రీ వి. ఎస్. దాస్ గారు, మార్చి క్విట్‌వర్కు కార్యక్రమంపైన జిల్లాలోని ఉపాధ్యాయుల సమస్యలపైన, 1966 బడ్జెటును నివేదించారు. కార్యదర్శి నివేదిక, బడ్జెటును కార్యవర్గం ఆమోదించింది.

ఉద్యోగుల పనినిలుపుదల కార్యక్రమంలో సంయుక్త కార్యాచరణ సమితి ప్రభుత్వంతో చేసిన రాజీబేరాలు. తృప్తికరంగాలేవని కేంద్ర ప్రభుత్వపు వేతనాలు, కరువు బత్తెం లభించేవరకు అకుంఠిత దీక్షతో కృషి జరపాలని, కార్యవర్గం, సమితిని కోరింది.

జిల్లాలోని. హైస్కూళ్ళలోను. ఉపాధ్యాయుల నియామకం విద్యా సంవత్సరారంభంలోనే చేయవలెనని కార్యవర్గం అన్ని మేనేజిమెంట్లను కోరింది.

### చీపురుపల్లిలో సీసా కిరసనాయిలు రూపాయి

చీపురుపల్లి, మే 10

కరెంటు కొరత ఏర్పడిందంటూ ప్రభుత్వం, దానిసప్లయిలో కోత పెట్టింది. అందువల్ల కొన్ని గంటలు చీపురుపల్లిలో మినహాయించుట జరిగింది. మధ్యాహ్నం 12 గం॥ నుండి రాత్రి 9 గం॥ల వరకూ కరెంటు వుండదు. కుటుంబ వాడకకు సామాన్య జనం ఉపయోగించేది సా॥ 6 నుండి 9 గం॥ వరకే.

ఈ కొరతవల్ల కరెంటు ఉపయోగం ప్రజలు లేకుండా పోయింది. కరెంటు ఉన్నవాళ్ళు లేనివాళ్ళు అందరికీ కిరోసిన్ నూనె అవసరం పెరిగింది ఒక్కదఫా ధరలు మిక్కుటంటుకున్నాయి. ఈనెల 1 వ తేదీనుండి సీసా కిరోసిన్ నూనె 31 పైసలనుండి ఒక రూపాయకు పెరిగింది అటు కరెంటు వాడకపోయినా కనీస ఛార్జీ కట్టకపోతే కనెక్షన్ రద్దు చేస్తామంటున్నారు ఎలక్ట్రికల్ డిపార్టుమెంటువారు.

హోల్‌సేల్ వర్తకులు డబ్బాకు రు. 8-50 బిల్లు యిచ్చి 12 రూపాయలకు అమ్ముతున్నారు. చిల్లర వర్తకులు సీసాకొలత తగ్గించి నీరు కలుపుతున్నారు. ఈ విధంగా పెరగటానికి గతంలో నిర్ణయించిన కోటాకి మించి అడిగితే లారీ సరుకు రు. 300 లు లంచం కట్టనిదే విశాఖపట్నం నుండి సరుకు విడుదల కావటంలేదన్నారు హోల్‌సేల్ వర్తకులు. స్థానికాధికారులను ఈ అధిక ధరలను, అక్రమాల్ని అదుపులో పెట్టవలసిందిగాకోరుతూ అర్జీలుపెట్టుకున్నా, రాయనారం వెళ్ళినా అతీగతీలేదు.

### ఆదోని టెక్స్‌టైల్ లేబర్ యూనియన్ వార్షికోత్సవం

ఆదోని, మే 12

కర్నూలుజిల్లా ఆదోని కొఠారి మిల్లుకు చెందిన ఆదోని టెక్స్‌టైల్ లేబరు యూనియన్ 9వ వార్షికమహాసభ యూనియన్‌కార్యాలయంలో యూనియన్ అధ్యక్షులు శ్రీ కె. అంజనేయులుగారి అధ్యక్షతన జరిగినది. 250 మంది కార్మికులు హాజరైనారు.

ప్రధానకార్యదర్శి శ్రీ కె. రామయ్యగారు గతసంవత్సరం నివేదికను, జమాఖర్చుల పట్టికను కోశాధికారి శ్రీ ఎస్. గోవిందస్వామిగార్లు చదివి వినిపించారు.

శ్రీ అంజనేయులుగారు మాట్లాడిన తరువాత కార్యవర్గమును ఎన్నిక జరిగింది.

అధ్యక్షులుగా శ్రీ ఎస్. రామచంద్రారెడ్డి (అడ్వకేట్) ఉపాధ్యక్షులుగా శ్రీఎం.డి.మునీర్ శ్రీ సి. కృష్ణమూర్తి, ప్రధాన కార్యదర్శిగా శ్రీ కె. రామయ్య, సంయుక్త కార్యదర్శులుగా శ్రీ ఎం. సంగన్న, శ్రీ టి. వరదరాజులు, కోశాధికారిగా శ్రీ ఎస్. గోవిందస్వామి, మరొక 21మంది కార్యవర్గసభ్యులు.

బొంబాయిలో జరుగు ఎ. ఐ. టి. యు. సి. మహాసభకు 10మంది ప్రతినిధులను, 6మంది సౌహార్ద ప్రతినిధులను ఎన్నుకొన్నారు.

### తెనాలిలో రిక్షా టైర్ల, ట్యూబుల పంపకం ఒడంబడిక

తెనాలి, మే 12

తెనాలిలో రిక్షాల టైర్లు, ట్యూబులు, కంట్రోలుధరకు దొరకక చాలాహెచ్చుధరకు కొనవలసివస్తోందని రిక్షా యజమానులు ప్రభుత్వదృష్టికి తెచ్చి, కంట్రోలు ధరకు డీలర్లనుంచి కొన్ని టైర్లు, ట్యూబులు తమకిప్పించవలసిందిగా ఆందోళన చేశారు. దీని ఫలితంగా మే 7 వ తేదీన తెనాలి ఆర్.డి.ఓ శ్రీ కె. ఆర్ పరమహంస సమక్షంలో రిక్షా యజమానులకు, డీలర్లకు మధ్య ఒడంబడిక జరిగింది. ఆ ఒడంబడిక ప్రకారం తెనాలిలో వున్న అయిదుగురు డీలర్లు వారికి వచ్చే రిక్షా టైర్లు, ట్యూబులలో సగభాగమున్నూ, సైకిలు టైరు, ట్యూబులలో నూటికి 12 చొప్పున అయాకంపెనీలు నిర్ణయించినచిల్లర అమ్మకం ధరకు రిక్షా యజమానుల సంఘానికి అందజేయాల్సి వుంటుంది. ఒడంబడిక 1-4-66 నుంచి అమలులోకి వస్తుంది.(వి.వి)

# అధ్యక్షునిపై కాంగ్రెసు సభ్యులు తెచ్చిన అవిశ్వాస తీర్మానం ఓటమి

## బోథ్ పంచాయతీ సమితిలో ఐక్య సంఘటన ఘన విజయం

బోథ్. మే 10

ఆదిలాబాద్‌జిల్లా బోథ్ పంచాయితీసమితి అధ్యక్షునిపై అవిశ్వాస తీర్మానం తీసుకువచ్చి. ఆయనను పదవినుండి తొలగించటానికి కాంగ్రెసువాదులు కొన్ని నెలలుగా చేసిన ప్రయత్నాలన్నీ నేడు విఫలమయ్యాయి. అవిశ్వాస తీర్మానాన్ని ప్రతిఘటించిన, కమ్యూనిస్టుల నాయకత్వానవున్న ఐక్యసంఘటనకు. అపూర్వ విజయం లభించింది.

బోథ్ పంచాయతీ సమితి అధ్యక్షులయిన శ్రీ లక్ష్మణరావు సూర్వపై కాంగ్రెసువాదులు అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టారు. కమ్యూనిస్టులు, ప్రగతిశీల కాంగ్రెసువాదులు,కొందరు స్వతంత్రులతో ఏర్పరచబడిన ఐక్య సంఘటన దీన్నిప్రతిఘటించింది. ఈనెల 9వ తేదీన పంచాయతీ సమితి కార్యాలయంలో అవిశ్వాస తీర్మానంపై నిర్ణయం తీసుకోవడానికి ఆదిలాబాదు ఆర్. డి. వో. పిలిపించిన పంచాయతీ సమితి సర్వసభ్య సమావేశానికి ఓటమితప్పదని ఎరిగిన కాంగ్రెసువాదులు పూర్తిగాగైరు హాజరు కావటంతో వారు తమ ఓటమిని అంగీకరించారు.

బోథ్ పంచాయతీ సమితి 1960 అక్టోబరులో ఏర్పరచబడినది మొదలు 1964 పంచాయతి సమితి ఎన్నికలవరకు కాంగ్రెసువారి అధీనంలో వుండేది. కాంగ్రెసువారి అధీనంలో పంచాయతి సమితి కార్యనిర్వహణా విధానంతో విసిగి వేసారిన కమ్యూనిస్టులు, ఇతర ప్రగతిశీలవర్గాలు. శ్రీ లక్ష్మణరావు సూర్వను, తమ అభ్యర్థిగా 1964 పంచాయతి సమితి ఎనికలయందు అధ్యక్ష స్థానానికి నిలబెట్టి గెల్పించారు. నాటినుండి తాము కోల్పోయిన స్థానాన్ని తిరిగి స్వాధీనం చేసుకోవటానికి కాంగ్రెసువాదులు తీవ్ర ప్రయత్నం చేస్తూ వచ్చారు. చివరకు వారు అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టగా కమ్యూనిస్టులు పంచాయితీ సమితి ఉపాధ్యక్షులైన శ్రీ వెంకట్రామురెడ్డిగారి వర్గమైన ప్రగతిశీల కాంగ్రెసు వాదులు. కొందరు స్వతంత్రులు, కాంగ్రెసువారి ప్రయత్నాలను ప్రతిఘటించి విజయం సాధించారు.

---

మచిలీపట్టణంలో "వివేకవర్ధిని" తెలుగు దినపత్రిక ప్రచురించుటకు శ్రీ పి. కృష్ణపూర్ణచంద్రరావుకు జిల్లాకలెక్టరు డిక్లరేషన్ యిచ్చారు.

# భీమవరంలో సిమెంటు, సబ్బుల ధరల హెచ్చింపు

భీమవరం. మే 10

భీమవరంలో సిమ్మెంటు, సబ్బులు వేరుశనగనూనె మొదలగు నిత్యావసరవస్తువుల హెచ్చురేట్లకు అమ్ముచున్నారు.

భీమవరంలో సిమెంటు కంట్రోలు ధరకు దొరకని పరిస్థితి ఏర్పడింది. బ్లాక్‌లో రు. 13 లేక 14 పెట్టితే రావలసినంత సిమ్మెంటు దొరకుచున్నది. కంట్రోలు రేటుకు ఒక్క బస్తా గూడా దొరకటంలేదు. దీనివల్ల భీమవరంలో పబ్లిక్ బిల్డింగులో, కట్టడాలు, గృహనిర్మాణాలు కుంటుపడినాయి.

భీమవరంలో సబ్బుల ధరలను ఈ మధ్య విపరీతంగా పెంచి అమ్ముచున్నారు.

నిత్యం వాడుకొనే సబ్బులు 60 పైసలు అమ్మవలసిన సన్‌లైటును75, 80 పైసల దాకా అమ్ముచున్నారు: అట్లాగే లక్స్ సబ్బును 75 - 80 పైసలు దాకా అమ్ముచున్నారు. ఇది డీలరు పెంచి అమ్ముచున్నారో చిల్లర వర్తకులు పెంచి అమ్ముచున్నారో తెలియదు.

వేరుసెనగ నూనె ఈ [illegible], క్షణం క్షణం ధర విపరీతంగా పెరిగి నేటికి వీశ రు. 6-50 అమ్ముచున్నారు.అయినా సరకురెండవ రకం అని తెలుస్తున్నది. వేరుసెనగనూనెలో ఏదో కల్తీ కలిపి బాహాటంగాఅమ్ముచున్నారు. నూనె పొంగు వస్తున్నది. అదోరకం వాసన వేస్తున్నది. దీనిపైన ప్రజారోగ్యశాఖ తక్షణం; కల్తీ కల్తీదారులను అమ్మకుండా చూడవలసివుంది. (ఎ. వి.)

### మొవ్వ సమితి ఎన్. జి. వో. సంఘం

మొవ్వ, మే 10

ఈ నెల 4న మొవ్వ బ్లాక్ డెవలప్‌మెంట్ ఆఫీసులో మొవ్వ సమితి ఎన్. జి. వో, సంఘ కార్యవర్గానికి ఎన్నికలు జరిగాయి. అధ్యక్షులు, డి. సూర్యారావు మొవ్వ ప్రోగ్రెసివ్ అసిస్టెంటు ఉపాధ్యక్షులు శ్రీ ఎ. అచ్చిరెడ్డి అగ్రికల్చరల్ ఎక్స్‌టెన్షన్ ఆఫీసరు ప్రధానకార్యదర్శి శ్రీ చంద్రమౌళీశ్వరరావు. సంయుక్త కార్యదర్శి శ్రీ ఎన్. నరసింహారావు, కోశాధికారి శ్రీ వీరాస్వామి.

### పదివేల యువజన సంఘ సభ్యత్వం

రాజమండ్రి, మే 11

తూర్పు గోదావరిజిల్లాలో 10,000 యువజనసంఘ సభ్యత్వాన్ని చేర్పించడానికి జిల్లా సంఘ కార్యవర్గం నిర్ణయించింది,

కార్యవర్గ సమావేశం మొన్న రాజమండ్రి పొట్టి శ్రీరాములు గ్రంథాలయంలో శ్రీ మండా మల్లికార్జునరెడ్డి అధ్యక్షతను జరిగింది,

జిల్లా కార్యదర్శి శ్రీ సబ్బారపు చెల్లారావు రాష్ట్ర కార్యవర్గ నిర్ణయాలు, రాజకీయ పాఠశాల ప్రాముఖ్యతను వివరించారు.

శ్రీయుతులు కొయ్యాన అప్పారావు, మజ్జి సూర్యనారాయణగార్లు మాట్లాడారు.

అయిదవ ఉక్కు ఫ్యాక్టరీని ఖచ్చితంగా విశాఖలో నిర్మించబోతున్నట్లు ప్రకటించాలనీ గోదావరి బ్యారేజి నిర్మాణం వాయిదా వేస్తున్నట్లు తెలుస్తున్నందున ఎలాంటి కాలయాపన లేకుండా వెంటనే బ్యారేజి నిర్మాణానికి ప్రభుత్వం పూనుకోవాలనీ, తీర్మానించారు.

ఈ రెండు సమస్యలపైన జిల్లాలోని యువజన సంఘాలు, రాజకీయపార్టీ, ప్రముఖులు ఆందోళన చేయాలని విజ్ఞప్తిచేశారు.

### పార్లమెంట్ హాలులో సభలు

న్యూఢిల్లీ, మే 12

పార్లమెంటు ఉభయసభలూ సమావేశం అవుతున్న సమయంలో పార్లమెంటు సెంట్రల్ హాలుతో సభ జరుపుకో నిచ్చినందుకు నేడు లోక్‌సభలో సం. సో. పార్టీ నాయకుడు శ్రీమహావీర్ త్యాగి అభ్యంతరం తెలియజేశారు.

నిన్నటిరోజున సెంట్రల్ హాలులో స్పీకరు. ప్రధాని, కొంతమంది విజ్ఞాన శాస్త్రవేత్తలూ సమావేశమయ్యారు. దానివలన పార్లమెంటులో కోరం లేకుండా పోయిందని శ్రీ త్యాగి విమర్శించారు. శ్రీమతి రేణూ చక్రవర్తి, ప్రొఫెసర్ యన్. జి. రంగా. భాగ్వత్ ఝూ అజాద్ (కాం) లు ఆయనను బలపరిచారు.

ఆ సమావేశం సాయంకాలం 5-30 గం. లకు జరుపుకోవటానికి అనుమతి నివ్వానని స్పీకరు తెలిపారు. ఆ సమయానికి పార్లమెంటు సమావేశం ముగియగలదనుకున్నాను. దేశంఅంతటినుంచీ విజ్ఞానవేత్తలు సభకువచ్చారనీ, కనుక సమావేశం వాయిదా వేయ వీలులేకపోయిందనిస్పీకరుచెప్పారు

బడ్జెట్ సమావేశాలు రాత్రి పదకొండు సాగుతూనే వుంటాయి గనక ఆ కాలంలో సెంట్రల్ హాలును మిటింగులకు యివ్వక పోవటంమంచిదని రేణూచక్రవర్తిసూచించారు

### రాజమండ్రిలో జూన్‌లో స్త్రీ ఏకపాత్రాభినయం పోటీలు

రాజమండ్రి, మే 8

రాజమండ్రి కల్చరల్ ఆర్ట్సు సెంటర్‌వారు తమ మూడవ నాటక, ప్రత్యేక నాటిక, స్త్రీ ఏకపాత్రాభినయ పోటీల నిర్వహణ ఏర్పాట్ల సందర్భంలో నిన్న సాయంత్రం శ్రీ లక్ష్మీ కేఫ్‌లో శ్రీ ముమ్మిడి కృష్ణమూర్తి అధ్యక్షతను సమావేశం జరిపారు.

శ్రీ డి. వి. సుబ్బారావు అతిథులకు స్వాగతం చెప్పారు.

"ప్రస్తుతం అనేక పరిషత్తులు పోటీలు జరుపుతున్నాయి కాని ఔత్సాహిక నాటక రంగాన్ని విస్తృతం చేసి, ఒక ప్రయోజనాన్ని సాధింపగలదోహదం చేయుటంలేదు. నాటక సమాజాల అభివృద్ధికి మార్గం చూపడంలేదు. నాటక సమాజాలు, నటుల మధ్య సన్నిహితత్వం పెరగడానికి తోడ్పడటంలేదు." అని శ్రీ మహతి అన్నారు. రంగంమీద రంగాలంకరణ, లైటింగ్, మేకప్ వగైరా విషయాలలో తీసుకోవలసిన జాగ్రత్తలు, వగైరా విషయాలపైన, ఆంధ్ర నాటక కళాపరిషత్తువారు జోనల్ పద్ధతిపై నిర్వహించబోయే నాటక పోటీల పథకాన్ని కూడా ఆయన వివరించారు.

శ్రీ పి. వీరాచారి మాట్లాడుతూ, ప్రస్తుతం కంటె గతం చాలా బాగున్నదని వినిపిస్తుందన్న నిరాశ చాలామందిలో కనిపిస్తోందన్నారు. అందులో నాటకరంగం గతం, భవిష్యత్తులను జాగ్రత్తగా చూచుకొని గతంలోని అనుభవాలను తీసుకుని ముందుకుపోవాలన్నారు. సాంకేతిక, శాస్త్ర పరిజ్ఞానాలను పెంపొందించుకోడానికి సమాజాలవారు, నటులు కృషి చేయాలని, ఈ భావాన్ని పరిషత్తులు నిర్వహించాలని అన్నారు.

నాటక నాటికల పోటీల సందర్భంలో కాల నియమాన్ని ఖచ్చితంగా పాటించాలన్నారు శ్రీ ఆర్. బి. పెండ్యాల.

రాజమండ్రి పట్టణంలో నాటక రంగానికి చెందిన వివిధాంశాలపై డిగ్రీలనిచ్చే కళాశాల స్థాపనకు స్థానిక నాటక సంఘాలవారు పుర ప్రముఖులు పూనుకోవాలని శ్రీ వరదా బ్రహ్మానందం కోరారు.

శ్రీ గండి రామకృష్ణ కల్చరల్ ఆర్ట్సు సెంటర్ తరఫున జూన్ 21, 29, 30 తేదీలలో 3వ నాటక, ప్రత్యేక నాటిక ('పాప కోసం' నిట్టల కృష్ణమూర్తి రచన) స్త్రీ ఏకపాత్రాభినయ పోటీలు జరుగుతాయని, ఎంట్రీలను జూన్ 4వ తేదీలోగా "కార్యదర్శి కల్చరల్ ఆర్ట్సు సెంటర్. దేవత వారి భవనం, రాజమండ్రి చిరునామాకు వ్రాయాలని" ప్రకటించారు.

శ్రీ టి అప్పన్న శాస్త్రి వందన సమర్పణ చేశారు. (వి.వి.)

### పోస్టల్ ఉద్యోగుల నిరశన వ్రతాలు

హైదరాబాద్, మే 12

అఖిల భారత పోస్టల్ - టెలిగ్రాఫ్ పరిపాలనాశాఖ మూడు, నాలుగు తరగతుల ఉద్యోగుల నాయకులు కేంద్ర కమిటీ ఆదేశానుసారం వేర్వేరు ఆఫీసుల ఎదుట రెండు రోజుల నిరశన వ్రతం నేడుప్రారంభించారు.

పి. ఎం. జి. ఆఫీసు బ్రాంచి సర్కిల్ కార్యదర్శి, ఆర్గనైజింగ్ కార్యదర్శులు శ్రీ కాంతయ్య, మెండెస్‌లు పోస్టుమాస్టర్ జనరల్ ఆఫీసుముందు నిరశన వ్రతం చేస్తున్నారు.

డి.ఎం.టి ఆఫీసుశాఖ సహాయ కార్యదర్శి శ్రీ ఎం, ఎస్. రెడ్డి డి. ఎం. టి. ఆఫీసు వద్ద, టెలిఫోన్ రెవెన్యూ ఎక్కౌంట్స్ ఆఫీసుశాఖ అసిస్టెంట్ సర్కిల్ కార్యదర్శి జోసెఫ్ అగస్టయిన్, ఆ ఎక్కౌంట్స్ ఆఫీసు ముందు నిరశన వ్రతం చేస్తున్నారు.

హైదరాబాద్ సర్కిల్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీ ఎస్. సత్యనారాయణరెడ్డి ఆయా ప్రదేశాలన్నీ పర్యటించి, నిరశన వ్రతం ప్రారంభించే ముందు ఉద్యోగులను ఉద్బోధిస్తూ ప్రసంగించారు.

శ్రీ మగ్దూం మొహియుద్దీన్ నిరశన వ్రతం చేస్తున్న నాయకులనుచూసి. వారి న్యాయమయిన కోరికలను ఆంధ్రప్రదేశ్ ట్రేడ్ యూనియన్ కాంగ్రెసుబలపరుస్తున్నదన్నారు.

ఉద్యోగుల కోరికలు ఇవి :

అత్యవసర పరిస్థితికి పూర్వం వున్నపని గంటలను తిరిగిప్రవేశపెట్టాలి.

-ఓవర్‌టైమ్ భత్యాల కోతను రద్దుపరచాలి.

తమ ఉద్యమంవచ్చినట్లు ఉద్యోగులపైనగా పెట్టే ఉద్యోగ భారాలను తగ్గించవలెను, రిట్రెంచిమెంటూ మానాలి.

రేపుకూడా నిరశనవ్రతం సాగుతుంది. రేపు ఉద్యోగులంతా ఉమ్మడి నిరశనవ్రతం చేస్తారు.

రేపు సాయంకాలం సారస్వత పరిషత్తు ఆవరణలో బహిరంగసభతో ఈ ఆందోళన ముగుస్తుంది. (వి. వి.)

---

మే 29, 21 తేదీలలో కావలిలో ఆంధ్రప్రదేశ్ ప్రజా సోషలిస్టుపార్టీ మహాసభ జరుగుతుంది. రాబోవు ఎన్నికలలో తమపార్టీ అనుసరించే విధానాన్ని, వివిధ నియోజక వర్గాలలో అభ్యర్థులను ఆ సభలో నిర్ణయిస్తారు. శ్రీ యన్. జి. గోరే, హేంబారువా, మున్నా గోవిందరెడ్డి ప్రభృతులు పాల్గొంటారు.

### భువనగిరి తాలూకా యువజనోద్యమం కదలిక

భువనగిరి, మే 12

భువనగిరి తాలూకా యువజన సంఘ సదస్సు మే 8 న భువనగిరిలో జరిగింది. తాలూకా అన్ని ప్రాంతాలనుండి ప్రతినిధులు హాజరైనారు. సభకు శ్రీ నసీం ఆరిఫ్ అధ్యక్షత వహించారు.

కన్వీనర్ శ్రీకృష్ణ తొలుత ప్రసంగిస్తూ, తాలూకాలో 200 సభ్యత్వం పూర్తిచేయబడిందని, కనీసం ఇంకా 500 సభ్యత్వం చేర్పించాలనీ అన్నారు. యువకులు ఎదుర్కొంటున్న అనేక సమస్యలను పరిష్కరించడానికి పటిష్ఠవంతమైన యువజనసంఘ నిర్మాణం అవసరమన్నారు.

సదస్సుకు హాజరైన, ఆంధ్రప్రదేశ్ యువజనసమాఖ్య సహాయ కార్యదర్శి శ్రీ కే. ప్రతాపరెడ్డి ప్రసంగిస్తూ, కుల, మత, తత్వాలకు గురికాకుండా, అభ్యుదయభావాలుగల దేశపౌరులుగా యువకులను తీర్చిదిద్దడానికి, యువకులలో నిరక్షరాస్యతను నిర్మూలించడానికి సాంస్కృతిక రంగాలలో వారిని అభివృద్ధిపరచడానికి యువజన సంఘాలనిర్మాణం అత్యంతావశ్యకమన్నారు. వివిధ దేశాలలో యువజన సంఘాల నిర్మాణాన్ని గురించి అఖిలభారత యువజన సమాఖ్య దాని శాఖలు చేస్తున్న కృషిని. కార్యక్రమాన్ని వివరించారు. యువకులు అధిక సంఖ్యలో యువజన సంఘాలలో చేరి సోషలిజ నిర్మాణానికి కృషి చేయాలన్నారు.

శ్రీ పి. చెన్నారెడ్డి, సందేశమిస్తూ ఏ దేశ చరిత్ర చూసిన యువకులు నిర్వహిస్తున్న పాత్ర ఎనలేనిదన్నారు. దేశ భవిష్యత్తు - జాతి భవిష్యత్తు యువకులపైననే ఆధారపడి వుందన్నారు. యువకులను సరైన మార్గంలో నడిపించడానికి యువజన సంఘ నిర్మాణం తప్పనిసరి అన్నారు.

ఆంధ్రప్రదేశ్ యువజన సమాఖ్య నిబంధనావళిని అంగీకరిస్తూ సదస్సు తీర్మానించింది.

అనేక అంశాలపై చర్చ జరిగినమీదట సభ్యత్వాన్ని కనీసం 500 వరకు పూర్తి చేయాలని: యీనెల 22 వ తేదీన పెద్దఎత్తున తాలూకా యువజన మహాసభ జరపాలని తీర్మానించారు.

మహాసభ ఏర్పాట్లకోసం యీ క్రింది వారితో సన్నాహక సంఘాన్ని సదస్సు ఎన్నుకుంది.

శ్రీ పి. చెన్నారెడ్డి (అధ్యక్షులు) శ్రీ జి. స్వామి, శ్రీ కె. అప్పయ్య, శ్రీ ఆర్. మల్లేశం శ్రీ నసీం ఆరిఫ్, శ్రీ పి. వెంకట్రాజయ్య, శ్రీ పి. ఈశ్వరయ్య, శ్రీ కె. నర్సింహ, శ్రీ కె. కృష్ణ (కార్యదర్శి).

సదస్సు ముగిసిన వెంటనే సన్నాహక సంఘం సమావేశం మహాసభ ఏర్పాట్ల గురించి చర్చించింది. నిధి వసూళ్ళ కొరకు మరునటి రోజునుంచే కార్యక్రమం తీసుకోబడింది. మహాసభకు కనీసం 300 మంది ప్రతినిధులు హాజరవుతారని భావిస్తున్నారు.

# గుంటూరు దేవాదాయ భూములు, ఆక్రమణదార్లకు వాయిదా పద్ధతిపై ఇవ్వాలి

## ఆక్రమణదారుల మహాసభ విజ్ఞప్తి

గుంటూరు, మే 11

గుంటూరుపట్టణ దేవాదాయ ధర్మాదాయ భూముల ఆక్రమణదారుల మహాసభ ఈనెల 8 న కమ్యూనిస్టుపార్టీ, మార్క్సిస్టు కమ్యూనిస్టుపార్టీ, స్వతంత్రపార్టీ, జనసంఘం. యస్. యస్. పి., పి. యస్. పి. పార్టీల ఆధ్వర్యాన న్యూసిటీ టాకీసులో జరిగింది. ఈ మహాసభకు స్థానిక శాసనసభ్యులు శ్రీ కనపర్తి నాగయ్య అధ్యక్షత వహించారు.

అధ్యక్షులు శ్రీ నాగయ్య మహాసభ ఏర్పాటు ఉద్దేశాన్ని వివరిస్తూ గత 25 సంవత్సరాలనుండి పట్టణంలోని పేద ప్రజానీకం ఏవిధంగా నివాసములు లేక అష్టకష్టములు అనుభవించుచున్నదీ తెలియజేశారు. సంజీవయ్యానగర్, ఆనంద తీర్థ అగ్రహారం పొట్టి శ్రీరాములు నగర్, మొదలగు పేటల స్థాపన, కార్మికుల వీరోచితపాత్ర, ప్రభుత్వనిరంకుశ వైఖరిని గుర్తుచేస్తూ ఆక్రమణ, భూములను దఫాలవారీ తీర్చుకొను పద్ధతిమీద అక్కడ నివసించువారికి యిచ్చేలా కృషి చేయాల్సిన అవసరాన్ని నొక్కి చెప్పారు. ఆక్రమణదారుల ఐక్యతే విజయాన్ని చేకూర్చగలదని. కాంగ్రెస్ ప్రభుత్వం వున్నవారికే గృహవసతి గృహ నిర్మాణ పథకం పేరుతో కల్పిస్తున్నదనీ అన్నారు. గుంటూరు మునిసిపాలిటీ వారుకూడ రోడ్లు,మార్జిన్లలో నున్నవారికి గృహవసతి కల్పించక తమ లాభాలను మాత్రమే చూచుకొంటున్నారనీ, అందరు సహకరిస్తే ఇప్పుడు నివసిస్తున్న స్థలాలను సాధించుకొనవచ్చుననీ చెప్పారు.

స్వతంత్రపార్టీ నాయకుడు శ్రీ జాగర్లమూడి చంద్రమౌళిగారు మాట్లాడుతూ గుంటూరు పారిశ్రామికంగా అభివృద్ధిచెందిందనీ. మునిసిపాలిటీ వీరివారికి యిండ్లవసతి చూపెట్టాల్సిన బాధ్యత విస్మరించిందనీ, ఆక్రమణ దారులకు దఫాలవారీ తీర్చుకొను పద్ధతిపై స్థలాలను యిచ్చుటకు కృషి చేయాలని, యీ కృషికి అన్నివిధాల తన పార్టీ సహకారం వుంటుందన్నారు.

పి. యస్. పి. నాయకులు శ్రీ యం. యస్. చింతలపాటి మాట్లాడుతూ దేశంలో ఆహార సమస్య ఎంత తీవ్రంగావుందో లేని వారికి యిండ్ల సమస్య కూడా అంత తీవ్రంగా వుందనీ, ఇండ్లసమస్యను గురించిన కార్యక్రమంలోకలిసి పనిచేయుటకు తన పార్టీ సిద్ధంగా వుందనీ హామీ యిచ్చారు.

యస్. యస్. పి తరఫున శ్రీ నంబూరి సుబ్బారావు ఏపేటలోవున్నవారిని ఆపేటలో వుంచుటకుజరుగు కృషికి తమ సహకారం వుంటుందన్నారు.

మార్క్సిస్టు కమ్యూనిస్టుపార్టీ తరఫున శ్రీ కోనూరి నారయ్య మాట్లాడుతూ గుడిసెల సమస్య విషయంలో తమ పార్టీ పూర్తి సహకారం వుంటుందన్నారు.

శ్రీ వేములపల్లి శ్రీ కృష్ణ మాట్లాడుతూ, ప్రజల పోరాటం వల్లనే గుంటూరులోని సంజీవయ్యానగర్, ఎ. టి. అగ్రహారం. మంగళదాసునగర్, పొట్టి శ్రీరాములు నగర్ శివరాంనగర్ మొదలగునవి స్థాపించబడ్డాయనీ ఏదో కాకతాళీయంగా గాక నిత్యం గృహనివాసం కొరకు జరిగిన ఆందోళన ఫలితంగానే యీ రోజు ఆక్రమణదారులు తమ యిళ్ళలో నివసిస్తున్నారనీ, యీ ఆందోళనను అసెంబ్లీలో ప్రతిబింబించి. స్థలాల స్వాధీనంకొరకు కృషి చేస్తామని హామీ యిచ్చారు.

మునిసిపల్ కౌన్సిలర్ పాళం వెంకటేశ్వరరావుగారు 1954 లో పొట్టిశ్రీరాములు నగర్ ఎట్లా స్థాపించబడింది, ఇప్పుడు ఏ స్థితిలో వున్నది వివరించారు.

సంగడిగుంట ఆనందతీర్థ, అగ్రహారం, ఏనాది కాలనీ. కంకరగుంట. మంగళదాసు నగర్, శివరామ్ నగర్, సంజీవయ్యా నగర్, శ్యామలదాసు అగ్రహారం నుండి. యితర ప్రాంతాలనుండి వచ్చిన ప్రతినిధులు వారి పేటల పుట్టుపూర్వోత్తరాలు ప్రస్తుత కర్తవ్యాలను వివరించారు.

స్వర్ణనగర్ గృహనిర్మాణ మండలి తరఫున శ్రీ వెంకటేశ్వరరావు క్రొత్తగా ఏర్పడు కమిటీతో సహకరించి పనిచేయుటకు వారి సంఘం తరఫున హామీ యిచ్చారు.

సభ అనంతరం ప్రభుత్వానికి గుడిసెల విషయమై మెమోరాండం యిచ్చుటకు శ్రీ కనపర్తి నాగయ్య (కమ్యూనిస్టు), శ్రీ జాగర్లమూడి చంద్రమౌళి (స్వతంత్రపార్టీ). శ్రీ [illegible] యజ్ఞనారాయణ (జనసంఘం). శ్రీ యం. యస్. చింతలపాటి (పి.ఎస్.పి.). శ్రీ నంబూరి సుబ్బారావు (ఎస్. యస్. పి.) శ్రీ కోనూరి నారయ్య (మార్క్సిస్టు కమ్యూనిస్టు) గార్లతో కమిటీ ఏర్పడింది.

అన్ని పేటల నుండి ఒక్కొక్కర్ని కో-ఆప్టు చేసుకొనుటకు మహాసభ తీర్మానించింది.

---

పెద్దాపురం విజ్ఞానసమితి సభ్యులు పెద్దాపురం పి. టి. కాలేజిలో ఇటీవల కాలేజీ ప్రిన్సిపాల్ శ్రీ జోస్యం రాధాకృష్ణ అధ్యక్షతన సమావేశమై కొత్త సంవత్సరానికి కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. దీనికి అధ్యక్షులుగా శ్రీ జోస్యుల రాధాకృష్ణగారు ఎన్నికైనారు.

# "చైనా-రష్యాల మధ్య రుమేనియా మధ్యవర్తిత్వం లేదు"

## యుగోస్లావియా పత్రిక 'బోర్బా' వెల్లడి

బెల్‌గ్రేడ్, మే 11

చైనా, సోవియట్ కమ్యూనిస్టు పార్టీల మధ్య రుమేనియానాయకుల మధ్యవర్తిత్వం జరిపే సమస్య లేదని యుగోస్లావియా కమ్యూనిస్టు దిన పత్రిక "బోర్బా" నేడు తెలియజేసింది,

సోవియట్ కమ్యూనిస్టుపార్టీ ప్రధాన కార్యదర్శి లియోనిడ్ బ్రెజ్నెవ్ ప్రస్తుతం బుఖారెస్టులో ఉన్నారు. చైనా ప్రధాని ఈ నెలాఖరులో రుమేనియాను సందర్శించుతారు.

రుమేనియా నాయకులతో ఈ క్రింది సమస్యలను బ్రెజ్నెవ్ చర్చించుతారని మాస్కోలోని "బోర్బా" విలేకరి వ్రాస్తున్నాడు.

(1) సోవియట్ యూనియన్, తూర్పు యూరప్ దేశాల ఆర్థిక సహకార సంస్థ సభ్యుల సంబంధాలు. (2) ప్రపంచ కమ్యూనిస్టు ఉద్యమంలో పరిస్థితి, (3) చైనా - సోవియట్ ఘర్షణ.

### అల్లూరులో యువజన విద్యార్థి రాజకీయ పాఠశాల

అల్లూరు, మే 12

దక్షిణ నెల్లూరుజిల్లా యువజన, విద్యార్థి రాజకీయ పాఠశాల కోవూరు తాలూకా అల్లూరు పట్టణంలో 1966 మే నెల 20, 21 22 తేదీలలో జరుగనున్నది. మార్క్సిస్టు సిద్ధాంత వేత్తలు శ్రీ కంభంపాటి సత్యనారాయణ. రాష్ట్రయువజన సంఘ అధ్యక్షులు శ్రీ బి. సుబ్బారెడ్డి, కావలి వాణీ ట్యుటోరియల్ కాలేజి ప్రిన్సిపాల్ ఆర్. సుందరరావు గారలు ఉపాధ్యాయులుగా వస్తారు.

యువజనసంఘ కార్యకర్తలు. విద్యార్థి సోదరులు తమ సిద్ధాంత, రాజకీయ, చైతన్యం పెంపొందించుకొనుటకు ఈ అవకాశమును వినియోగించుకొని తమ అభివృద్ధికి, యువజనోద్యమాభివృద్ధికి తోడ్పడ వలెనని ఆహ్వాన సంఘం కోరుతున్నది.

స్కూలుకు హాజరగువారు తమ పూర్తి అడ్రసుతో 15 వ తేదీ లోగా యన్. నాథ్యాన్, ఆహ్వానసంఘ కార్యదర్శి, అల్లూరు పోస్టు, నెల్లూరు జిల్లాకు వ్రాయాలి.

### విజయవాడలో ప్రత్యేక లారీస్టాండు ఏర్పరచాలి

విజయవాడ, మే 10

కృష్ణాజిల్లా లారీ ఓనర్సు అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి శ్రీ పి. కేశవరావు ఈ విధముగా తెలియపరచుచున్నారు:—

ఈనాడు వివిధ సరుకుల ట్రాన్సుపోర్టులో రైల్వేలు తర్వాత లారీలు అగ్రస్థానమలంకరించుచున్నవి. ఆంధ్రదేశమునకు రాజధాని అయిన హైదరాబాదు తర్వాత విజయవాడ రెండో రాజధానియని చెప్పవచ్చును. విజయవాడ రోజురోజుకు వ్యాపారముగా ఎవ్వరి ప్రత్యేకకృషి లేకుండానే దినదినాభివృద్ధిచెందుతున్నది. వ్యాపారములో పాటు పట్టణము కూడా అభివృద్ధి చెందుతున్నది. 1962 లో విజయవాడలో 40, 50 లారీలకు మించి లేవు. ఇతర గ్రామముల నుంచి రోజూ 30 లారీలకు మించి వచ్చేవి కావు. ఈ రోజున ఒక్క విజయవాడలోనే 600 లారీలు కలవు. రోజు యితర గ్రామముల నుంచి కనీసము 100 లారీలు వచ్చుచున్నవి. ఈ రోజున విజయవాడలో ఎన్నో మెకానిక్ షెడ్లు ఉన్న విషయం అందరికీ తెలిసినదే. దానినిబట్టి విజయవాడలో ఎన్ని లారీలు వున్నదీ, విజయవాడ లారీ ట్రాన్సుపోర్టు ఎంత అభివృద్ధి యైనదో తెలియుచున్నది. లారీలు బాగుచేయించుకొనుటకు మెకానిక్ షెడ్లు ఖాళీలేక రోడ్లమీద పెట్టుకొని చేసుకోవలసి వస్తోంది.ఖాళీలారీలు రోడ్లమీద యెక్కడపడితే అక్కడ పెట్టుకొనవలసిన పరిస్థితియే ఉంటినది. విజయవాడ మున్సిపాలిటీ వారు పట్టణ ప్రజారోగ్యము దృష్టిలోపెట్టుకొని ఖాళీలారీలు పెట్టుకొనుటకు లారీ స్టాండు మెకానిక్ షెడ్లు అన్నియు ఒకేచోట వుండులాగున ఏర్పాటు చేసినచో లారీ ఓనర్సుకు, యితర ప్రజానీకమునకు ఎంతో వీలుగా యుండును. కనుక మా అసోసియేషన్ తరఫున గత రెండు సంవత్సరములుగా లారీ స్టాండు ఏర్పాటు చేయవలసినదిగా మునిసిపాలిటీవారిని ఎన్నోసార్లు కోరియున్నాము. ఎట్టకేలకు మున్సిపాలిటీ వారు గతసంవత్సరం లారీస్టాండు నిమిత్తం పైపుసేషన్. బందరులాకులమధ్య నున్న స్థలమును లారీస్టాండుక్రింద ప్రకటించియున్నారు. ఆ స్థలము బాగుచేయుటకు రు. 10 వేలుకూడా మున్సిపాలిటీవారుశాంక్షన్ చేసియున్నారు. అక్కడ కాపురముంటున్న ప్రజలు కోర్టులకువెళ్ళిన ఫలితముగా కొంతకాలము ఆగినది. హైకోర్టులో గూడ మున్సిపాలిటీయే గెలిచినది. అయినప్పటికీ యీరోజు వరకు ఆ ప్రదేశంలోవున్న వారిని ఖాళీచేయించి లారీ స్టాండుగా ఏర్పాటుచేయలేదు. ఎక్కడా పెట్టుకొనుటకు స్థలములేక ఖాళీ లారీలు ఎక్కడ వీలుగా ఉంటేఅక్కడ పెట్టుకొను చున్నారు. పోలీసువారు రోడ్డుమీద లారీని పెట్టినందుకుగాను విపరీతముగా కేసులు పెట్టుచూ రు 25.00 లకు తక్కువ గాకుండా ఫైన్‌లు వేయుచున్నారు. లారీవారలు తప్పు చేయకుండానే అనవసరముగా ఫైన్‌కు గురియగుచున్నారు. ప్రభుత్వంవారు వెంటనే జోక్యం చేసుకొని లారీ స్టాండు ఏర్పాటు అయ్యేలా చూడగోరు చున్నాం. మునిసిపాలిటీవారు అంగీకరించిన లారీస్టాండు వ్యాపార స్థలమునకు అందుబాటులోయున్నది అదిగాక లారీ ఓనర్సుకు అన్ని విధములా అందుబాటులో యున్నది. కనుక ఆ స్థలము లోనే లారీ స్టాండు ఉండునట్లుగాను ప్రభుత్వాన్ని మున్సిపాలిటీవారిని కోరుచున్నాను.

ఈ స్టాండు విషయములో విజయవాడలో వున్న అన్ని రాజకీయ పార్టీలు ప్రత్యేక శ్రద్ధ వహించి స్టాండు ఏర్పాటు అగుటకు సహాయపడవలసినదిగా కోరుచున్నాను.

### కల్లెడ గ్రామ జీతగాండ్ర మహాసభ

కొత్తూరు. మే 12

వరంగల్ జిల్లా వర్ధన్నపేట బ్లాక్ కల్లెడ గ్రామ వ్యవసాయ కార్మికుల (జీతగాండ్ర) సమావేశం యీ నెల 6 న శ్రీ చిర్ర మల్లయ్యగారి అధ్యక్షతన జరిగింది. 100 మంది హాజరయినారు. బ్లాక్ కమ్యూనిస్టుపార్టీ కార్యదర్శి శ్రీ అజ్మీరా టూక్యా వ్యవసాయ వేతనచట్టం ప్రకారం జీతాలు తీసుకోవాలని కోరారు. ఈ గ్రామంలో జీతాలు లెక్కవేయగా సంవత్సరానికి రూ 222-50 కన్న ఎక్కువ గిట్టడంలేదు. దానికి తెచ్చుకుంచే ఆరు మాసముల ధాన్యం అప్పుకుంటారు. సాలు ఆఖరికి అప్పుగా యిచ్చిన ధాన్యం పుటంకు యీ 2-50 కట్టుకొని దానికి మార్చుకుంటారు. కొన్నిచోట్ల నెలకు రు. 22 లు మరికొన్నిచోట్ల, రు. 18 కన్న యెక్కువ గిట్టడములేదు. సమావేశములో 5 గురితో ఒక కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షులు : శ్రీ సంపెల్లి వెంకటాపు.వేతన చట్టం ప్రకారం జీతాలు యివ్వాలని యజమానులకు వ్రాత పూర్వకంగా నోటీసులు యిచ్చి లేబరు ఆఫీసరుకు దరఖాస్తులు పంపారు.

ఈ నెల 7 న కొత్తూరు జీతగాండ్ర సమావేశం జరిగింది. 30 మంది జీతగాండ్లు హాజరైనారు. ఈ గ్రామంలో నెలకు రు. 18 లకు మించి గిట్టడం లేదు దానికి తెచ్చిన వాటికిందధాన్యం క్రింద నెలకు రు. 10 లు కట్టుకొని వాటిలు పూర్చుకుంటారు.

# రేడియో

ఆదివారం — మే 15
శక 1888 ★ వైశాఖ 25

### విజయవాడ

357.1 మీ. (840 కిలోసై.)

ఉదయం: 6-00 వందేమాతరం, శుభోదయం, ప్రసారవిశేషాలు; 6-10 భక్తిరంజని; 6-40 అం. వా; 6-45 సూక్తి ముక్తావళి; 6-50 వాద్య సంగీతం: 7-00 తె. వా; 7-15 సంగీత శిక్షణ (సీనియర్లకు); 7-30 అమరవాణి; 7-45 సుబద్ద సంగీత్; 8-0 అం. వా; 8-15 హిం. వా; 8-30 బొమ్మరిల్లు; 9-15 ప్రసార సమాప్తి.

మధ్యాహ్నం: 12-30 రాజా జగన్నాథ్ దేవవర్మ - వయొలిన్; 1-00 హై. రిలే; 1-30 అం. వా: 1-40 హిం. వా; 1-50 తె. వా; 2-00 ప్రసార సమాప్తి.

3-00 హై. వలె; 4-00 సమాప్తి.

సాయంత్రం: 5-30 స్థానిక ప్రకటనలు; 5-35 పెరటిలో పెన్నిధి - రూపకం; 6-00 అం. వా; 6-05 వాద్య బృందం; 6-15 ప్రాం. వా; 6-25 ప్రస్తుతాంశం; 6-30 హై. రిలే: 7-00 తె; వా; 7-15 దీక్ష; 7-25 ముఖ్య ప్రకటనలు; 7-30 సరస వినోదిని; 7-45 చిత్ర తరంగిణి; 8-15 హిందీ లో కదంబ కార్యక్రమము; 8-30 వయొలిన్; 8-55 ప్రస్తుతాంశం; 9-00 అం. వా; 9-30 చావలి కృష్ణమూర్తి; 10-30 అం.వా; 10-35 జనగణమన - ప్రసార సమాప్తి.

### హైద్రాబాద్ - (ఎ)

405.4 మీ. (740 కిలోసై.)

ఉదయం: 6-00 వందేమాతరం, కార్యక్రమ వివరణ; 6-10 భక్తిరంజని; 6-40 అం. వా; 6-45 సూక్తి ముక్తావళి; 6-50 వాద్యగోష్ఠి; 7-00 తె. వా; 7-15 విజయవాడ వలె; 7-30 అమరవాణి: 7-45 లలిత సంగీతం: 8-00 అం. వా. 8-15 హిం. వా; 8-30 హై. బి. వలె; 9-30 హిందీలో కదంబ కార్యక్రమము; 10-00 మరాఠీ శ్రోతలకు; 10-30 కన్నడ శ్రోతలకు; 11-00 సమాప్తి.

మధ్యాహ్నం: 12-30 బచ్చోం కేలియే; 1-00 రంగవల్లి; 1-30 అం.వా; 1-40 చిత్రసీమ; 1-50 తె. వా: 2-00 బృంద గీతాలు; 2-10 ఉ. వా; 2-20 బాలవినోదం; 3-00 ప్రతిధ్వనులు - నాటిక; 4-00 సమాప్తి.

సాయంత్రం: 5-30 స్థానిక ప్రకటనలు; 5-35 వి. వలె; 6-00 అం.వా. 6-05 ప్రాం. వా. ఉర్దూ: హైద్రాబాద్, కడపలు మాత్రమే 6-15 ప్రాం.వా; 6-25 ప్రస్తుతాంశం; 6-30 వ్యవసాయక విషయాలు; 7-0 తె.వా; 7-15 దీక్ష; 7-25 ముఖ్యప్రకటనలు; 7-30 వి. రిలే; 7-45 నేను సిగరెట్టు ఎందుకు మానాలి? - ప్రసంగం; 7-55 విరామ సంగీతం; 8-00 ఆంగ్లప్రసంగం: 8-10 విరామ సంగీతం; 8-15 ఈ మాసపు పాట; 8-20 నగర శ్రోతలకు; 8-30 చిత్రసీమ; 8-55 ప్రస్తుతాంశం: 9-00 అం. వా; 9-15 ఉ. వా; 9-30 ఉర్దూ ప్రసంగం; 9-40 శ్రోతల ఉత్తరాలకు జవాబులు - ఉర్దూ: 9-45 ఉర్దూ నాటిక; 10-15 సారంగి; 11-00 అం. వా; 11-05 వాతావరణసూచన - జన గణ మన - సమాప్తి.

### హైద్రాబాద్ - (బి)

కడప
333.3 మీ. (900 కిలో సై.)
విశాఖపట్నం
322.6 మీ. (930 కిలో సై.)
సా॥ 5-30 నుండి రా॥ 9-30 వరకు

89.42 మీ. (3355 కిలో సై.)
[హైద్రాబాద్ మాత్రమే]
ఉదయం: 6-00 హై. ఎ. వలె;
49.02 మీ (6120 కిలోసై)
8-00 హై.ఎ.వలె; 8-30 సంగీతామృతం; 9-30 ప్రసార సమాప్తి.
42.02 మీ. (7140 కిలో సై.)
[హైద్రాబాద్ మాత్రమే]

మధ్యాహ్నం: 12-30 ఎస్.రాజషణ్ముఖం; 1-00 హై. ఎ. వలె. 2-10 గానసుధ; 2-20 హై. ఎ. వలె; 4-00 ప్రసార సమాప్తి.

60.12 మీ. (4990 కిలో సై.)

సాయంత్రం: 5-30 హై. ఎ. వలె; 7-00 తె. వా; 7-15 హై. ఎ. వలె; 9-15 ఆంగ్లం; 9-30 వి. రిలే; 10-30 హై.ఎ. వలె; 11-05 వాతావరణసూచన-జన గణ మన- సమాప్తి.

### మద్రాసు - (బి)

211.3 మీ. (1420 కిలో సై.)

ఉదయం: 6-00 వందేమాతరం, మంగళ గానం; 7-00 తె.వా; (193.5 మీటర్లపైగూడా) 7-15 మెల్లిసై; 7-30 చిత్ర గానం: 8-45 అటవిపువు; (41.90 మీటర్లపై) 9-30 కళారంగం; 10-00 మాలామాలై; 10-30 సమాప్తి.

211.3 మీ. (1420 కిలోసై)

మధ్యాహ్నము: 11-55 ప్రాంతీయ కెయిదిగళ్; 1-00 పాశ్చాత్య సంగీతం; 1-30 అం. వా: 1-40 హిం. వా; 1-50 తె. వా: 2-00 చంద్రగుప్త- నాటిక- తెలుగు: 3-00 వాతావరణ సూచన, ప్రసార సమాప్తి.

[5-30 నుండి 6-30 వరకు 60.98 మీ.గూడా]

సాయంత్రం: 5-30 పాశ్చాత్య సంగీతం; 6-00 అం. వా; 6-05 ప్రాంతీయకెయిదిగళ్; (193.5 మీటర్లపై గూడా) 6-20 వాతావరణ సూచన. స్థానిక ప్రకటనలు: 6-40 టి. డి. జయలక్ష్మి: 7-00 తె. వా; 7-15 వాద్యసంగీతం: 7-30 గీతమాలిక; 8-00 వీణ; 8-30 ఇతరప్రాంత సంగీతం; 8-55 ప్రస్తుతాంశం; 9-00 అం. వా; 9-30 పాశ్చాత్య సంగీతం; 10-30 అం.వా; 10-35 వాతావరణసూచన- జన గణ మన - ప్రసార సమాప్తి.

---

# విద్యాశాఖ పరిపాలనలో మన అధికారుల తుగ్లక్ ఫర్మానాలు

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విద్యాశాఖ వారులు ఇటీవల విద్యాస్థాయి పెంపుదలకు రాబోలు రోగ మొక్కటైతే మందు ఒకటివాడు నగం వాక్యమ్మాదిరిగా వ్యవహరించారు. "తెలిసి తెలియని నరుడెల్ల బ్రహ్మవశమే" అనుమాదిరిగా వున్నది ప్రభుత్వ విద్యాశాఖ పాలన నూతనవుత్తర్వులను హఠాత్తుగా జారీ చేయుట, గట్టి ఆందోళన జరిగినతరువాత, వెనక్కు జరుగుట, దాని వలన ప్రభుత్వ విధానము ఒక పంథాలో నేసుండా. వాస్తవముగా ఆ రంగములో నున్న అనుభవజ్ఞులు గాని, పాఠశాలలఉపాధ్యాయులతో సంబంధం కలిగి కనులారా చూచు డిప్యూటి ఇన్స్పెక్టర్ల సలహాలుగాని పొందకుండా వాస్తవ పరిస్థితులను గమనింపకుండా ఆఫీసులో గొప్పవారు అనుభవంలేని వారి సలహాలతో పథకాలు వేయుట విచారకరం ఈ విషయం వాస్తవమని అతిశయోక్తికాదని ఈ క్రింది వాటిని చిత్తగించిన పాఠక మహాశయులకు బోధపడగలదని నా మనవి.

### నూతన వుత్తర్వులు వాటి మార్పులు

1: 7 వ తరగతికి కామన్, పబ్లిక్ పరీక్షలని మంత్రి ప్రకటన. మార్పు ; కామన్ పరీక్షలు ఇంటర్ వాల్యుయేషన్ ఈ సం॥ మాత్రం. దీని ఫలితం: టౌన్‌లలో హైస్కూళ్ళలో బి. ఇ. డి. వారి పర్యవేక్షణ, పల్లెల్లోవారికి అయా హెడ్‌మాస్టర్లకు సంబంధించిన టీచర్ల అధ్వర్యం, ఇందువల్ల టౌన్ హైస్కూళ్ళలోని పిల్లలు సక్రమముగా హాజరై, కొంత విద్యాబోధ జరిపించుకున్న నేరానికి ఎక్కువ శాతం ఉత్తీర్ణులు కాక పోవటం పిల్లల, ఉపాధ్యాయుల భాగ్యం. పల్లెలలోని విద్యార్థులకు అనేకరకాలచిక్కుల వల్ల హాజరు కాలేకపోవటం జరిగింది. (వివరాలు క్రింద ఇస్తున్నాను) ఉపాధ్యాయుని పరిస్థితులు, పరికరములు, విద్యాపాలన కారణాలవల్ల సక్రమ బోధన లేక వున్న వారు ఈ పరీక్ష విధానంవల్ల ఎక్కువ శాతం (అనేక మార్గాలు - వివరాలు అందరికి తెలుసు) ఉత్తీర్ణులగుట టౌన్ విద్యార్థులు. టీచర్లు తల్లి దండ్రులవల్ల దూషణలకు అంతకు మించినవాటికి లోనగుట,

2, ఎక్కడ, ఏజిల్లాలోలేనటి విధానం 5వ తరగతి విద్యార్థులకు సంవత్సరాంతపు పరీక్షలు, జిల్లా స్థాయిలో జరగాలని కర్నూలు డి. ఇ. ఓ. నెం. 28 ఎఫ్ 166, 5-3-66

**శ్రీ జి. వి. చలపతిరావు**
అర్గనైజరు : టీచర్సు యూనియన్
మార్కాపురం

ఉత్తర్వు సంవత్సరాంతములో అనగాఏప్రిల్ 15వ తేదీ అందరికి అందుట.

మార్పు: ఈసంవత్సరానికి బ్లాక్‌స్థాయిలో జరుపాలని ఏప్రిల్ ఆఖరులో తెలుపుట,

ఈ 5వ తరగతి పరీక్షలు బ్లాక్ స్థాయిలో అని అప్పటికిగా అన్నందున కామన్ పరీక్షపత్రములు అచ్చువేయించుట, తయారు చేయుట అన్ని పాఠశాలలకు అందించుట వగైరాలలో ఆర్థికమును సమకూర్చు కొనుటలో విద్యాధికారులు, ఉపాధ్యాయులు పడు ఆర్భాటం, శ్రమ వర్ణనాతీతం. పాపం ఇంత వీరి అనన్యకృషికి ఫలితం 7 వ తరగతివారి మాదిరి టౌన్ పిల్లలలో ఎక్కువమంది అపజయము, పల్లెలవారు ఎక్కువమంది జయమొందుట (కారణంపైన 7 వ తరగతివారికి వున్నవి. పైగా కొన్ని పెచ్చు వివరాలు క్రింద వున్నవి తు. చ. తప్పకుండా ఉన్న వి) భూషణ, దూషణలు, ఉద్యోగ ఉద్వాసన, మార్పులపాలు ఉపాధ్యాయులు భరించక తప్పకపోవుట కలుగుచున్నవి,

3. 6 వ తరగతిలో ప్రవేటుగా చేరు విద్యార్థులకు ఇంగ్లీషులో 30% రావలెనని డైరెక్టరు ఫర్మానా. ఇది మరీ విచిత్రంగా ఉన్నది. కారణం ఇంతవరకు ఇంగ్లీషు ప్రవేటు వారికి తప్పనిసరి అని లేదు. గత సంవత్సరంలో నామమాత్రంగా కొన్నిచోట్ల జరిగినది. విద్యాబోధన పూర్తి (ఇంగ్లీషుకు ప్రాధాన్యత ఇవ్వక) అయి. ఇక కేవలం కొద్ది గంటల కాలంలో ప్రవేశ పరీక్షలు జరుగబోవు తరుణంలో ఈ పిడుగులాంటి ఫర్మానా పెట్టుటవలన, అర్థికంగా. ప్రత్యేకంగా, జీవనభృతి గడువ ఈ గడ్డురోజులలో చేతకాని, తల్లిదండ్రులు పరిషత్ సమితుల పాలనలో ఉపాధ్యాయులు, బడులు నడ్పు విధానముచూచి విసిగినవారు భారమైన జీతాలు ఇచ్చి ప్రవేటు చెప్పించుచున్న ప్రజల వలన ఆ విద్య గరపిన టీచర్లకు కలుగబోవు శిక్షలు వర్ణనాతీతము.

ఈ పైన పేర్కొన్న ప్రమాదాలకు కారణములు.

(i) పై ప్రభుత్వ (పిచ్చి ఫర్మానాల)వల్ల ఫలితం రావలెనని తలచిన, విద్యా సంవత్సర ప్రారంభములో జూన్‌నెలలో రాకపోవుట.

(ii) మాటలురాని, వచ్చినను భయపడి చెప్పలేకపోయిన పిల్లలు కడుపునొప్పితో బాధపడుచూ విలపించుచుండగా, వారిబాధ గమనించ జ్ఞానములేని తల్లిదండ్రులు విసుగు చెంది ఆ పిల్లలను పైగా కొట్టిన చందముగా విద్యాస్థాయి పెంపుదలకు విద్యాబోధన చేయుటకు లేని కారణములను పరిశీలింపక, వాటిని నివారింపక, పై ఫర్మానాలు జారీచేసి, ఉపాధ్యాయ లోకానికి, వున్నవి కాక ఇంకా కొత్తవి కల్పించి విసిగించి, చిక్కులు కల్పించి, ఇప్పుడు చేయు విద్యాబోధన ఆచరించక, ఎటులైనా ఇక్కట్లు తప్పుటలేదు. పెరుగుచున్న పని అభిప్రాయాలు తప్పనిసరిగా ఏర్పడు పరిస్థితి కలిగినది. ఉపాధ్యాయ లోకానికి ఏర్పడిన ఘాతక పరిస్థితులు బ్రతుకలేనివారు బడి పంతులు అని నీచభావముండగా, విద్యా పాలన మార్పులవల్ల.

1. 1 వ తేదీనాడు గౌరెకోకలాంటి జీతాలు టీచర్లకు ముట్టుచున్నవా?

2. నెల తరబడి అలాటుమెంట్లు రాక జీతాలు రాక రూ 100 కి రు 10-00 వంతు (రూ 10 లకు రూ 1 వంతు) వడ్డీ చెల్లించి అప్పులపాలు కాకుండా తప్పుతున్నదా?

3. కరువు పిశాచి తాండవ మాడు ఈ రోజులలో చౌక డిపోలలో ఇస్తున్నట్టి పదార్థములైనా గ్రామాల టీచర్లకు- ముట్టుచున్నదా? కనీసం బియ్యం, చక్కెర, వ్యాధులకు సహాయమునైనా పొందుటకు పల్లె టీచరుకు భాగ్యము లేదేమో?

4. ఎంతమంది పిల్లలు తృప్తిగ భోజనం చేసి నిశ్చింతగా నిర్మలమనస్సుతో విద్య నేర్చుకొనుటకు బడికి వచ్చుచున్నారు. ఆవిధముగా పిల్లలనుపంపు ఆర్థికతాహతుగల తల్లి దండ్రులు పల్లెలలో వున్నారు?

5. అర్ధాకలి, అస్థిమిత మనస్సులతో వచ్చు పిల్లలకు హాజరై ఆ రకంగా వున్న టీచర్లు బోధించు విద్య ఏమి: విద్యాస్థాయి పెరుగునదేమి: వచ్చిన పిల్లలలో పనులమీద వెళ్ళకుండా ఎంతమంది బడి వదలకవరకు ఉంటున్నారు:

6. ఈ వస్తువు నాది అనే భావన వుంటే గాని అది మెరుగు పడదుకదా? ఆ భావన పాఠశాలపై టీచరుకు కలిగాలంటే. ఈ పాఠశాలలో కొంతకాలముంటాను, నా విద్యా కృషిని గురించి. అధికారులకు ప్రజలకు జవాబు చెప్పుకోవలసి వున్నది అని తలచి పనిచేయుటకు ఎంతమంది టీచర్లకు వున్నది, ఏ నిముషమునకు ఏ మహాశయునకు (స్కూలు సంబంధం కాకుండా) ఆగ్రహము కలిగి, ఈ పిట్ట ఏ గూటిలో వాలవలసి వచ్చునోనన్న భయానికి లోనుగాకుండా అక్రమ బదిలీలు, అకారణంగా ఆకాలంలోకావని టీచర్లకు ఎవరైనా అభయమిచ్చి రక్షింపగలరా? మంత్రుల ఉత్తర్వులే సమితులలో ఉక్కి అయినవని చెప్పుట సాహసముతో కూడినదని, అసత్యమని అనలేదుకదా?

7. ఉపాధ్యాయులను సమితులనుండి, చట్టములువున్నప్పటికి. కావలసిన అన్ని విధాల సౌకర్యములురాక. అగాధములో పడి బయట రాకుండా వున్న వాటిని రాబట్టుటకు, విద్యాస్థాయి పోయినది. టీచర్లే కారకులు అనువారు సహాయపడరేమి: కాన ఈలాటి ఇబ్బందులు అనేకములు టీచర్లకు కలవు. అవి తొలగాలంటే, విద్యాస్థాయి పెరగాలంటె ఈ క్రిందివి నెరవేర్చుటకు ప్రయత్నించి, సాధించి తీరాలి." అన్యథా శరణంనాస్తి నిష్ప్రయోజనం.

1. సమితులు. జిల్లా పరిషత్తుల నుండి విద్యాశాఖను తొలగించి విద్యాబోధనకు (టీచర్లు, అధికారులు, ప్రజలుసమానసంఖ్య) తక్షణం పాఠశాలలను అప్పగించాలి.

అంతవరకు అక్రమ బదిలీలు, అక్రమ చర్యలు అక్రమ ఉత్తర్వులు అములుజరుగకుండా అన్నిటిపై మారటోరియం ప్రకటించి వెంటనే నిలపాలి.

3. ఉపాధ్యాయ హక్కులు, వ్యక్తిధర్మములు. అన్యాయములను ప్రజలకు, ప్రభుత్వానికి విన్నవించుకొనుటకువున్న ఒకే ఒక సాధనమైన రాజ్యాంగరీత్యా, అనుభవములైన కీర్తిశేషులైన నాయకులు అవసరమని గుర్తించిన యిప్పటి నాయకులు రద్దు చేయ ప్రయత్నించు ఉపాధ్యాయ నియోజకవర్గములను, ఎల్లకాలముండునట్లు చూడాలి.

4. విద్యాస్థాయి, క్రమశిక్షణ పిల్లలలో పెంపుదలకొరకు కృషిచేయు వసతి అలవరచుకొను అవకాశము, టీచర్లకు, పిల్లలకు కలిగించుటలో తగిన వసతులు ఏర్పరచుట ప్రజారాజ్యపాలన సోషలిస్టు నిర్మాణాశయము కలిగిన ప్రభుత్వ కనీసధర్మం. ఆ ధర్మమును ప్రభుత్వం పాటించి, అములు పరచునట్లు చేయుట ప్రజల, ప్రజానాయకుల ముఖ్యకర్తవ్యం.

---

# సోషలిస్టు వ్యవస్థ: యువజన సంఘాల కృషి

పుదుచ్చేరిలో అఖిల భారత యువజన మహాసభ 'సోషలిజం' తనప్రధానధ్యేయంగా ప్రకటించుటతో నేటి యువతరంపై ఒక పెద్ద బాధ్యత పడింది. 'సోషలిజం' అంటే సరైన నిర్వచనం యావత్తు ప్రజానీకానికి వివరించాల్సిన బాధ్యత యువకులమీద ఉంది. మహాసభ తీర్మానాలు. మహాసభలో తలపెట్టిన కార్యక్రమాలు ఇప్పటికపుడే భారతదేశంలో నున్న యువకులందరికీఅందజేయబడినాయి,

సోషలిస్టు వ్యవస్థలో ప్రభుత్వం ఎలాంటి బాధ్యతలను స్వీకరించవలసియుంటుందో, చెప్పవలసి వుంటుంది. 1955 లో భారతదేశం కూడా సోషలిస్టు వ్యవస్థే తనధ్యేయంగా ప్రకటించింది. ఐతే భారతదేశంలో నిర్మింపబడుచున్న సోషలిస్టు వ్యవస్థ యొక్క స్వరూపం ఎలాంటిదో ముందుగా అర్థం చేసుకోవాలి. అంతకన్నా ముందు సోషలిజం స్థాపనకు మార్గాలేమిటనేది ఆలోచించాలి,

దేశంలోనున్నపరిశ్రమలన్నిటినీప్రభుత్వాధీనంలో నిర్వహించుట. విదేశీ పెట్టుబడుల ద్వారా జరిగే దోపిడీని అరికట్టుటద్వారా సోషలిస్టు వ్యవస్థ నిర్మింపబడుతుంది.దీనితోపాటు దేశంలోనున్న సహజసంపదలను సరియైన మార్గంలో వినియోగించి దేశాన్ని స్వయం పోషకంగా తయారు జేసుకొన్న యెడల సమాజాన్ని బలమైన పునాదిపై నిర్మింపవచ్చును. అపుడే ప్రభుత్వంసమాజవ్యవస్థలో తలపెట్టిన మార్పు, సుస్థిరంగా ఉంటుంది.

### ప్రభుత్వాధీనంలోపరిశ్రమలు

ప్రభుత్వ రంగంలోని పరిశ్రమలు సోషలిస్టు వ్యవస్థలో వెన్నుముక లాంటివి. మూడవ ప్రణాళికాంతానికి ప్రభుత్వ రంగంలో పెట్టుబడులు 2400 కోట్లుమాత్రమే. ప్రభుత్వరంగం. దేశీయ ప్రైవేట్ రంగం కలిసి 6,000 కోట్ల పెట్టుబడియుండగా ఒక్క అమెరికా దేశానికి మనమివ్వవలసిన అప్పు 1750 కోట్లు. ఇంతేగాక విదేశీ ప్రైవేటు పెట్టుబడులు 800 కోట్ల రూపాయలున్నాయి. ఈ డబ్బంతా ఏమౌతోంది? ఇది సామాన్య మానవుని జీవన ప్రమాణాన్ని పెంచుటకు గానీ, జాతీయాదాయాన్ని పెంచుటకుగానీ ఉపయోగపడుతోందా? గత 15 సంవత్సరాలలో జాతీయాదాయం 3½% మాత్రమే పెరిగింది.

న్యూట్రిషన్ ఎడ్వైజరీ కమిటీ రిపోర్టు ప్రకారం ఒక్కొక్క వ్యక్తికి కేవలం అహారం కొరకు నెలకు 30 రూపాయ లవసరమైతే నూటికి 80 మంది ఆ మాత్రం ఆదాయానికి నోచుకో లేదు. ప్రపంచంలోని కడు బీద దేశాల్లో భారతదేశం ఒకటి. దీనికి తోడు 1947-1963 మధ్య ధరలు 100 శాతం పెరిగాయి, 1964 సంవత్సరంలో సెప్టెంబరులో దోప ధరలు 1952-53 లో కంటె 60 శాతం పెరిగాయి. వ్యవసాయ కార్మికుల పారిశ్రామిక కార్మికుల వేతనాలు 1950 కన్నా తరువాత సంవత్సరాలలో బాగా పడిపోయాయి.

### శ్రమ ఒకరిది - లాభం ఇంకొకరిది

మన దేశంలో నున్న 10 కోట్ల మంది హరిజనులు. గిరిజనులు అభివృద్ధి చెందుటకు ప్రభుత్వం నేమి పనీ చేయలేక పోయింది. వారి విద్యాభివృద్ధికి, మానసికాభి వృద్ధికి, ప్రభుత్వం ఎట్టిచర్యా తీసుకోకపోగా గృహనిర్మాణవసతుల ఏర్పాటుకుగాను కేటాయించిన మొత్తాలను సరిగా వినియోగింపలేని దుస్థితిలో నేటి ప్రభుత్వం ఉంది. దేశపునర్నిర్మాణంలోనూ, పారిశ్రామికీకరణలోనూ శ్రమించేది కోట్లకొలది సామాన్యజీవులు. దీని ఫలితాన్ని పొందేది సమాజంలోనున్న కొద్ది మంది ధనవంతులు, బట్టలపరిశ్రమ, జనపనార పరిశ్రమ, ఇనుము ఉక్కు మొదలైన ప్రైవేటు పరిశ్రమలలో 1963-64 లో వచ్చిన నికరలాభాలు 9,796.7 లక్షల రూపాయలు. ఇవిగాక వ్యక్తులఅధీనంలోనున్న బ్యాంకులూ తదితర పరిశ్రమలలో లాభాలు (1963) 3956 లక్షల రూపాయలు.

దేశంలోని ధనికవర్గపు లాభాలు ఈ విధముగా దినదినాభివృద్ధి చెందుతూ ఉండగా సామాన్యమానవుని జీవనప్రమాణము నానాటికి క్షీణిస్తోంది. కార్మికుల వేతనాలు తగ్గిపోతున్నాయి, ప్రభుత్వము అప్పుల పాలవుతుంది. ధనిక వర్గాన్నుండి రావల్సిన రాబడి పన్ను ప్రభుత్వం రాబట్టలేక పోతోంది. సదాచార సమితి లెక్కల ప్రకారం లెక్కలకు తేలిన దొంగ డబ్బు మూడు వేల కోట్ల రూపాయలు. టాటా, బిర్లాలు అమెరికా ప్రభుత్వంనుండి తీసుకొనే అప్పులు. వారు పెంపొందించుకొనే పరిశ్రమలు పరిమితి లేనివిగా ఉన్నాయి. మన అర్థిక విధానాన్ని చేతికందనీ దిక్చక్రములా ఆవరించి మొత్తం వాతావరణాన్ని కలుషితం జేస్తున్నాయి. ప్రైవేటు పారిశ్రామికదారుల లాభాలనూ. విదేశీ పెట్టుబడిదారుల లాభాలనూ. ప్రభుత్వము రాబట్టుకోగల్గితే మన దేశాన్ని స్వయం పోషకంగా తయారు చేసుకోవచ్చు. సోషలిజంవైపుకు త్వరగా పయనించవచ్చు. వీరి లాభాలన్నీ ఒక్క సంవత్సరం అరికట్టిన యెడల భారీప్రాజెక్టులను (నాగార్జునసాగర్‌లాంటివి) నాల్గింటిని నిర్మింపవచ్చు. ప్రభుత్వం దీనికి తయారుగా లేదు. ప్రభుత్వమే గుత్తపెట్టుబడిదారీవర్గం చేతులలో ఉన్నపుడు ఇది అసాధ్యమైన పని.

**శ్రీ పొట్లూరి నాగేశ్వరరావు**

దేశంలోనున్న విదేశీ పరిశ్రమలను జాతీయంచేయాలని, ప్రైవేటు రంగములో నున్న పరిశ్రమల సంఖ్యను పరిమితంచేసి ప్రభుత్వ రంగములో పరిశ్రమలను ఎక్కువ సంఖ్యలో స్థాపించవలెనని దేశంలో నున్న యువతరం పెద్దయెత్తున ఆందోళన చేయాలి. దేశస్వాతంత్ర్యంకొరకు ఏవిధంగా యువకులు ముందంజవేసి ప్రాణాల్నిసైతం త్యాగంచేశారో, అదే విధంగా దేశపునర్నిర్మాణానికి సోషలిస్టు వ్యవస్థను స్థాపించుటకు తీవ్రమైన కృషి చేయాలి.

### యువజన సంఘాల కృషి

ఈ 'తీవ్రమైన కృషి' ఏవిధంగాచేయాలి? దీనికి మార్గాలేమిటి? రాష్ట్ర, జిల్లా, తాలూకా మహాసభలద్వారా, బహిరంగసభల ద్వారా మనం ఎంతవరకు సఫలీకృతులౌతున్నాము? పైన పేర్కొన్న పద్ధతులద్వారా మన యువజన సంఘాల సభ్యులకు మాత్రం మనం కర్తవ్యబోధను చేయగల్గు చున్నాము. దీనితోనే యువజన సంఘాల పనిపూర్తిగాదు, కార్మికులు, సామాన్యమానవులు, మధ్యతరగతి వారందరికీ సోషలిస్టు వ్యవస్థయొక్కనిజమైన స్వరూపాన్ని తెలియజేయాలి. భారతదేశంలో అనుసరిస్తున్న మేడిపండుసోషలిజం యొక్క స్వభావాన్ని గ్రామాల్లోనున్నప్రతిసామాన్యుని వద్దకువెళ్ళి వివరించి చెప్పాల్సి ఉంది. ఈ కార్యక్రమాన్ని జయప్రదము గావించుటకు క్రొత్తమార్గాలను అన్వేషించాలి.

సోషలిస్టు వ్యవస్థయొక్క విశిష్టత, ప్రస్తుత భారత దేశ ప్రజల జీవన స్థితిగతులను వివరించే నాటక ప్రదర్శనల ద్వారా ప్రచారం చేసిన యెడల సామాన్య మానవులందరికీ యువజన సంఘాల సందేశం అందుతుంది. సభ బహిరంగసభల ద్వారా, మహాసభల ద్వారా జరిగిన కృషికన్నా గ్రామంలో ఒక్క నాటక ప్రదర్శన ప్రభావం ఎక్కువగా యుంటుంది. దీనిని పరిశీలించి చూడవచ్చు.

రెండవ ప్రపంచ యుద్ధానికి కారకుడైన హిట్లర్ అవలంబించిన ఘోర ఫాసిస్టు విధానాలు 1945 కే ఆంధ్రదేశంలోని ప్రతి తెలుసు. "మాస్కో పొలిమేరలదాకానైనా నా మారణాయుధాలు నింపి" అనేపాట యిప్పటికీ వినపడుతోంది. ఇదంతా వైజ్ఞానిక ప్రదర్శ ప్రభావమే.

భారతదేశమునోనున్న ప్రస్తుత పరిస్థితులను అధారంగా చేసుకొని ఈనాటి రచయితలు కథలు, నాటకాలు, గేయాలు, బుర్రకథలు వ్రాయాలి. వాటితో యువజన సంఘాల అధ్వర్యాన వైజ్ఞానిక దళాలు గ్రామ గ్రామానికి ప్రచారంచేయాలి.

### గాంధీజీ దృష్టిలో సోషలిజం : ఆచరణ

అన్ని పరిశ్రమలూ ప్రభుత్వ రంగానికి తరలింపబడితేనే సోషలిజంరాదు. పరిశ్రమలపై ప్రభుత్వాధిపత్యమేసోషలిజం స్థాపనను కానే కాంగ్రెసు సభ్యులు విమర్శలు మొదలిడారు. జాతిపిత మహాత్మా గాంధీ సోషలిజం గురించి వ్రాస్తూ ధనిక పేద తరతమ భేదాలు లేనట్టిదే సోషలిజమని వక్కాణించారు. ప్రభుత్వం అవలంబించే విధానాలు మహాత్మా గాంధీ అశించిన నవ భారతాన్ని సృష్టించగల్గుతున్నాయా అంటే అదీలేదు, దేశంలో పేదల శ్రమను దోచుకొనే వర్గమే బలపడుతోంది. తక్కువ మందితో ఎక్కువ పనిని సేకరించుట నేటి పారిశ్రామికుల విధానం, ఒక్కొక్క ప్రణాళికతోపాటు నిరుద్యోగం కూడా పెరుగుతోంది,

దేశంలోనున్న యువజన సంఘాలు సోషలిజం స్థాపనకు కృషిచేయాలి. నిజమైన సోషలిజం ఏమిటో ప్రజలకు చాటి చెప్పాలి. ప్రభుత్వ విధానాలలోనున్న లొసుగులను, సోషలిజం నిర్మాణానికున్నఅడ్డంకులను ఎత్తి చూపాలి. విస్తృతమైన కార్యక్రమాలద్వారా సోషలిస్టు వ్యవస్థనిర్మాణానికి దేశప్రజలందరినీ సమీకరించాలి. అప్పుడే భారత ప్రజల సుఖసౌఖ్యాలకు భోగభాగ్యాలకు నిలయమైన సోషలిస్టు వ్యవస్థ నిర్మింపబడుతుంది.

---

## ఆచంట జోన్. యు. డి. ఉద్యోగుల సమావేశం

మార్టేరు, మే 8

అఖిలభారత తపాలా ఉద్యోగుల సంఘం, ఆచంట ప్రాంతీయ సమావేశం నేడు మార్టేరులో, శ్రీ గాజుల సుబ్బారావుగారి అధ్యక్షతను జరిగింది, సమావేశంలో ఆంధ్రా సర్కిల్ అసిస్టెంటు కార్యదర్శి, శ్రీ యస్. పీరుపాషా బ్రాంచి అర్గనైజింగు శక్రటరీ, శ్రీ సి. హెచ్. కృష్ణమూర్తిగార్లు తంతితపాలా శాఖలలో ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలపై మాట్లాడినారు.

అనంతరం అధ్యక్షులు శ్రీ సుబ్బారావు మాట్లాడుతూ, నిజాయితీగా మీరంతా పని చేసి మీ సంఘాన్ని బలపర్చుకొన్న రోజున మీ కనీస కోర్కెల కోసం సత్యాగ్రహం చేయటానికి సిద్ధంగా యున్నానని తెలిపారు. అనంతరం స్థానిక కార్యకర్తలు బ్రాంచి యూనియన్‌కి రు 25 లు చందా నిమిత్తం. శ్రీ పీరు పాషాగారికి సమర్పించినారు.

అనంతరం. తేనేటివిందు. యు. డి. ఉద్యోగులకు సంబంధించిన అనేక తీర్మానాల ఆమోదం జరిగింది.

---

## రాష్ట్ర రాజకీయ పాఠశాలకు రు. 2 వేలు వసూలు

### ఏర్పాట్లు చురుకుగా జరుగుతున్నట్లు ప్రకటన

నరసరావుపేట, మే 12

యువకులలో రాజకీయ చైతన్యమును, శాస్త్రీయ సోషలిజాన్ని గురించిన పరిజ్ఞానమును పెంపొందించుటకు ఆంధ్రప్రదేశ్ యువజన సమాఖ్య అధ్వర్యమున విస్తృత రూపంలో దాదాపు 150 మంది విద్యార్థులకు 10 రోజులు యిక్కడ రాజకీయ పాఠశాల జరుపుటకు నిశ్చయింపబడినది.

తాత్త్వికశాస్త్రము, రాజకీయ శాస్త్రము, సాంఘిక శాస్త్రము. సోషలిజం మొదలయిన విషయములమీద పాఠములు జరుగుతాయి.

శ్రీ కంభంపాటి సత్యనారాయణగారు పాఠశాలకు ప్రిన్సిపాలుగా ఉంటారు. ప్రఖ్యాత అర్థిక శాస్త్రవేత్త డాక్టరు గంగాధర అధికారి మే 27వతేదీన పాఠశాలను ప్రారంభిస్తారు.

అధ్యాపకులుగా శ్రీయుతులు అధికారి, సిలం రాజశేఖరరెడ్డి, ఏటుకూరు బలరామమూర్తి, మోహిత్‌సేన్, గుజ్జుల యల్లమందా రెడ్డి, దాసరి, వేములపల్లి శ్రీకృష్ణ, వై. విజయకుమార్‌గార్లు పనిచేస్తారు. పాఠశాల నిర్వహించుటకు విరివిగా విరాళములనిచ్చి తోడ్పడవలసిందిగా ఆహ్వాన సంఘంవారు విజ్ఞప్తి చేస్తున్నారు.

చిలకలూరిపేట గ్రామములో రు 11 వందలు నర్సారావుపేటలో రు. 8 వందలు యింతవరకు పాఠశాలకుగాను అహ్వాన సంఘమువారు విరాళాలు వసూలుచేశారు. ఇంకా ఒక వెయ్యి రూపాయలను కూడా వసూలు చేయుటకు కృషిచేస్తున్నారు.

కృష్ణాజిల్లానుంచి యిప్పటికే 25 మంది. అనంతపురంజిల్లా నుండి 20మందివస్తున్నట్లు అహ్వాన సంఘమువారికి తెలియజేశారు గుంటూరు జిల్లా నుంచి కూడా 50 మందికి పైగా పాఠశాలకు హాజరు కానున్నట్లు తెలుస్తున్నది, తక్కిన జిల్లాలవారు మేనెల 20 లోపుగా ఎంతమంది తమ తమ జిల్లాల నుంచి వచ్చునది అహ్వాన సంఘమువారికి తెలియజేయవలయును.

---

## పటిష్ఠవంతమైన వ్యవసాయ కార్మికోద్యమం నిర్మించాలని గుడివాడ తాలూకా కమ్యూనిస్టు సమితి తీర్మానం

గుడివాడ. మే 8

కృష్ణాజిల్లా గుడివాడతాలూకా కమ్యూనిస్టు సమితి సమావేశం, గుడివాడలో పార్టీ కార్యాలయంలో శ్రీ కానూరి వెంకటరంగదాసు అధ్యక్షతను నేడు జరిగింది. వివిధ గ్రామాల నుండి వచ్చిన సభ్యులు, అభ్యర్థితులు, తమగ్రామాలలోనిపరిస్థితులపైన, సమస్యలపై మాట్లాడారు. మొదట జిల్లా కమ్యూనిస్టు సమితి సెక్రటరియేట్ సభ్యులు శ్రీ అట్లూరి సీతారామయ్య రాజకీయ రిపోర్టు యిచ్చారు. పార్టీనిధివసూళ్ళ కార్యక్రమంపై రిపోర్టుచేస్తూ సభ్యులు తమ తమ అనుభవాలు, గుణపాఠాలు తెలియజేశారు. పార్టీ నిర్మాణం, గ్రామ శాఖల ఫంక్షనింగ్, పార్టీ సభ్యత్వ పునరుద్ధరణను గురించి వివరంగా చర్చించి కార్యక్రమం తీసుకోవటమైంది.

తాలూకా పీడితప్రజల ఏకైక ప్రజాసంస్థ అయిన "తాలూకా వ్యవసాయ కార్మిక సంఘాన్ని" పటిష్టవంతంగా నిర్మించాలని జిల్లా వ్యవసాయ కార్మిక మహాసభకు ప్రతినిధులను, ప్రేక్షకులను, విరివిగా సమీకరించాలని, గ్రామ స్థాయిలో కార్మికసంఘాల నిర్మాణాన్ని దృఢతర మొనర్చాలని తీర్మానాలు చేయబడినాయి.

రాబోవు కాలంలో (1) పెద్ద పాలేరుకు 30 బస్తాల జీతంయివ్వాలి. (2) పురుషునకు రు. 2-50 రోజుకూలి, స్త్రీకి రోజుకూలి రు. 2-00 యివ్వాలి. జూన్ ఒకటవ తేదీని వీరాపౌర్ణిమగా గుర్తించాలనే వ్యవసాయ కార్మికుల కోర్కెలపై, నిరంతరాందోళనచేసి, కార్మిక పోరాటాలను నడుపుటకు ముందుకు రావలసినదిగా గ్రామశాఖలను, పార్టీ సభ్యులను ఆదేశిస్తూ సమితి తీర్మానించింది.

పై కోర్కెల సాధనకు దశ ప్రచారం సాగించాలని కూడా కార్యక్రమం వేసుకున్నారు.

---

## ఎరువుల పరిశ్రమ ఒప్పందంపై ఎ. ఐ. సి. సి. లో చర్చ

న్యూఢిల్లీ, మే 12

ఎరువుల పరిశ్రమల స్థాపన విషయంలో విదేశీ ప్రయివేటు పెట్టుబడిదార్లకు ఎనలేని సౌకర్యాలు కల్గించే ప్రభుత్వ విధానాన్ని నిరసిస్తూ ఒక తీర్మానాన్ని వచ్చే ఎ. ఐ. సి. సి. సమావేశంలో కొందరు ప్రతిపాదించవచ్చునని తెలుస్తోంది.

ధరలు నిర్ణయించటం, మార్కెటింగ్, విషయాలలో విదేశీయులకు పూర్తి స్వేచ్ఛనివ్వటం, విదేశీ ప్రయివేటు పెట్టుబడిదార్లకు ఈ పరిశ్రమల్లో మెజారిటీవాటాలు యివ్వటం అంగీకృతవిధానాలకు విరుద్ధమనిపేర్కొంటూ యస్. యస్. మిశ్రా ఒక అనధికార తీర్మానానికి నోటీసు యిచ్చినట్లు తెలుస్తున్నది.

కేంద్ర ఎన్నికల కమిటీలో మూడింట ఒకవంతు కార్యవర్గ సభ్యులు కాని, ఎ. ఐ. సి. సి. సభ్యులు వుండాలని మరోతీర్మానానికి కొందరు నోటీస్ యిచ్చారు.

దేశ ఆర్థికాభివృద్ధి ధోరణిని ఎప్పటికప్పుడు పరిశీలించి ఎ. ఐ. సి. సి. కి, నివేదించడానికి ప్రత్యేక ఉపసంఘాన్ని నియమించాలని కాంగ్రెసు అధ్యక్షుని కోరుతూ మరో తీర్మానానికి నోటీస్ వచ్చింది.

రానున్న జనరల్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థుల నియామక విషయంలో అనుసరింపవలసిన నిబంధనలను రూపొందించడానికి ప్రత్యేక ఉపసంఘాన్ని నియమించాలని మరో తీర్మానంలో కోరారు.

---

## వ్యవసాయక ఆర్థిక పునస్సహాయ మండలి

హైద్రాబాద్, మే 11

ఆంధ్రప్రదేశ్, మద్రాస్, ఒరిస్సా, మధ్యప్రదేశ్, మహారాష్ట్రల్లో భూసముద్ధరణ కార్యక్రమాలకుగాను, కేంద్ర భూతనఖా బ్యాంకుకు 1088.77 లక్షల రూపాయల ఋణంగా ఇవ్వటానికి భారత వ్యవసాయక ఆర్థిక పునఃసహాయమండలి అంగీకరించింది. మండలికార్యదర్శి శ్రీ టి. యస్. కె. చారి, వెల్లడిస్తూ, ఈ ఋణ సహాయ పథకాన్ననుసరించి సహాయాన్ని పొందటానికి ఆంధ్ర, మద్రాసు రాష్ట్రాలు మాత్రమే ముందుకు వచ్చాయని. ఆంధ్ర 1042.69 లక్షల రూపాయల్ని, మద్రాసు 810 లక్షల రూపాయల్ని ఇంతవరకు వినియోగించుకున్నాయని తెలిపారు. ఆంధ్ర, మద్రాసు రాష్ట్రాలు తాము తీసుకున్న ఋణాల్ని వ్యవసాయాభివృద్ధికిగాను రూపొందించిన వివిధ పథకాలకు వినియోగించాయి. అయితే ఒరిస్సా కేవలం కొబ్బరితోటల అభివృద్ధికి, మధ్యప్రదేశ్ ఉద్యానాలను అభివృద్ధి పరచటానికి ఋణసహాయాన్ని పూర్తిగా వినియోగించుకున్నాయి. యంత్రాల సహాయంతో సాగుచేయటానికి, విద్యుచ్ఛక్తిని ఉపయోగించి నీటి పారుదల సౌకర్యాలు కల్గించుకోటానికి, పశుగణాభివృద్ధికి. క్షీరపరిశ్రమాభివృద్ధికి, మత్స్యపరిశ్రమాభివృద్ధికి, కోళ్ళ పెంపకానికి గూడా సహాయం చేయటానికి మండలి సిద్ధంగా ఉందని శ్రీ చారి వెల్లడించారు.

జూలై 1963 లో పార్లమెంట్ ఆమోదించిన తీర్మానాన్ని ననుసరించి వ్యవసాయ ఆర్థిక పునస్సహాయక మండలి ఉద్భవించింది. వ్యవసాయాభివృద్ధికిగాను దీర్ఘకాల ఋణాల్ని సామాన్యకాల ఋణాల్నిమంజూరు చేయుటమే దీనిలక్ష్యం. పొలాల్ని చదును చేయటం, గట్టువేయటం, నీటి పారుదలకు గాను కాలువలు త్రవ్వడం ఇత్యాది కార్యక్రమాలన్నీ భూమి సముద్ధరణప్రణాళికక్రింద పరిగణింపబడతాయి. ఈ సముద్ధరణకయ్యే వ్యయాన్ని సాంకేతిక సిబ్బందివారు నిర్ణయించుతారు. ఇవ్వవలసిన కనీస, గరిష్ఠ ఋణాల్ని బ్యాంకు నిర్ణయించుతుంది.

---

## ఖమ్మం మెడికల్ ఎంప్లాయీస్ యూనియన్ కార్యవర్గం

ఖమ్మం, మే 12

అంధ్రప్రదేశ్ మెడికల్ ఎంప్లాయీస్ యూనియన్ ఖమ్మం బ్రాంచి సర్వసభ్య సమావేశం ఈ నెల 8 వ తేదీన శ్రీ గంగాధర్మారావు అధ్యక్షతన జరిగింది. హైద్రాబాదు బ్రాంచి కార్యదర్శి శ్రీ జి. రామచందర్ గారిఅధ్వర్యాన 1966-67 సంవత్సరమునకు నూతన కార్యవర్గం ఎన్నికైంది. అధ్యక్షులు శ్రీయస్.మహబూబు సాహెబు,ఉపాధ్యక్షులు శ్రీయుతులు గంగాధరరావు, అబ్దుల్‌ఖయూం. శ్రీమతి ప్రేమకౌర్, కార్యదర్శి శ్రీ ఆర్. మోహనరావు. సహాయ కార్యదర్శులు శ్రీయుతులు భగవాన్ దాసు, మల్లయ్య మహమ్మదుగౌస్, డి. కె. చంద్రయ్య. కోశాధిపతి శ్రీ కె. పిచ్చయ్య, 15 మంది వర్కింగు కమిటీ సభ్యులు ఎన్నుకోబడ్డారు.

---



## లేఖలు

### పాలసరఫరా కేంద్రాలు : తక్కువ కొలతలు

మహాశయా,

జంట నగరాలలో ప్రభుత్వం పాల సరఫరా కేంద్రాలను ఏర్పరచి ప్రజలకు కల్పించిన సౌకర్యము ప్రశంసనీయమైనది. కాని ఈ కేంద్రాల నిర్వాహకులు తరచుగా చేయుచున్న అపకతవకలవల్ల ప్రజలకు ఇబ్బందిగా ఉంటున్నది. ఈ కేంద్రములలో ముఖ్యంగా పాలు తక్కువగా కొలవడం పరిపాటిగా జరిగిపోవుచున్నది, అంతేకాక, చిల్లరడబ్బులు ఇవ్వకపోవడం, తమ అభిమానులకు 'క్యూ' పద్ధతిలోను, కోటా తగ్గింపడంలోను పాక్షిక వైఖరి అవలంబింపడం జరుగుచున్నది. విద్యానగర్ (పోస్టాఫీసుముందు) కేంద్రమును యిట్టి అవకతవకలకు కేంద్రముగా వుంటున్నది, కావున ప్రభుత్వంవారు యీ కేంద్రాలను అప్పుడప్పుడు పరిశీలించి యీ అవకతవకల నివారించుటకు మనవి చేయుచున్నాను.

ఇట్లు
జి. విశ్వేశ్వరరావు
విద్యానగర్. హైద్రాబాద్,

### సీతానగరం కాలనీ భూముల అక్రమ స్వాధీనం

మహాశయా,

సీతానగరం, కాలనీని బ్రిటిషు ప్రభుత్వ హయాంనుండిమాకు60సంవత్సరాలక్రితం ఎరుకుల కులస్థులైన మాకు యిచ్చారు. అడవిగావున్నటువంటి భూములను కష్టపడి అడవిని నరికి పంటభూములుగా తయారు చేసుకొని దానిపై ఆధారపడి ఇప్పటివరకు 70 కుటుంబములు జీవిస్తున్నాయి. సుమారు 13 సం॥ (క్రితం) అప్పటి పూర్ణాదేవి (రాజకీయ బాధితురాలు) అక్రమముగా 18 యకరములను హైస్కూల్ నిర్మించవలెనని ప్రభుత్వం వారి ద్వారా స్వాధీనము చేసుకొని 1965 వ సంవత్సరమువరకు కూడ హైస్కూల్ కట్టించలేక 18 ఎకరములను లీజుక్రింద ఉంచి ఆ సంవత్సరములోనే శ్రీ రామకృష్ణ సమితివారలకు స్వాధీనముచేసినారు, ఇప్పటి వరకు మాకు మాట పొలంచాలక ఆ 18 యకరాలను మాకు స్వాధీనం చేయుమని సోషల్‌వెల్‌ఫేర్ డిపార్టుమెంటుద్వారా కరస్పాండెన్సు చేస్తున్నాము.

1959 వ సంవత్సరంలో మా భూములను మాగాణి భూములుగ మార్చుకొనుటకు సోషల్‌వెల్‌ఫేర్ డిపార్టుమెంటువారు మాకు 8 వేల రూపాయలు ఖర్చుపెట్టి కె. డబ్ల్యు మెయిన్ కెనాల్‌క్రింద రెండు కరెంటు పంపు షెడ్లను కట్టించినారు, దాని ఆధారముతో సంవత్సరమునకు రెండుపంటలను పండించుకొని జీవించుచున్నాము.

ఈ సంవత్సరం మా భూములలో ప్లాట్ నెం. 171/1 ని 30 యకరములను (1) వి. పూర్ణచంద్రయ్య, (2) యం. రాజేశ్వరరావు కృష్ణాజిల్లా (3) పి.వి. గోపాలరావు గుంటూరు జిల్లా వారలకు మెమో నెంబరు 1272/వి; 1-66-1 క్రింద మనిషి 1 కి పది ఎకరముల చొప్పున 30 ఎకరములను పై వారలకు యిచ్చివేసినారు- అని ప్రభుత్వంవారు మా కాలనీ అఫీసరు ఆర్డర్లు మంజూరు చేసినారు. మేము చాల పేదవారము. మాకు జరిగినటువంటి ఈ అన్యాయమును అరికట్టి మాపొలాలు మాకే ఉండునట్లు చేయుమని ప్రభుత్వంవారికి విజ్ఞప్తి చేసుకొనుచున్నాము.

ఇట్లు,
కట్టా సుబ్బారావు, తాడేపల్లి,

---

## శ్రీ మల్లయ్యలింగం సోవియట్ పర్యటన

గుంటూరు, మే 12

అంతర్జాతీయ అహారం, పొగాకు, ద్రవాహారాలు, హోటళ్ళ, రెస్టారెంట్ల ట్రేడ్‌యూనియన్ నిర్వాహక సంఘ సమావేశం ఈ నెల 17 నుండి 19 వరకు మాస్కోలో జరుగుతుంది. భారతదేశంతరపున ఆసమావేశంలో పాల్గొనుటకు గుంటూరు పట్టణం నుండి శ్రీ కె. మల్లయ్యలింగం వెడుతున్నారు. ఆ సందర్భాన్ని పురస్కరించుకుని యీ నెల 9 న శ్రీ కనపర్తి నాగయ్య అధ్యక్షతన సన్మాన సభ ఏర్పాటు చెయ్యబడింది.

గుంటూరు పట్టణంలోని వివిధ కార్మిక సంఘాలతరపునప్రముఖులు శ్రీ మల్లయ్యలింగం విదేశ పర్యటన జయప్రదంకావాలని సందేశాలు యిచ్చారు. పలువురు పుర ప్రముఖులు కూడా ప్రసంగించారు. (వి. వి.)

## వ్యవసాయ వస్తువులధరలు

విజయవాడ, మే 13

విజయవాడ రీజినల్ అసిస్టెంటు మార్కెటింగ్ డైరెక్టరు 12వ తేదీ నాడు అందజేసిన ఉత్పత్తిదారులనుండి కొనుగోలు చేయు టోకు ధరలు (ఒక క్వింటాల్ 100 కిలో గ్రాములు లేక 220½ పౌనులు)

**ధాన్యం**

| | | 75 కి. | 100 కి. |
|---|---|---|---|
| సంబస్లు : | విజయవాడ రు. | 35-25 | 47-00 |
| ,, | కాకినాడ | 35-25 | 47-00 |
| ,, | చిత్తూరు | — | — |
| అక్కుళ్ళు: | విజయవాడ | 29-25 | 39-00 |
| ,, | తాడేపల్లిగూడెం | 29-25 | 39-00 |
| ,, | కాకినాడ | 29-25 | 37-00 |
| ,, | అముదాల వలస | 29-25 | 39-00 |
| సన్న కృష్ణకాటుకలు : | | | |
| | తాడేపల్లిగూడెం | 32-25 | 43-00 |
| సన్నాలు : | అముదాలవలస | 32-25 | 43-00 |
| మొలకొలుకులు · | నెల్లూరు | 35-25 | 47-00 |

**మిల్లు బియ్యం**

| | | 100 కి |
|---|---|---|
| సంబస్లు : | విజయవాడ | 76-02 |
| ,, | కాకినాడ | 76-02 |
| అక్కుళ్ళు : | విజయవాడ | 63-45 |
| ,, | తాడేపల్లి గూడెం | 63-45 |
| ,, | కాకినాడ | 63-45 |
| ,, | అముదాల వలస | 63-45 |
| సన్న కృష్ణకాటుకలు : | | |
| | తాడేపల్లి గూడెం : | 69-73 |
| సంబస్లు : | చిత్తూరు | — |
| సన్నాలు : | అముదాలవలస | 69-73 |
| మొలకొలుకులు : | నెల్లూరు | 76-02 |

**వేరుశనగ**

| | | కొత్తవి | పాతవి |
|---|---|---|---|
| కాయలు | విజయవాడ | 147-82 | 134-78 |
| ,, | నంద్యాల | | 150-00 |
| ,, | ఆదోని | | 136-25 |
| ,, | విజయనగరం | | 146-66 |
| పప్పు | విజయవాడ | 202-50 | 210-00 |
| ,, | నంద్యాల | | 195-75 |
| ,, | ఆదోని | | 201-00 |
| ,, | విజయనగరం | | 217-33 |
| నూనె | విజయవాడ | | 451-40 |
| ,, | నంద్యాల | | 415-00 |
| ,, | ఆదోని | | 431-00 |
| ,, | విజయనగరం | | 448-88 |

**అపరాలు**

| | | పాతవి | కొత్తవి |
|---|---|---|---|
| కందులు : | విజయవాడ | | 77-00 |
| ,, | గుంటూరు | | 79-00 |
| ,, | అముదాలవలస | — | — |
| మినుములు : | విజయవాడ | | 82-50 |
| ,, | గుంటూరు | | 86-00 |
| ,, | అముదాలవలస | | 74-00 |
| పెసలు | విజయవాడ | 91-00 | 91-00 |
| ,, | గుంటూరు | | 98-00 |
| ,, | అముదాలవలస | | 94-00 |
| శనగలు : | విజయవాడ | | 120-00 |

**జొన్నలు**

| | | |
|---|---|---|
| అనంతపురం | తెల్లవి | 61-21 |
| నంద్యాల | పచ్చవి | 50-10 |

**బెల్లం**

| | | |
|---|---|---|
| హిందుపురం : | మొదటిరకం | 105-00 |
| ,, | మూడవరకం | 75-00 |
| చిత్తూరు | మొదటిరకం | — |
| ,, | మూడవరకం | 49-00 |

**జీడిపప్పు**

| | | |
|---|---|---|
| వేటపాలెం | అమెరికన్ రకం | 735-27 |
| ,, | దేశవాళి | 690-90 |
| ,, | బద్దలు | 637-00 |
| ,, | ముక్కలు | 555-42 |

**మిర్చి**

| | |
|---|---|
| జి. 2. ఒకటవ రకం గుంటూరు | 360-00 |
| జి. రెండు 2. వ రకం ,, | 350-00 |
| జి. 2. చర్ల రకం | 360-00 |

**నెయ్యి**

| | పల్నాడు | దేశవాళి |
|---|---|---|
| గుంటూరులో | 760-00 | 770-00 |

**కొబ్బరికాయలు**

| (వెయ్యింటికి ధరలు) | కొత్తవి : | పాతవి |
|---|---|---|
| విజయవాడ : | 265-00 | 315-00 |
| రాజమండ్రి : | 200-00 | 310-00 |
| పాలకొల్లు : | 233-00 | 310-00 |

**పసుపు**

| | | |
|---|---|---|
| దుగ్గిరాలలో : | కొమ్ములు | 106-70 |
| ,, | రాస్పాదు | 123-00 |
| ,, | దుంపలు | 91-80 |
| కడపలో : | కొమ్ములు | 110-00 |
| ,, | దుంపలు | 90-00 |

**జనపనార**

| | | |
|---|---|---|
| విజయనగరం : | మొదటిరకం | 112-53 |
| | రెండవరకం | 107-17 |
| | మూడవరకం | 101-81 |
| అముదాలవలసలో, | | |
| | మొదటిరకం | 112-00 |
| | రెండవరకం | 106-00 |
| | మూడవరకం | 103-00 |

# అశోక్ మెహతాపై హక్కుల తీర్మానానికి స్పీకర్ నిరాకరణ

## ప్రణాళికామంత్రి పార్లమెంటులో చేసే ప్రకటనను అమెరికా ఆమోదముద్ర కోరటం అనుచితమని సభ్యుల విమర్శ

న్యూఢిల్లీ, మే 12

ప్రణాళికాశాఖామంత్రి శ్రీ అశోక్ మెహతాపై శ్రీమతి రేణూచక్రవర్తి మరికొందరు సభ్యులు తెచ్చిన హక్కుల తీర్మానాన్ని లోక్‌సభ స్పీకర్ నేడు నిరాకరించారు.

ప్రణాళికామంత్రి తన అమెరికా, కెనడా పర్యటనం గురించి, పార్లమెంటులో ప్రకటన చేయటానికిముందు తన ప్రకటన ముసాయిదాను ప్రపంచబ్యాంక్ అధ్యక్షునికి అమెరికా అధికార్లకు చూపించి, వారి అనుమతికోరటం పార్లమెంటు హక్కులకు భంగకరమని సభ్యులు విమర్శించారు.

పార్లమెంటులో చేసే ప్రకటనకు వేరే ఒకరి అనుమతి పొందటం అనుచితమని హిరేన్‌ముఖర్జీ ప్రభృతులు అన్నారు.

సభ్యుల వాదనంతో తాను ఏకీభవించటం లేదని స్పీకర్ చెప్పారు.

సుమారు 20 నిముషాలసేపు ఈ విషయమై సభలో తీవ్ర వాగ్వివాదం జరిగింది.

అశోక్‌మెహతా చర్య పార్లమెంటుకు తలవంపులు తెచ్చేదిగా వుందని శ్రీమతి రేణూచక్రవర్తి అన్నారు.

సభ్యులు తనపై చేసిన విమర్శలను ప్రణాళికామంత్రి నిరాకరించారు.

"ప్రధానమంత్రి, అధికార పార్టీలోని మెజారిటీ సభ్యుల విశ్వాసాన్ని చూరగొనగల్గుతున్నారుగనుక నేనిక్కడ మంత్రిగా నిలబడగల్గుతున్నాను"అన్నారు. ప్రధాని విశ్వాసాన్ని పొందగల్గినంతకాలం ...... ఆ తర్వాత మాటలు గలభాలో వినిపించలేదు.

తాను పార్లమెంటుముందు చేయనున్న ప్రకటనకు ప్రపంచ బ్యాంక్ అధ్యక్షుని అనుమతికోసం ఎదురు చూస్తున్నట్లు కొన్ని వార్తా సంస్థలు ప్రకటించిన వార్త అసత్యమన్నారు.

ప్రధాన మంత్రికి, మంత్రివర్గ సహచరులకు తన చర్చల వివరాలు తెలిపిన తర్వాత పార్లమెంటుముందు చేయవలసిన ప్రకటన రూపొందించటానికి పూనుకోవటం జరిగిందని ఆయన చెప్పారు. వాషింగ్‌టన్ చర్చల గురించి 13 వ తేదీన ప్రకటన చేస్తానన్నారు.

మంత్రి ప్రకటన విషయమై పి. టి. ఐ. వార్తా సంస్థ అవాస్తవ వార్తను ప్రకటించింది. గనుక తాను ఆ వార్తా సంస్థపై హక్కుల తీర్మానం తెస్తానని శ్రీ కామత్ చెప్పారు.

# జాన్సన్ ఫౌండేషన్‌కు ఆర్థిక మంత్రి సమర్థన

న్యూఢిల్లీ, మే 12

ఆవరణ దృష్ట్యా, అలాగే ఆర్థికప్రయోజనాలదృష్ట్యాకూడా ఇండో అమెరికన్ ఫౌండేషన్ ఏర్పాటుమంచిదేననికేంద్రఆర్థికమంత్రి శ్రీ శచీన్‌చౌదరి ఈరోజు రాజ్యసభలో ఫైనాన్స్ బిల్లుపై చర్చకు జవాబు చెప్తూ అన్నారు.

పి. యల్. 480 క్రింద తమ చేతికివచ్చే డబ్బును అమెరికా గనుక మన దేశంలో ఇతరవిధాలఖర్చుపెడితే ధరలుపెరుగుతాయని ఫౌండేషన్ ఏర్పడితే ఆ డబ్బును విద్యాభివృద్ధికి వినియోగింపవచ్చునని అన్నారు.

దేశంలో ఆదాయాలు, వేతనాలు, ఉత్పత్తి విషయమై పరిశీలన అవసరమని ఆయన చెప్పారు. ఇందుకు వ్యవధి రావాలన్నారు.

దేశాభివృద్ధికి విదేశీ సాయంరావాలనికి ఇప్పటివరకు మనం సాగించిన అభివృద్ధి, కొంతవరకు మిత్రదేశాల సాయం కూడా తోడ్పడిందని అన్నాడు.

సాధ్యమయినంత తక్కువ సాయం తీసుకోవాలనేది మనధ్యేయంగా వుండన్నారు.

స్వయం సమృద్ధి సాధనా లక్ష్యానికి విరుద్ధంగా ప్రభుత్వం ఏమీ చేయటంలేదని అన్నారు.

అమెరికాతో కుదుర్చుకో దలుచుకొన్న ఎరువుల ఒప్పందాన్ని సమర్థించారు. ఈ ఒప్పందం మన సార్వభౌమాధికారానికి ఏ రకంగానూ భంగకరం లేదన్నారు.'

జనాభా పెరుగుదల నిరోధానికి గర్భస్రావాన్ని చట్టబద్ధంచేయటం తనకు అంగీకారం కాదన్నారు.

# మంత్రి భోజనం కోసం ఎక్స్‌ప్రెస్ రైలు నిలిపివేత

## రాజ్యసభలో పలువురి విమర్శ

న్యూ ఢిల్లీ, మే 12

ఒక రాష్ట్రమంత్రి భోజనం చేయటానికని బొంబాయి - పూనాదక్కన్ ఎక్స్‌ప్రెస్‌ను ఏప్రిల్ 9 వ తేదీన కళ్యాణ్ స్టేషన్‌లో 20 నిముషాలు పైగా నిలిపివేసినందుకు ఈ రోజు రాజ్యసభలో పలువురు సభ్యులు తీవ్ర అసమ్మతిని వ్యక్తం చేశారు.

రైల్వేశాఖ స్టేట్‌మంత్రి డాక్టర్ రామ్ సుభగ్‌సింగ్ సభ్యులకు జవాబు చెప్తూ, ఇకముందు యిటువంటి ఘటనలు జరుగకుండా చర్యలు తీసుకుంటామని అన్నారు.

---

మన దేశానికి యేటా 4 వేల ట్రాక్టర్ల అవసరం అని పరిశ్రమల మంత్రి లోక్ సభలో చెప్పారు.

# ఆంధ్ర రాష్ట్రంలో అగ్ని ప్రమాదాలు

విజయవాడ, మే 12

గత మూడురోజులనుండి ఆంధ్రప్రదేశ్‌లోని మూడుజిల్లాలలో వివిధ ప్రాంతాలలో జరిగిన అనేక అగ్నిప్రమాదాలలో కనీసం 40 మంది చనిపోయి వుంటారని తెలుస్తున్నది. ఒక్క విజయవాడలోనే 22 మంది చనిపోయారు. గుంటూరు, చిత్తూరు, పశ్చిమ గోదావరిజిల్లాలో చాలమంది చనిపోయారు. నష్టం ఎంత వుంటుందో లెక్కలు వేస్తున్నారని యిక్కడ పరిస్థితి పరిశీలించవచ్చిన రెవెన్యూ మంత్రి శ్రీ యన్ రామచంద్రారెడ్డి యిక్కడ పత్రికలవారితో ప్రసంగిస్తూ, అన్నారు. అగ్నిప్రమాదంలో నష్టపడిన యిండ్ల యజమానులకు ధనరూపేణా గ్రాంటులు యివ్వడానికి యేర్పాట్లుజరుగుతున్నాయని ఆయనఅన్నారు.

గత మంగళవారం గుంటూరుజిల్లా సంఘం జాగర్లమూడిలో జరిగిన అగ్నిప్రమాదంలో ముగ్గురు సజీవంగా కాలిపోయారు. పశ్చిమగోదావరి జిల్లా జంగంపేటలో ఒక బాలిక చనిపోయింది. చిత్తూరు జిల్లా కరవేటి నగర్ ఒక వృద్ధురాలు చనిపోయింది. మొత్తం 5 గురు చనిపోయారు.

## గుంటూరులో సహాయక కార్యక్రమాల

గుంటూరుజిల్లాలో అగ్నిబాధితులకు ఆహారం, బట్టలు యిచ్చేందుకు జిల్లాకలెక్టరు యేర్పాట్లు చేశారు. ఒకొక్క కుటుంబానికి 50 రూపాయలు మంజూరు చేసినట్లు యిక్కడ ప్రకటించబడింది.

# పెక్కు అగ్నిమాపక యంత్రాలురాక

(విశాలాంధ్ర విలేకరి)

విజయవాడ, మే 1

విజయవాడ అగ్నిప్రమాదాలను సత్వరంలో అదుపులో పెట్టాలంటే, అగ్నిమాపక యంత్రాలు అధికసంఖ్యలో ఉండటంఅవసరమనే అభిప్రాయంతో,వివిధ ప్రాంతాలనుండి అగ్నిమాపక యంత్రాలు విజయవాడకు రప్పించబడ్డాయి.

ఏలూరు, తెనాలి, బందరు, విశాఖపట్నం, హైద్రాబాద్, రాజమండ్రి, భీమవరం, మొదలైన ప్రాంతాలనుండి దాదాపు 15 అగ్నిమాపక యంత్రాలు రావించబడినట్లు తెలుస్తున్నది.

నేటి సాయంత్రం మాడలీనగర్‌లోనూ, దుర్గాఅగ్రహారంలోనూ అగ్నిప్రమాదాలు సంభవించగానే, అగ్నిమాపక దళాలు తక్షణమే ప్రమాద ప్రాంతానికివచ్చి మంటలను అదుపులోకి తీసికోనిరావటంతో ప్రజలలో ఆత్మవిశ్వాసం పెరిగింది.

అయినప్పటికీ పట్టణంలోని పలుచోట్ల ప్రజలు ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోననే, భయంతో సామానులు బజారుల్లో వేసుకొని మండుటెండల్లో కాలం గడిపారు.

ప్రమాదప్రాంతాలకు, ఇతర చోట్లకు మున్సిపల్ వాటర్ ట్యాంకులువెళ్ళి, ప్రజలకు మంచినీటిని సరఫరాచేస్తున్నాయి.

నిన్న, మొన్న కుళాయిలద్వారా మంచినీరు అందక నానాఇబ్బందులకు గురైన పట్టణ ప్రజానీకానికి ఒకటి రెండురోజులలో ఎట్టి ఇబ్బందిలేకుండా సక్రమంగా మంచినీటి సరఫరా చేయగలమని మున్సిపల్ అధికారులు హామీఇచ్చినట్లు తెలుస్తున్నది.

# అగ్నిబాధితులకు సహాయం

విజయవాడ మే 13

విజయవాడలో అగ్నిబాధితుల సహాయార్థం ఆంధ్ర ఫిలింఛాంబర్స్‌వారు రు. 500/లు, నవయుగ ఫిలింస్‌వారు 1,116/లు, విరాళంగా యిచ్చారు.

# ఒరిస్సాకు ప్రధాని రాక

భువనేశ్వర్, మే 13

ఒరిస్సాలో దుర్భిక్షం పరిస్థితిని ప్రత్యక్షంగా చూచేటందుకు ప్రధాని శ్రీమతి ఇందిరాగాంధీ యీ రోజు కటక్ వచ్చారు.

కటక్ సమీపంలోని చార్‌బాటి విమానాశ్రయంలో రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ సదాశివ త్రిపాఠి,రాష్ట్ర మంత్రులు, ప్రదేశ్ కాంగ్రెస్ ముఖ్యులు ఆమెకు స్వాగతమిచ్చారు.

ప్రధానివెంట పార్లమెంటరీ వ్యవహారాల స్టేట్‌మంత్రి శ్రీ జగన్నాథరావు, సమాచార ప్రసార శాఖ ఉపమంత్రి శ్రీమతి నందిని శతపథికూడా వున్నారు.

## కంప్యూటర్ల ప్రవేశం : కలకత్తా వాణిజ్య ఉద్యోగుల ప్రతిఘటన

కలకత్తా, మే 12

వాణిజ్య సంస్థలో ఎలక్ట్రానిక్ కంప్యూటర్ల ప్రవేశాన్ని నిరసించుతూ కలకత్తాలోని వివిధ వాణిజ్యసంస్థల ఉద్యోగులు నేడిక్కడ ఒక పెద్ద బహిరంగసభ జరిపారు.

## అగ్నిప్రమాదాలపట్ల శ్రీ కె.యల్. రావు ఆందోళన

హైద్రాబాద్, మే 13

ఆంధ్రలో సంభవిస్తున్న అగ్నిప్రమాదాలపట్ల కేంద్ర ఇరిగేషన్ మంత్రి డాక్టర్ కె.యల్. రావు తన తీవ్ర ఆందోళనను నేడిక్కడ వ్యక్తం చేశారు.

ఢిల్లీనుంచి యిక్కడికి వచ్చిన శ్రీ రావు ప్రమాదస్థలాల సందర్శనకు 14వ తేదీన విజయవాడ చేరుకుంటారు.

విజయవాడలో ప్రతిచోటా, అగ్నిప్రమాదాలు జరుగుతున్నవని, నిప్పును నిరోధించే గడ్డిని తయారుచేయటం ప్రమాదాల నివారణకు పరిష్కారం కాగలదని చెప్పారు.

విజయవాడవంటి పట్టణాలలో అగ్నిమాపక సిబ్బందిని పెంచాలని, పట్టణాలలో తాటాకుపాకలు వేయడానికి అనుమతించేటప్పుడు ప్రమాదాల నిరోధనపట్ల ఇతోధిక శ్రద్ధ వహించాలని అన్నారు.

# అగ్నిప్రమాదాలు జరిగిన ప్రాంతాల్లో రెవిన్యూమంత్రి, ఐ. జి. ల పర్యటన

## బాధితులకు ప్రభుత్వం పెద్దగా సహాయం చేయగలిగిన స్థితిలో లేదని ప్రకటనలు

[విశాలాంధ్ర విలేకరి]

విజయవాడ, మే 12

విజయవాడ అగ్నిప్రమాదాలు, ప్రమాదవశాత్తూ సంభవించినవేననే అభిప్రాయాన్ని రాష్ట్ర రెవిన్యూమంత్రి శ్రీ నూకల రామచంద్రారెడ్డి నేడిక్కడ పట్టణంలో అగ్నిబాధిత ప్రాంతాలను చూచి, పోలీస్ ఇన్‌స్పెక్టర్ జనరల్‌తో ముచ్చటించిన అనంతరం పత్రికా విలేకరులతో మాట్లాడుతూ అన్నారు.

విజయవాడ అగ్ని ప్రమాదాల ఫలితంగా కలిగిన ఆస్తినష్టాన్ని, ప్రాణనష్టాన్ని పరిశీలించడానికి రెవిన్యూమంత్రి శ్రీ రామచంద్రారెడ్డి నేడు పోలీస్ ఇన్‌స్పెక్టర్ జనరల్ శ్రీ ఎ. కె. కె. నంబియార్‌తో కలసి ఇక్కడకు వచ్చారు.

సాయంత్రం మంత్రి శ్రీ రామచంద్రారెడ్డి, ఉన్నతాధికారులతో కలసి పట్టణంలోని అగ్నిబాధిత ప్రాంతాలను పర్యటించి వచ్చారు.

ఆ తర్వాత ఆయన పత్రికా విలేకరులతో ముచ్చటిస్తూ విజయవాడ అగ్నిప్రమాదాలు ప్రమాదవశాత్తు సంభవించినవేనని అన్నారు. రాజకీయ స్పర్ధల ఫలితంగా ఈ ప్రమాదాలు సంభవించాయనే పుకార్లను ఆయన ఖండించారు.

అగ్నిప్రమాదాలలో నష్టపోయిన ఇండ్ల యజమానులకు రు 500/- ల చొప్పున ఇవ్వటానికి నిర్ణయించుకున్నామని, ఈ డబ్బు వెంటనే పంచిపెడతామని అన్నారు.

కాలి పోయిన ఇండ్ల యజమానులతో పాటు, ఆ ఇండ్లలో నివశిస్తూ నష్టపోయిన వారికి సహాయాన్ని యిచ్చే విషయమై ప్రస్తావిస్తూ, ఆయా కేసులను పరిశీలించి యథార్థంగానష్టపడ్డవాళ్ళవిషయంలో కలెక్టరు డబ్బు మంజూరు చేయవచ్చునని మంత్రి చెప్పారు. అద్దెకు నివసిస్తూ, నష్టపోయిన వారికి సహాయాన్ని అందజేసే విషయంలో కలెక్టర్ నిర్ణయం గైకొన వచ్చునని అన్నారు.

అగ్నిబాధితులకు ఉదారంగా విరాళాలు ఇవ్వవలసిందిగా తనను కల్సుకొన్న పట్టణంలోని వణిక్ ప్రముఖులకు మంత్రి రామచంద్రారెడ్డి విజ్ఞప్తి చేశారు.

క్లాత్ మర్చంట్స్ అసోసియేషన్‌వారు అగ్నిబాధితులకు వస్త్రాలు ఇవ్వగలమని ప్రకటించారు.

పట్టణంలో పోలీస్ స్టేషన్లను, అగ్నిమాపక దళాలను పెంచి, పటిష్టవంతంచేసే విషయమై ప్రభుత్వం పరిశీలించగలదని ఆయన చెప్పారు.

పది సంవత్సరాల క్రితం జనాభానుబట్టి పోలీస్‌స్టేషన్ల సంఖ్యను, అగ్నిమాపక దళాల సంఖ్యను నిర్ణయించటం జరిగిందని, ఈ పదిసంవత్సరాలలో జనాభా రెట్టింపైందని కనుక పోలీస్ స్టేషన్లను, అగ్నిమాపక దళాలను పెంచవలసిన అవసరం ఎంతైనా వుందని మంత్రి చెప్పారు.

ప్రధాని నిధినుండి కొంతధనం విజయవాడ అగ్నిబాధితులకు అందగలదనే ఆశాభావాన్ని శ్రీ రామచంద్రారెడ్డి వ్యక్తంచేస్తూ ఆ కేటాయింపుకోసం కృషి చేయగలనని ఆయన అన్నాడు.

యన్. జి, వోలకు జీతాలు పెంచిన దృష్ట్యానూ, వర్షాభావంవల్లా పలుప్రాంతాలలో తీవ్ర పరిస్థితులు ఏర్పడినందువల్ల ప్రభుత్వానికి రావలసినబకాయీలు, శిస్తులురాలేదనీ అందువల్ల విజయవాడ అగ్నిబాధితులకు ప్రభుత్వం నుండి పెద్దగా సహాయం అందదని మంత్రి అధికార్లకు సూచించినట్లు తెలుస్తున్నది.

మంత్రి రామచంద్రారెడ్డి, పోలీస్ ఇన్‌స్పెక్టర్ జనరల్ శ్రీ ఎ. కె. కె. నంబియార్ రేపు హైద్రాబాద్‌కు వెళ్ళి విజయవాడ అగ్నిప్రమాదానికి సంబంధించిన వివరాలను ముఖ్యమంత్రికి నివేదిస్తారు.

### గట్టి బందోబస్తు

ఇదిలావుండగా పట్టణంలో గట్టి బందోబస్తు ఏర్పాట్లు చేయబడుతున్నాయి,

కాకినాడనుండి 100 మంది ప్రత్యేక సాయుధ పోలీసులు రప్పించబడ్డారని, డిప్యూటీ పోలీస్ ఇన్‌స్పెక్టర్ జనరల్ శ్రీ ఆర్. నారాయణస్వామి చెప్పారు.

పట్టణంలో పలుప్రాంతాలలో గస్తీ ఏర్పాట్లు చేయబడ్డాయి. పోలీస్ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్ శ్రీ నారాయణస్వామి ప్రమాదప్రాంతాలను సందర్శించి సమాచారాన్ని సేకరిస్తున్నారు.

ప్రజలు బజార్లల్లో సామానులు పెట్టుకొని నేటిరాత్రికూడా కాలం గడుపుతున్నారు. 'పారాహుషార్' అంటూ వివిధ ప్రాంతాలలో వలంటీర్లు కాపలాకాస్తున్నారు.

### దుర్గా అగ్రహారంలో

ఇక్కడ మంటలు అదుపులోకి వస్తున్నాయో లేదో. దుర్గాఅగ్రహారంలో గోరీల దొడ్డిప్రక్కన డా॥ నంబూరు శ్రీధరరావుగారి ఇంటిపాకలో అగ్నిప్రమాదం సంభవించింది. అగ్నిమాపకదళాలు వెంటనే రంగంలో ప్రవేశించి మంటను అదుపులోనికి తెచ్చాయి.

నేడు జరిగిన అగ్నిప్రమాదాలను అదుపులోనికి తీసికొని రావటంలో అగ్నిమాపక దళాలు సమర్థవంతంగా కృషి చేసాయి.

# ప్రాణరక్షణకై వివిధ దేశీయుల సహకారం

## అర్జంటీనాకు సోవియట్ మందు అందచేసిన వైనం

ఇటలీ దేశంలోని ఒక రేడియో ఔత్సాహికుడూ, రోమ్, మాస్కోలలోని టెలిఫోన్‌పడతులూ,రష్యన్ డాక్టర్లూ, ఒకబ్రిటిష్ విమానయాన కంపెనీకలిసి ఇటీవల అర్జెంటీనాలో జబ్బుగావున్న ఒకయువతిప్రాణాలు కాపాడారని నేటి రాత్రి 'ఇజ్వెస్తియా' ప్రకటించింది.

గియోనెట్టి అనే ఇటాలియను బ్రెస్సియా నగరంలో రేడియో వింటూండగా బ్యూనోఐర్స్‌నుంచి 'సార్కొలిసిన్' అనేకమందు కావాలన్న విజ్ఞప్తి వినిపించింది. ఆ మందు రష్యాలోనే వుంది.

ఆ మందు వెంటనే కావాలని డాక్టర్లు విజ్ఞప్తి చేశారు. మార్తి యూతమ్‌ల్యాక్ అనే 17 ఏళ్ళవడుచుకు తక్షణం శస్త్రచికిత్స జరగవలసివుంది. ఆ మందు కావాలి.

గియోనెట్టి వెంటనే రోమ్‌లోని ఇంటర్నేషనల్ ఎక్చేంజికి ఆ వార్త తెలిపేరు, వారు మాస్కో ఎక్చేంజికి తెలిపారు. వారువెంటనే ఆరోగ్యశాఖ డ్యూటీ ఆఫీసరుతో సంప్రదించి నగరంలోని ప్రసిద్ధవైద్యు లొకరినిపిలిచేరు.

ఇద్దరు మాస్కో టెలిఫోన్ పడుచులు ఆ మందు ఒక మోతాదుతీసుకుని మాస్కోవిమానాశ్రయానికి పరుగెత్తేరు. అప్పుడే లండన్ బయలుదేరుతున్న బ్రిటిష్‌యూరపియన్ ఎయిర్‌వేస్ విమానానికి దాని నందచేశారు. ఆ కంపెనీ దక్షిణ అమెరికా వెడుతున్న వేరొక విమానంలో లండన్‌నుంచి దానిని బ్యూనోఐర్స్‌కు అందచేశారు.

మరునాడు గియోనెట్టి బ్యూనోఐర్స్ హాస్పిటల్‌వారు ప్రసారంచేసిన అభినందనల నందుకొని మాస్కోకు తెలిపారు.

"సోవియట్ మిత్రులందరకూ మార్తీ తల్లిదండ్రులు అనంతంగా అభినందనలు తెలుపుతున్నారు" అని ఆ ప్రసారం.

# ఐదిత్ మృతి

## సుహార్తో ధృవీకరణ

జకార్తా, మే 18

ఇండోనేషియా కమ్యూనిస్టుపార్టీ నాయకుడు డి.యన్. ఐదిత్ మరణించిన వార్తను ప్రధాన సైనికాధికారి జనరల్ సుహార్తో నేడిక్కడ ధృవపరిచారు.

'కొంపాక్' అనే కాథలిక్ పత్రికకు ఒక యింటర్వ్యూ యిస్తూ సుహార్తో యీ విషయం చెప్పారు.

# చైనా విమానం కూల్చివేత

## చైనా గగనసీమలో ప్రవేశించిన ఐదు అమెరికన్ ఫైటర్ విమానాల ఘాతుకచర్య

పెకింగ్, మే 12

అయిదు అమెరికన్ ఫైటర్ విమానాలు నేడు చైనా గగనసీమలోకి చొరబడి, మిస్సైలుతో ఒక చైనా విమానాన్ని నేలకూల్చివేసినని నవచైనా వార్తా సంస్థ నేటిరాత్రి ప్రకటించింది.

నేటి సాయంత్రం 4.17 గంటలకు యూనాన్ రాష్ట్రంలోని మిన్కాన్ పట్టణానికి ఈశాన్య దిశగా ప్రయోగంకోసం ఆకాశంలో ఎగురుతున్న చైనా విమానాలపై అమెరికన్ విమానాలు మిస్సైలును ప్రయోగించాయని, చైనా విమానం ఒకటి కూలిపోయినదని ఆ వార్తా సంస్థ వివరించింది,

అప్పుడు చైనా విమానాలు ఎదురు దెబ్బ తీయడం ప్రారంభించగానే, శత్రువిమానాలు దక్షిణాభిముఖంగా పలాయనం చిత్తగించాయని ఆ వార్తాసంస్థ పేర్కొన్నది.

### తీవ్రమైన కవ్వింపుచర్య

ఈ చర్యను అత్యంత తీవ్రమైన కవ్వింపుచర్యగా చైనా పరిగణిస్తున్నదని, దీనివల్ల ఉత్పన్నంకాగల తీవ్ర పరిణామాలన్నింటికీ అమెరికాయే పూర్తిగా బాధ్యత వహించవలసి వుంటుందని నవచైనా వార్తాసంస్థ హెచ్చరించింది.

### 'పీపుల్స్ డైలీ' హెచ్చరిక

అమెరికా కనుక చైనాతో యుద్ధాన్ని ప్రారంభిస్తే, చైనా ప్రజలు అమెరికాను నామరూపాలు లేకుండా సర్వనాశనం చేయగలరని చైనా కమ్యూనిస్టు పార్టీ పత్రిక 'పీపుల్స్ డైలీ' నేడు హెచ్చరించింది,

# కేరళలో యన్. జి. ఓ. ల సత్యాగ్రహ సన్నాహం

తిరువనంతపురం, మే 12

కేరళరాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులసంఘాల సంయుక్త కార్యాచరణ కమిటీ 14 వ తేదీ నుండి గవర్నర్ భవనం ముందు సామూహిక సత్యాగ్రహం ప్రారంభించడానికి నిశ్చయించింది. 24 వ తేదీ నుండి యన్.జి.ఓల సమ్మె జరుగనున్నది.

ఉద్యోగులు జట్లుజట్లుగా గవర్నర్ భవనం ముందు. నిరాహారవ్రతం, బైఠాయింపు జరుపుతారు.

# కేరళ కమ్యూనిస్టు ఉద్యమంలో ఐక్యతా ధోరణి

## వృద్ధి చెందుతున్న సూచన

తిరువనంతపురం, 13

కేరళలో కమ్యూనిస్టుపార్టీ, మార్క్సిస్టు కమ్యూనిస్టుపార్టీలు వచ్చే ఎన్నికలలో ఒక ఒప్పందానికి వచ్చి, పోటీ చేయగల అవకాశాలు అధికంగా వున్నవని ఇక్కడ రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు.

కాంగ్రెసుకు వ్యతిరేకంగా కమ్యూనిస్టు పార్టీతో కలసి పోటీచేయవలసిన అవసరాన్ని మార్క్సిస్టు కమ్యూనిస్టుపార్టీలో ఒకవర్గం వక్కాణిస్తుండగా, మరొక వర్గం దానిని గట్టిగా వ్యతిరేకిస్తున్నట్టు తెలుస్తున్నది.

ఉభయ కమ్యూనిస్టుపార్టీలు ఎన్నికలలో కలసి పనిచేస్తే, గ్రామీణ ప్రాంతంలోని మార్క్సిస్టు కమ్యూనిస్టుపార్టీ కార్యకర్తలను కమ్యూనిస్టుపార్టీ తనవైపునకు ఆకర్షించే ప్రమాదం కలదు సుమా అని ఆ పార్టీలోని ఐక్యతా వ్యతిరేకులు వాదిస్తున్నట్టు తెలుస్తున్నది.

ఇటీవల తిరువనంతపురం కార్పొరేషనుకు జరిగిన ఉప ఎన్నికలో కమ్యూనిస్టు పార్టీ - రివల్యూషనరీ సోషలిస్టు పార్టీలు బలపర్చిన అభ్యర్థి చేతిలో మార్క్సిస్టు - కమ్యూనిస్టుపార్టీ బలపర్చిన అభ్యర్థి ఓడిపోవడంవల్ల మార్క్సిస్టు కమ్యూనిస్టులలోని ఐక్యతా వ్యతిరేకులకు కొంత దెబ్బ తగిలిన దని ఇక్కడ రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు.

ఉభయ కమ్యూనిస్టు పార్టీలలో ఐక్యతా భావం ఇంతకు పూర్వంకంటె చాలా బలంగా వున్నట్టు ఆ వర్గాలవారు వ్యాఖ్యానిస్తున్నారు.

# పాక్ - చైనాల సైనిక సన్నాహాలు

## రాజ్యసభలో చావన్ ప్రకటన

న్యూఢిల్లీ, మే 13

పాకిస్తాన్, చైనాదేశాల నుంచి వేర్వేరుగాను, కలసి కట్టుగాను వస్తున్న ప్రమాదాన్ని ఎదుర్కొనడానికి అవసరమైన రక్షణచర్యలన్నింటిని ప్రభుత్వం తీసుకొన్నదని రాజ్యసభలో నేడు రక్షణ మంత్రి శ్రీ చావన్ ప్రకటించారు.

మన సరిహద్దుల ఆవల పాకిస్తాన్, చైనా దేశాలు సాగిస్తున్న సైనిక సన్నాహాలు గురించి, ప్రభుత్వానికి పూర్తిగా తెలుసునని, రణపరిణామాలను ప్రభుత్వం జాగ్రత్తగా పరిశీలిస్తున్నదని ఆయన వివరించారు.

ఉత్తర సరిహద్దులలో చైనా, పాకిస్తాన్ దేశాలు రెండు కలిసి సైనిక చర్యలు ప్రారంభించే అవకాశం లేకపోలేదని శ్రీ చావన్ ఒక 'కాల్ అటెన్షన్' నోటీసుకు సమాధానమిస్తూ పేర్కొన్నారు.

మన ఉత్తర సరిహద్దులలో గల చైనా బలాల సంఖ్య లక్షనుంచి లక్షా యాభై వేలవరకు వుండవచ్చునని రక్షణ మంత్రి అన్నారు.

# పశ్చిమబెంగాల్ కాంగ్రెస్ వ్యవహారాలు

## అజయ ముఖర్జీపై అతుల్యఘోష్‌వర్గం దాడి

కలకత్తా మే 13

పశ్చిమబెంగాల్ ప్రోటీకాంగ్రెస్ నాయకుడు శ్రీ అజయ ముఖర్జీని, బంకూరా జిల్లాలో అధిగమించాలన్న అధికార యత్నం విఫలమయ్యింది.

అతుల్యఘోష్ వర్గమే ఈ జిల్లా కాంగ్రెస్ కమిటీ సమావేశం యేర్పాటు చేసింది. శ్రీ అజయ ముఖర్జీకి వ్యతిరేకంగా ఒక తీర్మానాన్ని ప్రతిపాదించింది. అయితే అజయ ముఖర్జీ వర్గం సభ్యులు ఎక్కువగావున్న కారణంగా యీ తీర్మానం నెగ్గలేదు.

# నందా భవనం ముందు కేంద్ర ఉద్యోగుల ప్రదర్శన: రిట్రెంచిమెంటుకు నిరసన

న్యూఢిల్లీ, మే 13

కేంద్ర హోంమంత్రి నందా భవనం ముందు నిన్న 3 వేలమంది కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు ప్రదర్శన జరిపారు. సాధారణ ఉద్యోగులను రిట్రెంచిచేసి, పై క్రేజీ ఆఫీసర్లను పెంచేటందుకు తలపెట్టిన ప్రభుత్వ పథకానికి వారు తమ నిరసన తెలియజేశారు.

ఈ ప్రభుత్వ విధానాన్ని నిరసిస్తూ నినాదాలు రాసిన పెద్ద బ్యానర్లతో వారు ఇండియాగేట్ ప్రాంతంనుండి మంత్రి నివాసం వద్దకు ఊరేగింపుగా వెళ్ళారు.

నగరంలో యీ ప్రదర్శన దారి పొడుగునా పోలీసు బందోబస్తు జరిగింది.

ఉద్యోగుల సంఘాల ప్రతినిధులను కలుసుకొని వారి కోర్కెల గురించి వివరంగా చర్చలు జరపడానికి హోంమంత్రి సమ్మతించారు.

కేంద్ర ఉద్యోగుల, తదితర కార్యాలయాల ఉద్యోగుల కోర్కెల విషయంలో ఒక విస్తృతమైన దేశవ్యాపిత ఉద్యమాన్ని నిర్వహించేటందుకు యోచిస్తున్నామని కేంద్ర ఉద్యోగుల సంఘాల సమాఖ్య కార్యదర్శి శ్రీ ఇ. ఎక్స్. జోసెఫ్ పత్రికలవారితో చెప్పారు.

రిట్రెంచిమెంట్‌లతోపాటు, కేంద్ర వుద్యోగులు అనేక యితర సమస్యలుకూడా ఎదుర్కోవలసి వస్తున్నదని ఆయన తెలియజేశారు, ఉద్యోగుల ప్రధానమైన కోర్కెలు తీర్చబడనందువల్ల వాటి పరిష్కారానికి సరైన యంత్రాంగం లేనందువల్లా దుర్భరమైన పరిస్థితి యేర్పడుతున్నదని ఆయన చెప్పారు.

### ఉపాధ్యాయుల కోర్కెలకు ప్రధాని తిరస్కారం

విద్యారంగానికి హెచ్చు మొత్తాల్ని కేటాయించాలన్న సెకండరీ పాఠశాల ఉపాధ్యాయుల సంఘం కోర్కెను ప్రధాని తిరస్కరించారు.

నిన్న వారి ప్రతినిధివర్గం శ్రీ సత్యప్రియ రాయ్ నాయకత్వాన ప్రధానిని కలుసుకొన్నది.

ఈ సంవత్సరం విద్యావ్యయాన్ని వంద కోట్ల రూపాయల నుండి ఒకేసారి 81 కోట్లకు కోతపెట్టారు, అని శ్రీరాయ్ పత్రికలవారితో చెప్పారు. కేంద్ర ప్రణాళికల్లో పదిశాతం, రాష్ట్ర ప్రణాళికల్లో 20 శాతం విద్య కోసం కేటాయించాలని అఖిలభారత సెకండరీ ఉపాధ్యాయుల సమాఖ్యకోరుతున్నది.

ఈ ఫెడరేషన్‌వారు రేపు పార్లమెంటుకు ఒక పెద్ద మహజర్ సమర్పించబోతున్నారు.

సెకండరీ విద్యకుకూడా, యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ పద్ధతిలోనే ఒక గ్రాంట్స్ కమిషన్ నియామకం జరగాలనీ, ఉపాధ్యాయుల వేతనాల స్కేళ్ళను దేశమంతటా ఒకే విధంగా ఉండేలా సర్దుబాటు చేయాలనీ వారి పని పరిస్థితులను మెరుగుపరచాలనీ యీ మహజర్ కోరుతూ వుంది.

# బ్రిటిష్ గయానా స్వాతంత్రదినోత్సవం

## పలుదేశాలకు ఆహ్వానాలు

జార్జిటౌన్, మే 13

మే 26 న జరుగుతున్న బ్రిటిష్ గయానా స్వాతంత్ర్య దినోత్సవంలో పాల్గొనేటందుకు వచ్చిన ఆహ్వానాల్ని యిప్పటికి బ్రిటన్, అమెరికా, కెనడా, జపాన్ దేశాలు ఆమోదించాయి.

మ్యాన్స్‌ఫీల్డ్

వివిధ
రకముల బండ్ల కోసం
101 వివిధ రకాల
టైర్లు తయారు
చేస్తూంది

మ్యాన్స్‌ఫీల్డ్‌వారి టైర్లు కార్లకు, ట్రక్కులకు,, ట్రాక్టర్లకు, జీపులకు, మోటారు సైకిళ్ళకు, స్కూటర్లకు జంతువులు లాగే బండ్లకు...నిజానికి అన్ని రకాల టైర్లు గలవు. ప్రతి టైరూ విశిష్టమైనది. ప్రతిదీ ప్రత్యేకంగా శోధింపబడి ప్రత్యేకంగా శ్రేష్టతా ప్రమాణము నిలిపి యుంచబడింది.

తయారు చేయువారు: మద్రాసు రబ్బర్ ఫ్యాక్టరీ (లిమిటెడ్) మ్యాన్స్‌ఫీల్డ్ టైర్ అండ్ రబ్బర్ కంపెనీ యు. ఎస్. ఎ. వారి సహకారముతో.

టైర్ల నిర్మాణంలో 50 సంవత్సరాల అనుభవం.

MRF

మ్యాన్స్‌ఫీల్డ్- కండబలంగల టైరు

MSFR. 17/392 Tel

# శ్రీశైలం ప్రాజెక్టు మునక బాధితులపై ప్రత్యేక కమిటీ

## మునకబాధితుల సంస్థ కార్యవర్గం డిమాండ్

కర్నూలు, మే 12

శ్రీశైలం హైడల్ ప్రాజెక్టు క్రిందవున్న భూములు మునిగిపోయే రైతులకు యెంత నష్టపరిహారం యివ్వాలో నిర్ణయించడానికి అనధికార సభ్యులతో ఒక ప్రత్యేక కమిటీని యేర్పాటు చేయాలని శ్రీశైలం హైడల్ ప్రాజెక్టు మునక బాధితుల సంస్థ నిన్న ఆంధ్ర రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది.

ఈ సంస్థ కార్యవర్గ సమావేశం నిన్న యిక్కడ జరిగింది. ఈ సమావేశానికి శాసన మండలి సభ్యులు శ్రీ మద్దూర సుబ్బారెడ్డి అధ్యక్షత వహించారు.

ఈ కమిటీ యేర్పాటు చేయబడేంత వరకు యీ ప్రాంతంలో భూమి స్వాధీనం చేసుకొనే కార్యక్రమాన్ని రద్దుచేయవలసిందిగా యీ సమావేశం విజ్ఞప్తి చేసింది.

ఇందుకై కమిటీని యేర్పాటు చేయాలన్న రైతుల డిమాండ్‌పట్ల ప్రభుత్వం సానుభూతితో ఆలోచించకపోతే, దెబ్బతిన్న గ్రామాల ప్రజలు శాంతియుత కార్యాచరణకు పూనుకోవాలని యీ సమావేశం నిర్ణయించింది.

## పుస్తకములు

తెలుగు, హిందీ స్వయంశిక్ష: తీరిక వేళలలో ఇతరుల సహాయం లేకనే హిందీ అతి సులభంగా చదువను, వ్రాయను, మాట్లాడను త్వరగా నేర్చుకొనవచ్చు. వెల రు 4-50 పోస్టు ఖర్చు 0-95. జగన్నాథ్ అండ్ కో., పి. బి. 1839, మద్రాసు-1.

# ఒరిస్సాలో సమ్మెదారులపై పోలీసు కాల్పులు

## ముగ్గురి మృతి

భువనేశ్వర, మే 12

కోరాపుట్ జిల్లా రాయగడలో సమ్మె చేస్తున్న ఒక పేపరుమిల్లు కార్మికులపై మంగళవారంనాడు పోలీసులు కాల్పులు జరిపారు. ముగ్గురు కార్మికులు మరణించారు. ఒకరు తీవ్రంగా గాయపడ్డారు. కార్మికులే ముందుగా తమ మీద గెడ్డలూ, బెడ్డలూ విసిరినందువల్లనే తాము కాల్పులు జరపాల్సి వచ్చిందని పోలీసులు చెబుతున్నారు. తమ వారు కొందరికి గాయాలు తగిలాయని కూడా చెబుతున్నారు.

మే 3 వ తేదీనుండి ఈ మిల్లులో సమ్మె జరుగుతున్నది.

కంపెనీకి చెందిన కాపలాసిబ్బందిని మిల్లులోకి వెళ్ళకుండా సమ్మెదారులు అడ్డగించి కట్టువిప్పి వ్యవహరించడంతో తాము జోక్యం కల్పించుకొని ముందు బాష్పవాయువు ప్రయోగించామనీ, ఆ తరువాత కాల్పులు జరిపామని పోలీసులు చెబుతున్నారు.

# స్వతంత్రపార్టీ రాష్ట్ర పార్లమెంటరీబోర్డు సమావేశం

హైదరాబాద్, మే 12

స్వతంత్రపార్టీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పార్లమెంటరీ బోర్డు సమావేశం మే 19 న నెల్లూరుజిల్లా బుచ్చిరెడ్డిపాలెంలో జరుగుతుంది.

రాష్ట్ర శాసనసభనుండి శాసన మండలికి జరిగే ఎన్నికల విషయం సమావేశం చర్చించుతుంది. వచ్చే సాధారణ ఎన్నికలలో, అసెంబ్లీకి, పార్లమెంటుకు అభ్యర్థులను నియమించే విషయం గూడా చర్చించుతుంది.

---

బీహార్ రాష్ట్రంలో హోటళ్ళలో గురువారంనాడు బియ్యం వాడకం నిషేధించారు



1 నుండి 10 హెచ్. పి. వరకు

ప్రతి వ్యవసాయదారునికి విద్యుచ్ఛక్తి వలన నీరు లభించును

కిర్లోస్కర్ ఎలెక్ట్రిక్ పంపింగ్ సెట్

చిన్న చిన్న గ్రామాలకు, పొలాలకు విద్యుచ్ఛక్తి యొక్క వైర్లు వ్యాపించాయి. మీ స్వాధీనములో నున్న భూమికి, వైర్లలో నుండే విద్యుచ్ఛక్తి ద్వారా, నీరు అందుతూండుటకు, ఇప్పుడు కిర్లోస్కర్ ఎలెక్ట్రిక్ పంపింగ్ సెట్‌ను పెట్టండి.

కిర్లోస్కర్ ఎలెక్ట్రిక్ పంపింగ్ సెట్ దృఢంగా, పొదుపుగా, వాడుకకు సులభంగా నుండును.

కిర్లోస్కర్ బ్రదర్స్. లి. కిర్లోస్కర్‌వాడి, జిల్లా: సాంగ్లి

బ్రాంచి ఆఫీసు: మెసర్సు కిర్లోస్కర్ బ్రదర్స్ లిమిటెడ్.,
339/2 & 3. రాష్ట్రపతిరోడ్. సికింద్రాబాద్. (ఆం. ప్ర.)

**Important Document Now Available**

**23rd Congress of the CPSU**

pp 440 Rs 0 70

Containing :

1. Report of the Central Committee of the CPSU to the 23rd congress of the CPSU Delivered by L. Brezhnev
2. L. Brezhnev s Concluding Speech
3. Report on the Directives for the Five-Year Economic Development Plan of the USSR for 1966 1970 Delivered by A. Kosygin.
4. A. Kosygin s Concluding Remarks
5. Resolution of the 23rd congress of the CPSU on the report of the Central Committee of the CPSU
6. Resolution of the 23rd congress on the "Directives of the 23rd congress of the CPSU for the Five-Year Economic Development Plan of the USSR for 1966-1970."
7. Resolution of the 23rd congress on Partial changes in the CPSU Rules.
8. Statement of 23rd congress concerning US Aggression in Vietnam and others.

Postage extra : Book your order with :

VISALAANDHRA PUBLISHING HOUSE,
VIJAYAWADA 2.

VISALAANDHRA BOOK HOUSE,
Sultan Bazar, Hyderabad.

ADMARK

# పార్లమెంటరీ కాంగ్రెస్ కార్యవర్గ ఎన్నికలు

## 24 స్థానాలకు 66 మంది నామినేషన్ పత్రాలు

న్యూఢిల్లీ, మే 12

పార్లమెంటరీ కాంగ్రెసుపార్టీ కార్యవర్గానికి మే 17 న జరుగనున్న ఎన్నికలలో పోటీ చేయడానికి లోక్‌సభనుంచి 50 మంది, రాజ్యసభనుంచి 16 మంది నామినేషన్లు వేశారు. లోక్‌సభనుంచి 16 మంది, రాజ్యసభనుంచి 8 మంది కార్యవర్గ సభ్యులు ఎన్నిక కావలసి వుంది. నామినేషను పత్రాలు దాఖలు చేసిన వారిలో రైల్వే మంత్రి శ్రీ ఎస్. కె. పాటిల్ కూడ వున్నారు.

ఈ ఎన్నికలలో గట్టి పోటీలు జరగవచ్చునని దీనిబట్టి తెలుస్తున్నది.

ఉప నాయకులుగా శ్రీయుతులు గోపాలరెడ్డి, వై. పి. మండల్, శ్రీమతి సహోదర బాయిరాయ్. శ్రీమతి రేణుకారేలు లోక్‌సభ నుంచి పోటీ చేస్తున్నారు.

రాజ్యసభ ఉపనాయకత్వ పదవికి శ్రీయుతులు యం. పి. భార్గవా, ఎస్.ఎం. ఘోష్‌లు నామినేషన్లు వేశారు.

లోక్‌సభ ప్రధాన కార్యదర్శి పదవికి శ్రీయుతులు విభూతి మిశ్రా, కె. సి. పంత్, సి.ఆర్. బసప్ప, రఘునాథసింగ్, పి. వెంకటసుబ్బయ్య, జి. యస్. ముసాఫిర్, శ్రీమతి టి. లక్ష్మీకాంతమ్మ, శ్రీమతి రేణుకారేలు. రాజ్యసభ ప్రధాన కార్యదర్శి పదవికి శ్రీయుతులు ఆర్. ఎస్. పంపూరి, యం.పి.శుక్లా, సురేష్‌దేశ్, కె. యస్. రామస్వామి, యస్. శ్రీ రామరెడ్డి, నారాయణ పట్రా, జె.యస్. పహాడియాలు నామినేషన్ పత్రాలు దాఖలు చేశారు.

కోశాధికారి పదవికి శ్రీయుతులు సంతోష్ సింగ్, హెచ్. సి. హెడా, బి. యల్. చందన్, సేట్ అచల్‌సింగ్, రామేశ్వర్ తాంతియా, శ్రీమతి రేణుకారేలు నామినేషన్లు వేశారు.

ప్రస్తుతమున్న కార్యవర్గ సభ్యులందరూ నామినేషన్లు వేశారని తెలియవచ్చింది. కార్యవర్గ సభ్యత్వానికి నామినేషన్లు వేసినవారిలో శ్రీయుతులు కె. డి. మాళవ్యా, భగవత్ ఝా ఆజాద్, హెచ్. సి. మాథుర్, రవీంద్రవర్మ, డాక్టరు రామ సుభాగ్‌సింగ్‌లు వున్నారు.

కాంగ్రెసు పార్లమెంటరీపార్టీ లోక్‌సభ, రాజ్యసభలనుంచి ఒక్కొక్క ఉప నాయకుణ్ణి 3 గురు ప్రధాన కార్యదర్శులను కోశాధికారి, 24 మంది కార్యవర్గ సభ్యులను ఎన్నుకోవాల్సి వుంది.

ఉప సంహరణలు పూర్తి అయిన అనంతరం శనివారం సాయంత్రం పోటీచేసే అభ్యర్థుల తుదిజాబితా ప్రకటించబడుతుందని తెలియ వచ్చింది.

# ఇర్రిగేషన్, విద్యుత్తు అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక

## కేంద్ర ప్రభుత్వం పరిశీలన

న్యూఢిల్లీ, మే 13

కృష్ణ, గోదావరి నదీజలాల వివాద పరిష్కారం కోసం తాను యీ మధ్యనే మహారాష్ట్ర సందర్శించాననీ, వచ్చే కొలది రోజుల్లో తాను తిరిగి ఆంధ్ర మైసూర్ రాష్ట్రాలకు వెళుతున్నాననీ ఆ తదుపరి మూడు రాష్ట్రాల ముఖ్యమంత్రుల సమావేశం జరుగుతుందని కేంద్ర యిరిగేషన్ మంత్రి శ్రీ ఫక్రుద్దీన్ అలీ అహ్మద్ యీ రోజు లోక్‌సభ ప్రశ్నోత్తరాలసమయంలో చెప్పారు.

దేశంలో మిగిలి వున్న నీటిపారుదల, విద్యుచ్ఛక్తి వుత్పత్తి వనరుల వినియోగం కోసం త్వరలోనే 25 సంవత్సరాల ప్రణాళిక ఒకదానిని సిద్ధంచేసే విషయం ప్రభుత్వం పరిశీలిస్తున్నదని యిరిగేషన్‌శాఖ సహాయమంత్రి శ్రీ కె. యల్. రావు అంతకు ముందు చెప్పారు.

ఈ కొత్త ప్రణాళికను విద్యుచ్ఛక్తి క్రింద 10 వేలకోట్లు, నీటిపారుదలక్రింద 6వేల కోట్ల రూపాయలు అవసరం వుండగలదని అంచనా వేస్తున్నట్లు ఆయన చెప్పారు.

# కర్నూలు సమీపంలో కొట్లాటలో ఒకరి మరణం!

హైదరాబాద్, మే 12

కర్నూలు సమీపంలో యుదర్కాల అనే గ్రామంలో గత మంగళవారం యిరుపక్షాలకు జరిగిన కొట్లాటలో ఒకరు చనిపోయారు. మరి ముగ్గురు గాయపడ్డారని యిక్కడ అధికారికంగా తెలియ చేయబడింది.

# అలహాబాద్ మ్యూజియంలో కోశాంబి రాజుల నాణాలు

అలహాబాద్, మే 13

కోశాంబినగర శిథిలాల్లో దొరికిన చాలా నాణాలు యిప్పుడు అలహాబాద్ పురావస్తు ప్రదర్శనశాలలో భద్రపరచబడివున్నవి. వాటి మీద ముద్రించబడివున్న రాజుల పేర్లు, వారు ఎక్కడివారో, యేనాటి వారో మాత్రం యింత వరకు నిర్ధారణ కాలేదు. అని ఈ ప్రదర్శనశాల డైరెక్టర్ శ్రీ యస్. కాలా నేడిక్కడ ఒక గోష్ఠిలో చెప్పారు.

ఈ నాణాలలో ఒకటి క్రీస్తుకు పూర్వం 150 సంవత్సరాల క్రితం వుండిన [illegible]. జ్యేష్ఠ మిత్ర, రాధా మిత్ర, ప్రజాపతిమిత్ర మొదలైన రాజుల పేర్లుగల నాణ్యాలు కూడా వాటిలో వున్నవి. ఈ తొమ్మిదిమంది కోశాంబిరాజ్యాన్ని పాలించిన మిత్రరాజవంశంవారని ఆయన చెప్పారు.

---

అణ్వస్త్రవ్యాప్తి నివారణ సభకు చైనాను ఆహ్వానించాలని రాబర్టు కెన్నెడీ సూచించారు.

# ఆంధ్ర యూనివర్శిటీ యం. బి. బి. యస్. ఫైనల్ పరీక్షా ఫలితాలు

వాల్తేరు, మే 11

ఆంధ్ర విశ్వవిద్యాలయం 1966 ఏప్రిల్-మే మాసాలలో నిర్వహించిన యం. బి. బి. యస్ [ఫైనల్] పరీక్షలలో ఉత్తీర్ణులయిన విద్యార్థుల నెంబర్లు యీ దిగువ నిస్తున్నాం.

## పార్టు (1)టి. పి. హెచ్, ఇ. యస్. టి. లలో

1743 744 746 747 748 749 750 751 752 753 754 755 756 761 762 763 764 765 766 768 769 770 771 772 773 774 775 776 777 779 780 781 782 783 784 785 786 787 789 790 791 792 793 794 795 796 799 1800 01 02 03 04 05 06 07 08 09 10 11 15 16 17 18 19 22 61 71 72 73 88 99 900 01 02 03 04 05 06 07 08 09 10 11 12 13 14 15 16 17 18 19 20 21 23 24 38 39 40 42 46 78.

2005 06 07 08 09 10 11 12 13 14 15 16 17 18 19 21 22 25 26 27 28 30 31 32 33 34 35 36 37 38 39 40 41 42 43 44 46 48 59 61 62 64 67 68 70 71 73 75 2126 ఎ 27 30 30 ఎ.

పార్టు II

ప్రథమశ్రేణి: 1927 29 35 60 2097 88 2118

ద్వితీయశ్రేణి 1800 2 5 15 18 26 31 32 34 36 37 41 42 44 45 46 47 49 50 52 53 54 56 57 58 61 64 65 950 53 55 56 63 64 65 67 70 72

2077 78 79 81 82 83 84 85 86 89 91 93 94 95 96 98 99 100 01 02 03 05 06 07 08 09 10 11 13 14 15 16 17 19 20 21 23 24 25.

ప్రివెంటివ్, సోషల్‌మెడిసిన్ : 1793 99 1803 04 06 07 08 09 10 11 12 14 19 23 24 38 39 40 48 51 55 59 63 66 67 74 75 1927 30 34 35 37 39 40 48 51 57 58 62 66 95 96 2051 52 57 58 59 61 62 63 66 67 68 69 71 72 73 74 75 80 90 92

మెడిసిన్ : 1808 16 17 19 22 24 25 28 48 53 62 67 68 81 82 88 89 90 1928 31 40 48 49 52 54 57 58 60 66 71 78 80 92 97 98

2056 62 80 112 27 36 37 41 42

సర్జరీ : 1799 806 08 23 28 30 33 38 39 40 48 55 62 63 67 69 75 77 79 81 84 87 92 93 94 95 940 49 52 62 66 74 76 82 90 92 2000 01 నుండి 04 51 58 61 80 90 92 97 2112 22 26-ఎ, 30 30-ఎ 38 43 44 46.

అబ్‌స్టెట్రిక్స్ గైనకాలజీ: 1798 1803 04 06 17 19 22 23 24 25 28 30 38 40 55 63 66 67 68 77 80 84 88 96 97 1926 27 28 31 38 39 48 49 51 52 57 58 62 73 79 80 81 91 93.

2052 65 71 74 75 90 112 26 30 31 47 48 49 50.

ఈ క్రింది నెంబర్ల ఫలితాలు తరువాత ప్రకటించబడుతాయి.

1801 43 89 914 2070 104 35 40.

ఈ సంవత్సరం మార్చిలో ఆంధ్ర విశ్వవిద్యాలయం నిర్వహించిన ఈ దిగువ పరీక్షలలో విద్యార్థుల ఫలితాలు

## మ్యూజిక్ డిప్లొమా

2 3 9 11 12 13 18 19 20 21 23 28 30 32 33.

## ఓరియంటల్ లెర్నింగ్-ప్రొఫిషియెన్సీ సర్టిఫికేటు

ప్రథమశ్రేణి: 785 ఎ మాత్రమే
ద్వితీయశ్రేణి: 961 మాత్రమే
తృతీయ శ్రేణి: లేదు.

# రు 146 కోట్లకు పైగా గుప్తధనం

## గత మార్చినాటికి వెల్లడి చేయబడిందని రాజ్యసభలో వివరణ

న్యూఢిల్లీ, మే 11

గుప్తధనాన్ని స్వచ్ఛందంగా బయట పెట్టేందుకు ప్రభుత్వం ప్రకటించిన పథకం ప్రకారం రు. 146,53,72,524 ల గుప్తధనం వెల్లడించబడిందని ఆర్థికశాఖమంత్రి శ్రీ శచీంద్రచౌదరీ నేడు రాజ్యసభలో తెలియచేశారు.

శ్రీ మహావీరదాస్ మరికొందరు సభ్యులు అడిగిన ప్రశ్నకు ఆయన సమాధానం చెబుతూ గత మార్చి 21 తేదీ నాటికి 1225 మంది తమ గుప్త ధనాన్ని వెల్లడించారని తెలిపారు.

# జనవరిలో ఖనిజోత్పత్తి తగ్గుదల

న్యూఢిల్లీ, మే 12

గత జనవరిలో ఖనిజాలఉత్పత్తి రు 19.3 కోట్లు మాత్రమే జరిగిందని అంతకుముందు నెలకంటె ఈ ఉత్పత్తి 7 శాతం తక్కువని భారత గనులసంఘం తయారుచేసిన అంచనాల నివేదికలో పేర్కొన్నారు.

డిసెంబరునెల ఉత్పత్తి రు 20.7 కోట్ల మేరకువుంది.

ఈ ఉత్పత్తి తగ్గుదల బొగ్గు, మాంగనీస్, సున్నపురాయి ఉత్పత్తిలో ఏర్పడిన తరుగుదల కారణమని తెలిపారు.

గోవాకు సంబంధించిన లెక్కలు దీనిలో కలపలేదు.

# అగ్ని ప్రమాదాలు

(1వ పేజీ తరువాయి)

నేటుదాకా అగ్ని బయలుదేరింది. అయితే ఈ మూడుసార్లు కూడా మంటను వెంటనే ఆర్పివేయడం జరిగింది

## సత్యనారాయణ పురంలో

విజయవాడ, మే 12

సత్యనారాయణపురం ఓగిరాలవారి వీధిలో శ్రీ పిళ్ళారావు యింటిలోని దొడ్డి వైపునవున్న గదిలో నేటిరాత్రి గం. 12-30 లకు అకస్మాత్తుగా మనిషి యెత్తున మంటలు లేచాయి.

వెంటనే ఆ ప్రాంతంలోని ప్రజలు మంటలను ఆర్పివేశారు.

ఆ యింటికి వెనుకవైపున మునుగుకాల్వ రైలు కట్ట వున్నాయి.

మంటలు లేచిన ప్రదేశంలో బొగ్గుల బస్తా, దాని పైన తాటాకుల బుట్టవున్నాయి. నిప్పు తాటాకుల బుట్టకు అంటుకొని మనిషి యెత్తున మంటలు లేచాయి.

మంటలు ఒకసారి అకస్మికంగా లేచేటప్పటికి ఆ చుట్టుప్రక్కల వున్న ప్రజల ఆర్తనాదాలు మిన్నుముట్టాయి. ప్రజలు చాల కలతచెందుతున్నారు.

నేటిరాత్రి, క్రితంరాత్రి ప్రజలు నిదురపోకుండా కాపలా కాస్తున్నారు. స్త్రీలుకూడ నిదురలేకుండా భయానకస్థితిలో ఉన్నారు.

## విద్యుత్ దీపాలు లేనిస్థితి

సత్యనారాయణపురంలోని, పూరిపాకలు, పెంకుటిండ్లు వున్న ప్రదేశాలలో విద్యుత్తు దీపాలులేని కారణంగా చీకటిమయంగా వున్నది. అలాంటి ప్రదేశాలలో విద్యుత్తు దీపాలు వెంటనే అమర్చాలని ప్రజలు కోరుతున్నారు.

## బావాజీ పేట సీతన్న పేటలలో

నేటి రాత్రి బావాజీపేట, సీతన్న పేటలలో ప్రజలు మైకులు పెట్టుకుని ప్రజలను హెచ్చరిస్తూ కాపలా కాశారు. ఈ పేటల లోని ప్రజానీకం మొత్తంగా నిద్ర లేకుండా రాత్రంతా కాపలాకాస్తూనే ఉన్నారు.

ఈ పరిస్థితి యెంతకాలం వుంటుందోనని ప్రజానీకం ఆందోళన చెందుతున్నది.

కాశేశ్వరరావు రోడ్డులో నేటి ఉదయం 11 గంటలకు అగ్నిప్రమాదం సంభవించి మూడు ఇండ్లు దగ్ధమైపోయాయి.

ఇంటివారు ఎవరూ లేని సమయంలో ఈ ప్రమాదం సంభవించినట్లు తెలుస్తున్నది. ప్రమాదం సంభవించినప్పుడు దగ్గరలో 7, 8 సంవత్సరాల బాలిక మాత్రమే ఉన్నది.

ఈ అగ్ని ప్రమాదం అనుమానాస్పదమైన పరిస్థితుల్లో సంభవించినట్లు తెలుస్తున్నది.

## వినోబాటాకీస్ సమీపంలో

నేటి ఉదయం వినోబాటాకీసు సమీపంలో జరిగిన అగ్నిప్రమాదంలో ఇక్కడి [illegible] ఇండ్లు దగ్ధమైపోయినట్లు తెలుస్తున్నది.

గాంధీనగర్‌లో [illegible] సమీపంలో ఒకపందిరి తగులబడిపోయింది.

విజయవాడ గట్టువెనుక వాగాని కుమ్మరిపాలెంలో కూడా అగ్నిప్రమాదం సంభవించినట్లు తెలుస్తున్నది. నష్టం వివరాలు ఇంకా తెలియరాలేదు.

విజయవాడ పట్టణంలో ఈ రోజు కూడా ఉష్ణోగ్రత తగిన మోతాదు లేకపోయి పెరిగిన సూచనలు కన్పిస్తున్నాయి.

పాతతాటాకు, వేయబడిన ఇండ్లు సూర్యరశ్మికే భగ్గున మండుతున్నాయా అనేంతగా వాతావరణం భగ్గున మండి పోతున్నది.

ఏలూరు కాల్వ, రైవస్ కాల్వల ఇరు ప్రక్కలా పందలాది మంది ప్రజలు సామానులు చేరవేసుకొని కాలం గడుపుతున్నారు. పట్టణంలోని వివిధప్రాంతాలలో ప్రజలు తమ సామానులు ఇళ్ళలో పెట్టుకొని కాలక్షేపం చేసే ధైర్యం చేయలేకపోతున్నారు.

## అరెస్టులు

సంఘ ద్రోహులు, రౌడీలుగా పరిగణించబడుతున్నవారిని పెద్ద మందిని పోలీసులు ముందు జాగ్రత్తకోసం నిర్బంధంలోకి తీసుకొన్నారు.

## బియ్యం పంపిణీ

రైస్ మిల్లర్సు అసోసియేషన్‌వారు ఇస్తున్న 34 బియ్యపు బస్తాలను పట్టణంలో వివిధ ప్రాంతాలలో అగ్నిబాధితులకు పంచి పెడుతున్నారు.

## మంచినీటి సరఫరా పట్ల మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యం

ఇండ్ల కప్పులను తడుపుకోటానికి కాదు గదా, గొంతు తడుపుకోటానికైనా నీరు దొరకక ప్రజలు నానాఇబ్బందులు పడుతున్నారనీ. నిన్న అగ్నిబాధితుల సహాయక కమిటీ సమావేశంలో పలువురు ప్రముఖులు విజ్ఞప్తి చేసినా మంచినీటి సరఫరాకు తగుఏర్పాట్లు చేయవలసిందిగా జిల్లాకలెక్టర్ మున్సిపల్ కమీషనర్‌ను సూచించినా, పరిస్థితిమాత్రం ఏ కొంచెంకూడా మెరుగుపడలేదు. కుళాయిలలో నీరు రావటంలేదు. ప్రజలు నానా ఇబ్బందులకు గురవుతున్నారు.

మున్సిపాలిటీకి నాల్గువ్యానులు మాత్రమే ప్రజలకు మంచినీటిని అందజేసేందుకు పనిచేస్తున్నట్లు తెలుస్తున్నది.

అవసరంగా లారీలను బాడుగకు తీసుకొని నీటిసరఫరా ఏర్పాట్లను ఇతోధికంగా పెంచవలసిందని కోరగా, ఇందుకు కొటేషన్లు పిలవబడి వుంటుందని. ఇంకా [illegible] కారణాలు చెబుతూ ప్రజలకు మంచినీటి సరఫరా చేయటంపట్ల మున్సిపల్ అధికారులు నిర్లక్ష్యం చూపుతున్నారని తెలుస్తున్నది.

# ఆస్పత్రిలో మరొకరి మరణం

(విశాలాంధ్ర విలేకరి)

విజయవాడ, మే 12

విజయవాడలో అగ్నిప్రమాదానికి గురై ఆస్పత్రిలో చేర్పించబడిన మరో వ్యక్తి మరణించారు. [illegible]

ఆస్పత్రిలో చేర్పించబడినవారిలో ఇరువురు మరణించగా, పట్టణంలో 11 వ తేదీ అగ్నిప్రమాదాల్లో మొత్తం 14 మంది అక్కడికక్కడే మరణించారు. [illegible] 10 వ తేదీన కృష్ణలంక అగ్నిప్రమాద సంఘటనంగా [illegible] ముగించింది.

మొత్తం ఇప్పటికి పట్టణంలో అగ్ని ప్రమాదాలవల్ల 17 మంది అసువులు బాశారు.

ఆస్పత్రిలో ఇంకా 7 గురు చికిత్స పొందుతున్నారు.

# రెడ్డిపాలెంలో 80 ఇండ్లు [illegible] ప్రీతి

వేటపాలెం, మే 13

గుంటూరుజిల్లా వేటపాలెం పంచాయతీ సమితి పరిధిలోగల రెడ్డిపాలెం గ్రామంలో ఈనెల 10 వ తేదీన సుమారు 80ఇళ్ళు అగ్నికి గురిఅయినవి. సుమారు రు 80,000ల నష్టం. ఈ గ్రామవాసులు [illegible] పెంచి, కట్టెలు కొట్టుకొని జీవనం గడుపుతున్నారు. వీరు చాల దీనతనములో వున్నారు. ఉండుటకు యిండ్లు లేక కుటుంబములు చెట్టా చెదరైనవి.

# మృతుల కుటుంబాలకు రు 100 లు

## మంత్రి ప్రకటన

(విశాలాంధ్ర విలేకరి)

విజయవాడ, మే 12

విజయవాడ అగ్నిప్రమాదాలలో మరణించిన వారి కుటుంబాలను ఆదుకునే నిమిత్తం ప్రభుత్వం ఒక్కొక్క కుటుంబానికి రు 100 చొప్పున సహాయం అందజేయగలదని, మరణించిన వ్యక్తి ప్రభుత్వోద్యోగి అయిన పక్షంలో అతని కుటుంబానికి మూడు నెలల వేతనంతో సమానమైన మొత్తం ఎక్స్‌గ్రేషియా పద్ధతి లేకుండా అందజేయబడుతుందని రెవిన్యూమంత్రి శ్రీ రామచంద్రారెడ్డి నేడిక్కడ చెప్పారు.

కృష్ణలంక అగ్నిప్రమాదంలో తన కుటుంబం వారంతా చనిపోగా ఒక్కరే మిగిలిన [illegible] అనే వృద్ధురాలికి వృద్ధాప్య పెన్షను ఏర్పాటు చేయటం ద్వారాగాని, మరోవిధంగాగాని, సహాయం చేయగలమని ఉన్నతాధికారులు చెప్పినట్లు తెలుస్తున్నది.

# రాజమండ్రిలో 8 పాకల దగ్ధం

రాజమండ్రి, మే 13

రాజమండ్రి ఇన్నీస్‌పేట ముత్యాలమ్మ గుడివద్ద 8 కుటుంబాలు కాపురముంటున్న 8 పూరిపాకలు నిన్న మధ్యాహ్నం 2½ గంటలకు కాలిపోయాయి. సుమారువేలరూపాయల నష్టమని అంచనా. వెంటనే స్థానిక ఫైర్ సర్వీసువారువచ్చి మంటల నార్పడంలో కృషి చేశారు.

గాలిపాటు తీవ్రంగా లేకపోయిందిగాని, చాల పెద్ద ప్రమాదానికి దారితీసే దుర్ఘటన తప్పింది.

బెజవాడ, గుంటూరు ప్రాంతాల దారుణ అగ్ని ప్రమాదాలను, ప్రాణ నష్టాలను నేటి పేపర్లలో చదివిన ప్రజలు ఏ కొంచెం అగ్ని ప్రమాదం సంభవించినా తల్లడిల్లిపోతున్నారు

తెలుపు ఆయింట్‌మెంట్

బి-టెక్స్

తామర, దురద, కురుపులు, గజ్జి, మొటిమలు, పుండ్లు, చలతో చెయ్యి కాలు పగుళ్లకు, జంతువుల దేహముమీద గాయములకు వాడినచో అవి తప్పక నయమగును

స్టాకిస్టులు: [illegible] విజయవాడ

ఇపుడు ప్రదర్శింపబడుచున్న అన్ని థియేటర్లలోను వెండితెర నవల దొరకును. వెల 100 పైసలు మాత్రమే.

విశాలాంధ్ర విజ్ఞాన సమితి తరఫున ఎడిటర్, ప్రింటర్, అండ్ పబ్లిషర్ కాట్రగడ్డ రాజగోపాలరావు. స్వతంత్ర ఆర్ట్ ప్రింటర్స్, విజయవాడ-4. ప్రధాన సంపాదకులు ఏటుకూరు బలరామమూర్తి.